
సమాజం
రూ॥ 60/-
పేజీలు: 64
ప్రతులకు:
నవచేతన పబ్లిషింగ్ హౌస్
గిరిప్రసాద్ భవన్, బండ్లగూడ(నాగోల్),
హైదరాబాద్-68, ఫోన్: 29884454/53
Email ID: navachethanaph@gmail.com
నవచేతన బుక్ హౌస్
అబిడ్స్, బండ్లగూడ,
హిమాయత్‌నగర్ (హైదరాబాద్)
హన్మకొండ.



www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★★★



పార్లమెంట్ నిరవధిక వాయిదా — 05
త్వరలోనే సొంత రాకెట్‌లో అంతరిక్ష యాత్ర — 05
ఇంజనీరింగ్, వృత్తివిద్యా కళాశాలల ఫీజు నిర్ధారణ నిబంధనల సవరణకు ప్రభుత్వం అనుమతి — 03



సంపుటి 08, సంచిక: 262 | శుక్రవారం | 22-08-2025 | కరీంనగర్ | Published from: Karimnagar, Hyderabad, Khammam, Mahabubnagar | పేజీలు: 12+8 | వెల రూ. 5.00


# అధికార కేంద్రీకరణకు బిజెపి యత్నం

● సిబిఐ, ఇడి, న్యాయవ్యవస్థ, నీతి ఆయోగ్‌లను స్వతంత్రంగా పనిచేయనివ్వడంలేదు ● ప్రధాని కార్యాలయం ఏది చెబితే రాష్ట్రపతి భవన్ అదే చేస్తోంది ● అంతర్జాతీయంగా భారత ప్రతిష్ఠను, ప్రయోజనాలను కాపాడడంలో మోదీ విఫలం ● సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో డాక్టర్ కె.నారాయణ విమర్శ







ప్రజాపక్షం/ కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్

స్వయం ప్రతిపత్తి గల రాజ్యాంగబద్ధ వ్యవస్థలను పూర్తిగా నిర్వీర్యం చేసి అధికారాన్ని కేంద్రీకృతం చేసుకునేందుకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ ఆగ్రహం వ్యక్తం చేశారు. అందులో భాగంగానే సిబిఐ, ఇడి, న్యాయవ్యవస్థ, నీతి అయోగ్ తదితర వ్యవస్థలను స్వతంత్రంగా పనిచేయనివ్వడంలేదని విమర్శించారు. చివరకు ప్రధానమంత్రి కార్యాలయం ఏది చెబితే రాష్ట్రపతి భవన్ అది చేసే స్థాయికి పరిస్థితి దిగజారిందన్నారు. మరో వైపు అంతర్జాతీయ స్థాయిలో భారతదేశ ప్రతిష్ఠను, ప్రయోజనాలను కాపాడడంలో ప్రధాన మోదీ ఘోరంగా విఫలమయ్యారని విమర్శించారు. మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లాలో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర 4వ మహాసభలో రెండవ రోజు ప్రతినిధుల సభలో నారాయణ ప్రసంగించారు. భారత పార్లమెంటరీ వ్యవస్థను కుదించి నాశనం చేయడం ద్వారా దేశాన్ని ఏకఛత్రాధిపత్యంగా పాలించడానికి బిజెపి ప్రభుత్వం ప్రయత్నం చేస్తున్నదన్నారు. కేంద్ర ప్రభుత్వం చెబుతున్నట్లు దేశాభివృద్ధి జరగడంలేదని, కార్పొరేట్ సంస్థల అభివృద్ధికి కుట్ర జరుగుతున్నదని, బిజెపిని వ్యతిరేకించే వారిని రాజకీయ కక్షతో జైలులో పెట్టడం, నక్సలైట్ల అంతం పేరుతో అటవీ, గిరిజన సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే చర్యలు కొనసాగుతున్నాయన్నారు. ముప్పై రోజులు జైలులో ఉంటే చట్టసభల పదవులను రద్దు చేసేలా చట్టం చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఒక వేళ అలాంటి చట్టం తీసుకువస్తే దాదాపు రెండేళ్లు జైలులో ఉన్న అమిత్‌షా పదవినే తొలుత రద్దు చేయాలన్నారు. అత్యంత ప్రజాస్వామ్య దేశంగా ఉన్న భారతదేశం, అమెరికాకు భయపడాల్సిన అవసరం ఏమిటని డాక్టర్ నారాయణ ప్రశ్నించారు. భారత అలీన విధానానికి వ్యతిరేకంగా బిజెపి ప్రభుత్వం ఇజ్రాయెల్ తదితర దేశాలకు మద్దతు ఇస్తుందన్నారు. ఉప రాష్ట్రపతి స్థాయి వ్యక్తి చట్ట సభ నుంచి రాత్రికి రాత్రి మాయం కావడం భారతదేశ చరిత్రలో మొదటిసారి అని నారాయణ అన్నారు. చట్టసభల్లో ప్రభుత్వానికి మద్దతు కోసం ఎంపిల లొసుగులను ఆసరాగా చేసుకుని ఇడి, ఐటి దాడులను చేస్తున్నారని, వారికి లొంగితే క్షమాభిక్ష పెడుతున్నారని, లొంగకపోతే జైలుకు పంపుతున్నారన్నారు. చివరకు ఉప రాష్ట్రపతి ఎన్నికలో సైతం ప్రజాప్రతినిధులపై బెదిరింపులకు పాల్పడుతున్నారని, ఎపిలోని చంద్రబాబు నాయుడు, జగన్ పార్టీ సభ్యులు బిజెపి అభ్యర్థికి ఓటు వేయనట్లయితే మరుసటి రోజే వారు జైలులో ఉంటారన్నారు.

**సిపిఐలో ట్రాన్స్‌జెండర్‌లకు సభ్యత్వం**

సమాజంలో పెద్ద సంఖ్యలో ఉన్న ట్రాన్స్‌జెండర్‌లకు కూడా కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం ఇవ్వాలని, వారి సమస్యలపై దృష్టి సారించాలని డాక్టర్ నారాయణ సూచించారు. ప్రజా సమస్యలపై పోరాటాలు చేయనట్లయితే

తరువాయి 2లో

## రెండింతలు పెరిగిన అవినీతి

● బిజెపి సర్కార్ ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక పరిస్థితి దిగజారింది ● విభజన రాజకీయాలతో దేశాన్ని అస్థిరపరిచేందుకు కాషాయ పార్టీ కుట్ర ● సిపిఐ జాతీయ కార్యదర్శి సయ్యద్ అజీజ్ పాషా

ఎలాంటి పోరాట, రాజకీయ, మంచి చరిత్ర లేని బిజెపి దేశంలో మతం పేరుతో విభజన రాజకీయాలు చేస్తూ దేశాన్ని అస్థిరపరిచేందుకు ప్రయత్నాలు చేస్తున్నదని సిపిఐ జాతీయ కార్యదర్శి, మాజీ ఎంపి సయ్యద్ అజీజ్ పాషా విమర్శించారు. బిజెపి అధికారంలోకి వచ్చిన అనంతరం అవినీతి రెండింతలు పెరిగిందని, ఆర్థిక విధానాలతో దేశ ఆర్థిక పరిస్థితి దిగజారిపోయిందని విమర్శించారు. బిజెపి, ఆర్‌ఎస్‌ఎస్ శక్తుల విభజన, ఫాసిస్టు, స్వార్థ రాజకీయాలపై ప్రజలను మరింత చైతన్యం చేసి వారి విధానాలను ఎండగట్టాలని, లేకపోతే ఆ శక్తులు మరింత రెచ్చిపోయే ప్రమాదం ఉందని ఆయన హెచ్చరించారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం క్యాపిటలిస్టులకు దాదాపు రూ.16 లక్షల కోట్ల పన్ను రాయితీలు ఇచ్చి దేశానికి అన్నం పెట్టే రైతులకు ఎలాంటి రాయితీలు ఇవ్వకపోవడం వారి ఆర్థిక విధానాలను తెలియజేస్తుందన్నారు. పాలస్తీనాలో తొంబై శాతం మంది భారతీయులు

తరువాయి 2లో

## సకాలంలో దిగుమతి జరగనందునే రాష్ట్రాల్లో యూరియా కొరత

● విదేశాల నుంచి తెప్పించడంలో కేంద్ర సర్కార్ విఫలం
● ఒక్క తెలంగాణలోనే లోటు ఉన్నట్లు చిత్రీకరిస్తున్న ప్రతిపక్షాలు
● మీడియా సమావేశంలో మండిపడ్డ మంత్రి తుమ్మల

ప్రజాపక్షం/హైదరాబాద్



విదేశాల నుంచి యూరియా తెప్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని..రైతుల పట్ల బిజెపికి ముందు చూపు లేదని చెప్పడానికి ఇదే నిదర్శనమని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు అన్నారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. యూరియా ఇంపోర్ట్ సకాలంలో బిజెపి సర్కార్ చేయకపోవడం వల్లనే అన్ని రాష్ట్రాల్లో యూరియ కొరత ఏర్పడిందన్నారు. అయితే యూరియా కొరత కేవలం తెలంగాణలోనే ఉన్నది అన్నట్లు బిఆర్‌ఎస్, బిజెపి నేతలు కట్టుకథలు సృష్టించి రైతులను ఆందోళనకు గురిచేస్తున్నారన్నారు. ఇక దేశీయంగా కూడా యూరియా ఉత్పత్తి అనుకున్న స్థాయిలో చేయడంలో కేంద్ర ప్రభుత్వం

తరువాయి 2లో

## అసెంబ్లీలో చర్చ తర్వాతా? ముందా?

● కాళేశ్వరం రిపోర్టుపై ప్రభుత్వ వివరణ కోరిన హైకోర్టు
● కెసిఆర్, హరీష్‌రావు పిటిషన్లపై వాదన – విచారణ నేటికి వాయిదా

ప్రజాపక్షం/హైదరాబాద్



కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణంలో భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణాలపై రాష్ట్రం ఏర్పాటు చేసిన విచారణ కమిషన్ నివేదికపై చర్యలు ఎలా ఉంటాయో తెలియజేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. సుప్రీం కోర్టు రిటైర్డు న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి చర్చ చేశాక ఏం చేయాలో నిర్ణయం తీసుకుంటారా లేనిపక్షంలో అసెంబ్లీలో ప్రవేశపెట్టడానికి ముందే చర్యలపై నిర్ణయం తీసుకుంటారా అని ఆరా తీసింది. కీలకమైన ఈ అంశంపై శుక్రవారం జరిగే విచారణలో తెలియజేయాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది. ఇప్పటికిప్పుడే జవాబు చెప్పలేమని అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి చెప్పడంతో విచారణ శుక్రవారానికి వాయిదా పడింది. జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ సారథ్యంలో విచారణ కమిషన్ ఏర్పాటు జీవో 6ను, కమిషన్ గత నెల 31న సమర్పించిన నివేదికలను రద్దు చేయాలని కోరుతూ బిఆర్‌ఎస్ చీఫ్, మాజీ సీఎం కేసీఆర్, ఇరిగేషన్ శాఖ మాజీ మంత్రి టి. హరీష్ రావు హైకోర్టును ఆశ్రయించారు. గురువారం చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ జి.ఎం. మొహియుద్దీన్లతో కూడిన డివిజన్ బెంచ్ ఎదుట సుదీర్ఘ వాదనలు

తరువాయి 2లో



## అటవీ హక్కుల చట్టాన్ని పటిష్ఠంగా అమలుచేయాలి

● అర్హులైన గిరిజనులకు పోడుభూములు ఇవ్వాలి
● కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26వేలు చెల్లించాలి
● సిపిఐ రాష్ట్ర నాలుగవ మహాసభ తీర్మానం

ప్రజాపక్షం/కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర రావు నగర్

అటవీ హక్కుల చట్టాన్ని పటిష్ఠంగా అమలు చేయడంతో పాటు అర్హులైన గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని, కార్మికులకు రూ.26 వేలు, స్కిల్డ్ వర్కర్లకు రూ.42 వేల కనీస వేతనాలు చెల్లించాలని, ప్రభుత్వంలో టి జి ఆర్ టి సి విలీనం ప్రక్రియను పూర్తి చేయాలని, సంస్థలో కార్మిక సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్య, ఉద్యోగ రంగాల్లో బిసిలకు 42 శాతానికి రిజర్వేషన్లను పెంచాలని తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని సిపిఐ మహాసభ కేంద్ర ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా గాజుల రామారంలో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో రెండవ రోజు గురువారం వివిధ సమస్యలు, అంశాలపై అధ్యక్షవర్గం సభ్యులు, ప్రతినిధులు ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను

తరువాయి 2లో

## జస్టిస్ సుదర్శన్‌రెడ్డి నామినేషన్ దాఖలు

నిబద్ధతతో నామినేషన్ వేశానని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** ఉపరాష్ట్రపతి పదవికి ప్రతిపక్షాల అభ్యర్థి బి. సుదర్శన్ రెడ్డి గురువారం నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, ఎన్‌సిపి (ఎస్‌పి) చీఫ్ శరద్ పవార్, ఎస్‌పి నాయకుడు రాంగోపాల్ యాదవ్, డిఎంకెకు చెందిన తిరుచ్చి శివ, టిఎంసికి చెందిన శతాబ్ది రాయ్, శివసేన (యుబిటి)కి చెందిన సంజయ్ రౌత్, సిపిఐ(ఎం)కు చెందిన జాన్ బ్రిట్టాస్ వంటి అగ్ర ప్రతిపక్ష నాయకుల సమక్షంలో సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి నామినేషన్ దాఖలు చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికకు రిటర్నింగ్ అధికారి అయిన రాజ్యసభ సెక్రటరీ జనరల్ ముందు సుదర్శన్ రెడ్డి నాలుగు సెట్ల నామినేషన్ తరువాయి 2లో



## జిఎస్‌టిలో ఇక రెండు శ్లాబులే

● మంత్రుల బృందం సూత్రప్రాయ ఆమోదం
● హేతుబద్ధీకరణకు రాష్ట్రాలు సుముఖత చూపినా ఆదాయ స్థిరీకరణపై అభ్యంతరాలు ● కొత్త విధానంలో ఆదాయనష్టం చెల్లించాలని ప్రతిపక్ష పాలిత రాష్ట్రాల మంత్రుల విజ్ఞప్తి

**న్యూఢిల్లీ:** వస్తుసేవల పన్ను(జిఎస్‌టి) విధాన సంస్కరణల్లో భాగంగా నాలుగు శ్లాబుల బదులు రెండు శ్లాబులు కొనసాగించేందుకు మంత్రుల బృందం (జిఓఎం) సూత్రప్రాయంగా ఆమోదం తెలియజేసింది. బిహార్ ఉప ముఖ్యమంత్రి సామ్రాట్ చౌధురి అధ్యక్షతన ఆరు రాష్ట్రాలకు చెందిన జిఎస్‌టి కౌన్సిల్ ఆర్థికమంత్రుల బృందం గురువారంనాటి కీలక సమావేశంలో కేంద్రం ప్రతిపాదనలను ఆమోదించింది. జిఎస్‌టి రేటు హేతుబద్ధీకరణకు సంబంధించిన రెండు శ్లాబుల విధానానికి అన్ని రాష్ట్రాలు సుముఖత వ్యక్తం చేసినప్పటికీ ఆదాయాల స్థిరీకరణపై కొన్ని అభ్యంతరాలు తెలియజేశాయి. ఇప్పటివరకూ ఉన్న నాలుగు శ్లాబులలో 12 శాతం, 28 శాతం శ్లాబులను తొలగించి ఐదూ శాతం, 18 శాతం శ్లాబులను కొనసాగిస్తారు. హానికరమైన వస్తువులపై 40 శాతం పన్నును కేంద్రం ప్రతిపాదించింది. కొత్త శ్లాబువిధానంవల్ల కలిగే ఆదాయనష్టాన్ని భర్తీ చేయాలని, ఆ పరిహారం చెల్లించాలని కొన్ని రాష్ట్రాలు డిమాండ్ చేశాయి. కేంద్రం ప్రతిపాదనలో ఆదాయనష్టం భర్తీ విషయం ప్రస్తావించలేదని జిఓఎంలో ప్రతిపక్ష పాలిత మంత్రులు విమర్శించారు. రాష్ట్రాల ఆదాయాలను సంరక్షించాల్సిన అవసరం ఉందని తెలంగాణ రాష్ట్ర ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క డిమాండ్ చేశారు. కాగా వ్యక్తుల ఆరోగ్యం, జీవిత బీమా విధానాలకు సంబంధించి కేంద్రం ప్రతిపాదించిన మినహాయింపులను బుధవారంనాడు జిఎస్‌టి మంత్రుల బృందం చర్చించింది. దీనివల్ల ప్రతి సంవత్సరం రూ.9,700 కోట్లు ఆదాయంపై ప్రభావం పడుతుంది. ఐనాగానీ చాలా రాష్ట్రాలకు ఈ ప్రతిపాదనకు సానుకూలంగా స్పందించాయి. జిఎస్‌టిలో ఉన్న ఆరుగురు మంత్రుల బృందంలో ముగ్గురు బిజెపి పాలిత బీహార్, ఉత్తర ప్రదేశ్,

తరువాయి 2లో



## ఆదాయం క్షీణిస్తే సంక్షేమ పథకాలు దెబ్బతింటాయ్

● వాటాకు తగినవిధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరగడంలేదు ● జిఎస్‌టి హేతుబద్ధీకరణ సమావేశంలో భట్టి విక్రమార్క

ప్రజాపక్షం/హైదరాబాద్

జిఎస్‌టి రేట్ల సరళీకరణ,పన్ను భారం తగ్గించడం ఆహ్వానించదగిన విషయమై నప్పటికీ, రాష్ట్రాల ఆదాయాలు క్షీణించకుండా రక్షించే చర్యలను తప్పనిసరిగా పరిగణలోకి తీసుకోవాలని డిప్యూటీ సిఎం, ఆర్థిక శాఖ మంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. రాష్ట్రాల ఆధాయం క్షిణిస్తే పేద, మధ్యతరగతి ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల ప్రాజెక్టులు దెబ్బ తింటాయని హెచ్చరించారు. వాటకు తగిన విధంగా దక్షిణాది రాష్ట్రాలకు నిధుల పంపిణీ జరగడం లేదన్నారు. న్యూఢిల్లీలో గురువారం జరిగిన జిఎస్‌టి రేషనలైజేషన్ సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ జిఎస్‌టి ప్రవేశపెట్టిన సమయంలో రాష్ట్రాల వార్షిక వృద్ధి రేటు 14 శాతంగా ఉండటంతో, వార్షికంగా 14 శాతం వృద్ధి కలుగుతుందని హామీనిచ్చిన విషయాన్ని

తరువాయి 2లో



## ఉగ్ర గోదారి

మూడో ప్రమాదస్థాయి హెచ్చరికకు చేరువలో నీటిమట్టం

ప్రజాపక్షం/భద్రాచలం

గోదావరి వరి ఉగ్రరూపం దాల్చింది. భద్రాచలం వద్ద రెండో ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. గురువారం రాత్రి కడపటి వార్తలు అందే సమయానికి 51.09 అడుగుల చేరుకుని నిలకడగా మారింది. గత వారం రోజులుగా గోదావరి పరివాహక ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు

తరువాయి 2లో

## గవర్నర్లు బిల్లులు ఆమోదించకుంటే చూస్తూ ఊరుకోవాలా?

● కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించిన సుప్రీంకోర్టు
● ఏదైనా తప్పు జరిగితే దానికి పరిష్కారం ఉండాలని వ్యాఖ్య

**న్యూఢిల్లీ :** రాజ్యాంగ కార్యనిర్వాహకులు విధులు నిర్వర్తించడానికి నిరాకరిస్తే, లేదా రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లుల విషయంలో గవర్నర్ నిష్క్రియాత్మకంగా ఉన్నప్పుడు రాజ్యాంగ న్యాయస్థానాల చేతులు కట్టేయవచ్చా? అని గురువారం సుప్రీంకోర్టు కేంద్రాన్ని ప్రశ్నించింది. కేంద్రం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్‌మెహ్‌తా మాట్లాడుతూ కొంతమంది గవర్నర్లు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులపై కూర్చుంటే న్యాయపరమైన పరిష్కారాలకు బదులు రాష్ట్రాలు రాజకీయ పరిష్కారాలను అన్వేషించాల్సి ఉంటుందని చెప్పిన తర్వాత ఐదుగురు జడ్జిలతో కూడిన రాజ్యాంగ ధర్మాసనానికి నేతృత్వం వహించిన ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ ఈ వ్యాఖ్యలు చేశారు. రాష్ట్ర శాసనసభలు ఆమోదించిన బిల్లులను గవర్నర్లు, రాష్ట్రపతి పరిష్కరించేందుకు కాలపరిమితి విధించవచ్చా అనే ప్రశ్నపై రాష్ట్రపతి సూచనను జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ పిఎస్.నర్సింహ్మా, జస్టిస్ ఏఎస్.చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం విచారిస్తోంది. ఏదైనా తప్పు జరిగితే దానికి పరిష్కారం ఉండాలని ధర్మాసనం తెలిపింది. రాజ్యాంగ కార్యనిర్వాహకులు ఎలాంటి కారణం లేకుండా తమ విధులను నిర్వర్తించకపోతే రాజ్యాంగ న్యాయస్థానం చేతులు కట్టేయవచ్చా అని భారత ప్రధాన న్యాయమూర్తి (సిజెఐ) బిఆర్.గవాయ్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహ్‌తాను ప్రశ్నించారు. దీనిపై మెహ్‌తా మాట్లాడుతూ 'అన్ని సమస్యలకు కోర్టులు పరిష్కారం కాలేవని, చర్చలకు ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. గవర్నర్ వైపు నుండి ఏదైనా నిష్క్రియాత్మకత ఉంటే అది రాష్ట్రానికి రాష్ట్రానికి మారవచ్చు. బాధిత రాష్ట్రం కోర్టును ఆశ్రయిస్తే అలాంటి నిష్క్రియాత్మకతపై న్యాయ సమీక్షను నిషేధించవచ్చా? పరిష్కారం ఏమిటో మీరు మాకు చెప్పండి' అని జస్టిస్ సూర్యకాంత్ వాదించారు. కొంత 'సరళత' కోసం మెహ్‌తా పిలుపునిస్తూ ఇలా అన్నారు. 'ఒకవేళ గవర్నర్ బిల్లులపై కూర్చున్నారనుకోండి. ఆమోదించదగిన రాజకీయ పరిష్కారాలు ఉన్నాయి. ముఖ్యమంత్రి దీనిపై కోర్టుకు పరుగెత్తడం అన్ని చోట్లా జరుగదు. చర్చలు జరిగే సందర్భాలు, ముఖ్యమంత్రి గవర్నర్‌ను కలిసే సందర్భాలు, ఆయన ప్రధాన మంత్రిని, రాష్ట్రపతిని కలిసే సందర్భాలు కూడా ఉన్నాయి. పరిష్కారాలు కనుగొనబడతాయి. అంతేకాకుండా కొన్ని సందర్భాలలో టెలిఫోనిక్ సంభాషణలు కూడా ప్రతిష్ఠంభనను పరిష్కరించేందుకు దోహదపడతాయి. ఏదైనా సమస్య ఉంటే పరిష్కరించుకోవడానికి దశాబ్దాలుగా ఈ పద్ధతిని అవలంబిస్తున్నారు. ప్రతినిధులు వెళ్లి గవర్నర్‌ను, రాష్ట్రపతిని కలుస్తారు. కొన్నిసార్లు మధ్యే మార్గాన్ని

తరువాయి 2లో




## కేరళ సిపిఐ ఎమ్మెల్యే వఝూర్ సోమన్ ఆకస్మిక మృతి

నివాళులర్పించిన ముఖ్యమంత్రి పినరయి విజయన్

05



# ప్రపంచం
WORLD NEWS

## రాజకీయపార్టీ ఆలోచన విరమించిన ఎలాన్‌మస్క్

**వాషింగ్టన్:** సొంతంగా రాజకీయపార్టీ ఏర్పాటు చేయాలనే ఆలోచనను ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ విరమించుకున్నారు. వాల్‌స్ట్రీట్ జర్నల్ ఈ విషయం ప్రకటించింది. గత ఏడాది అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ట్రంప్‌కు అత్యంత సన్నిహితుడుగా ఉండి ఆయనకు దాదాపు 300 మి.డాలర్లు ఫండింగ్ చేసిన ఎలాన్‌మస్క్ ఆ తర్వాత ప్రభుత్వంలో 'డాడ్జ్' ప్రత్యేక విభాగాన్ని నిర్వహించి పొదుపు చర్యలు చేపట్టి ఫెడరల్ ఉద్యోగుల నుండి విమర్శలు ఎదుర్కొన్నారు. మే 28న ట్రంప్ పాలనాయంత్రంగం 'డాడ్జ్' నుండి వైదొలగుతున్నట్లు ప్రకటించారు. ట్రంప్ తీసుకువచ్చిన బ్యూటిఫుల్ బిల్లును మస్క్ తీవ్రంగా ప్రతిఘటించారు. అమెరికాలో రెండు పార్టీల వ్యవస్థను సవాలు చేస్తూ "ద అమెరికన్ పార్టీ"ని ప్రారంభిస్తున్నట్లు ఈ ఏడాది జూన్ ఎనిమిదో తేదీన ఎలాన్ మస్క్ ప్రకటించారు. దేశంలో రెండు పార్టీలకూ ప్రభుత్వ వ్యవయాలమీద, అవినీతిమీద పట్టులేదని, వాటిని నిర్మూలించలేక పోతున్నాయని మస్క్ విమర్శించారు.

## ఆరు నెలల్లో 2,100 మంది హమాస్ ఉగ్రవాదులు హతం

### ఐడిఎఫ్ ప్రకటన

**టెల్‌అవీవ్:** గడచిన ఆ రు నెలల్లో గాజాలో 2,100మంది హమాస్ ఉగ్రవాదులను హతమార్చి, 75 శాతం గా జా స్ట్రిప్ ప్రాంతాన్ని సైనిక కార్యకలాపాల అధీనంలోకి తెచ్చినట్లు ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) ప్రకటించింది. ఐతే అదే సమయంలో 10,576 మంది పాలస్తీనియన్లు కూడా మరణించినట్లు హమాస్ హయాంలోని ఆరోగ్యమంత్రిత్వశాఖ ప్రకటించింది. మధ్యవర్తుల ప్రమేయంతో బలవంతంగా 45 రోజుల పాటు కాల్పుల విరమణ ఒప్పందం అమలు జరిగిన తర్వాత మార్చినెల రెండోవారంలో ఇజ్రాయెల్ తిరిగి గాజాలో రెండో దశ యుద్ధం ప్రారంభించింది. అప్పటినుండి 2,100 మంది హమాస్ ఉగ్రవాదులను హతమార్చినట్లు ఐడిఎఫ్ గురువారం ప్రకటించింది. గడచిన ఆరునెలల్లో హెలికాప్టర్లు, యుద్ధ విమానాలు, డ్రోన్లు, నౌకాదళ సహాయంతో 10,000 ఉగ్రవాదుల కేంద్రాలను ధ్వంసం చేశామని, ఉగ్రవాదులమధ్య అనుసంధాన వ్యవస్థలను పూర్తిగా నాశనం చేశామని పేర్కొంది. గాజాలో హమాస్ నాయకుడు మహ్మద్ షిన్వర్‌ను ప్రధానంగా దాడుల్లో మట్టుపెట్టామని తెలిపింది. షిన్వర్ సోదరుడు, హమాస్ నాయకుడు యాహ్యా షిన్వర్‌ను గత ఏడాదిలోనే హతమార్చామని గుర్తుచేసింది. రఫా బ్రిగేడ్ కమాండర్ మహ్మద్ షబనా, దక్షిణ ఖాన్ యూనిస్ బెటాలియన్ కమాండర్ కమాండర్ మహ్ది క్వారాను చంపినట్లు తెలిపింది. హమాస్‌కు చెందిన ఆరుగురు అత్యున్నతస్థాయీ కమాండర్లను, అనేకమంది హమాస్ ప్రభుత్వ అధికారులను, ఇంటర్నల్ భద్రతాధికారులను హతమార్చామని ఐడిఎఫ్ ప్రకటించింది. 2023 అక్టోబరు ఏడో తేదీన ఇజ్రాయెల్‌పై దాడికి సూత్రధారులైన అనేకమందిని పూర్తిగా మట్టుపెట్టామని తెలిపింది.

# పేలుళ్ళతో దద్దరిల్లుతున్న గాజాసిటీ

### ఐడిఎఫ్ ఆక్రమణ ప్రారంభం
### ఇళ్ళు వదలి పారిపోతున్న ప్రజలు

**గాజా:** గాజా సిటీ ఆక్రమణ ప్రణాళికను గడచిన మంగళవారం ఆమోదించిన ఐడిఎఫ్ (ఇజ్రాయెల్ డిఫెన్స్ ఫోర్స్) మరునాటి నుండే కార్యాచరణ ప్రారంభించింది. గాజాసిటీ తొలిదశ ఆక్రమణ ప్రారంభమైందని ఐడిఎఫ్ ప్రకటించింది. గురువారంనాడు భూతల ఆక్రమణ దాడ పెరగడంతో ప్రజలు భయభ్రాంతులై దక్షిణ ప్రాంతానికి పరారవుతున్నారని స్థానిక అధికారులు చెప్పారు. గాజా సిటీలో దాదాపు 10 లక్షలమంది ప్రజలు బతుకుతున్నారు. రాత్రి తెల్లారకముందే గాజా సిటీ బాంబు పేలుళ్ళతో దద్దరిల్లుతోంది. "పేలుళ్ళతో మా ఇల్లు రాత్రంతా ప్రకంపనలు పుట్టాయి. పదాతి దళాలు, యుద్ధవిమానాలు హోరెత్తిస్తున్నాయి. అంబులెన్సుల సైరన్లు వినిపిస్తున్నాయి, మేం ఎక్కడికి పారిపోవాలి?" అని గాజా సిటీ నివాసి అహ్మద్ అల్ షాంటీ ప్రశ్నించారు. జైటౌన్,సాబ్రా ప్రాంతాల నుండి పాలస్తినా ప్రజలు ఖాళీచేసి వెళ్ళిపోతున్నారు. "వారం రోజులుగా రాత్రిళ్ళు మాకు నిద్ర లేదు, రాత్రంగా దూరంగా తూర్పున పేలుళ్ళతో ఆకాశమంతా భయంకరమైన కాంతులు పరచుకుంటున్నాయి, దాడులు ఆగడంలేదు" అని గాజా సిటీ నుండి వెళ్ళిపోతున్న మహిళ అమల్ అబ్దెల్ ఆల్ చెప్పారు. మరోవైపు హమాస్ ఒక ప్రకటన చేస్తూ, అమాయకులైన ప్రజలపై ఇజ్రాయెల్ అమానుషమైన యుద్ధాన్ని కొనసాగిస్తోందని విమర్శించింది. తాజాగా కాల్పుల విరమణ ఒప్పందానికి ఒప్పుకున్నాగానీ ఇజ్రాయెల్ పట్టించుకోవడంలేదని హమాస్ విమర్శించింది. ఇప్పటివరకూ యుద్ధంలో కొన



సాగుతున్న సైనకులకు విశ్రాంతి ఇచ్చేందుకు వీలుగా సెప్టెంబరు నుండి 60,000 మంది రిజర్విస్టు సైనికులను ఇజ్రాయెల్ దశలవారీగా గాజా యుద్ధరంగంలోకి దింపుతున్నది.

### బందీల విడుదల, కాల్పుల విరమణ ఐక్యరాజ్యసమితి పిలుపు

బందీల విడుదల, గాజాలో తక్షణం కాల్పులు విరమణకు ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనీ గుటెర్రెస్ పిలుపు ఇచ్చారు. గాజా సిటీ ఆక్రమణ కొత్త ప్రణాళిక అమలు కార్యాచరణ ప్రారంభించిన వెంటనే ఆయన తీవ్రంగా స్పందించారు. గాజాలో యుద్ధం ప్రారంభమై గురువారం (ఆగస్టు 21) నాటికి 685 రోజులు పూర్తయ్యాయి. గాజాలో మరణాలను, విధ్వంసాన్ని ఆపేయడానికి కాల్పుల విరమణ చాలా ముఖ్యమైన విషయమని ఆంటోనీ గుటెర్రెస్ అన్నారు. ఆఫ్రికా అభివృద్ధిపై టోక్యోలో జరుగుతున్న అంతర్జాతీయ సదస్సుకు హాజరైన సందర్భంగా ఆయన మాట్లాడారు. 50 మంది ఇజ్రాయెలీ బందీలను బేషరతుగా ఒకేసారి హమాస్ విడుదల చేయాలని, ఇజ్రాయెల్ కూడా కాల్పుల విరమణ తక్షణం అమలు చేయాలని కోరారు. అంతర్జాతీయస్థాయిలో ఒత్తిడి చేస్తున్నాగానీ ఇజ్రాయెల్ పట్టించుకోవడం లేదని విమర్శించారు. 86 శాతం గాజా ప్రాంతంలో ప్రజలను ఖాళీ చేయాలని సైన్యం ఒత్తిడిచేస్తోందన్నారు. రెడ్‌క్రాస్ కూడా ఒక ప్రకటన చేస్తూ, గాజా సిటీ ఆక్రమణ వల్ల మరింత సంక్షోభం ఏర్పడుతుందని, ప్రజలకు ఎటు వెళ్ళాలో తెలియని పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

### హమాస్‌తో సంబంధంలేదు గాజాను ఆక్రమిస్తాం : నేతన్యాహూ

హమాస్‌తో సంబంధం లేకుండా గాజాను పూర్తిగా ఆక్రమిస్తామని ఇజ్రాయెల్ ప్రధానమంత్రి బెంజిమన్ నెతన్యాహూ ప్రకటించారు. కాల్పుల విరమణ ఒప్పందానికి, బందీల విడుదలకు హమాస్ అంగీకరించిందా? లేదా? అనే విషయంతో తమకు సంబంధం లేదని, గాజాను పూర్తిగా ఆక్రమించి తీరుతామని అన్నారు. గురువారం నాడు ప్రసారమైన ఒక ఇంటర్వ్యూలో ఆయన ఈ విషయం చెప్పారు. ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్‌పై తన విమర్శల దాడిని కొనసాగించారు. ఉగ్రవాదులపట్ల అల్బనీస్ బుజ్జగింపు ధోరణి ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. అత్యంత బలహీనమైన ప్రధానమంత్రిగా ఆల్బనీస్‌ను విమర్శించడంతో ఇంతకుముందే వివాదం చెలరేగింది. "ఆయన ఒక ప్రజా నాయకుడుగా కీర్తిప్రతిష్టలున్నమాట ఒప్పుకుంటా,కానీ హమాస్ ఉగ్రవాదులు ఆయన చూపిస్తున్న ప్రేమ, సమర్థింపు ఆయన బలహీనత, ఆయన ప్రతిష్ఠను దెబ్బతీస్తోందని నెతన్యాహూ విమర్శించారు. ప్రపంచంలో అత్యంత దుర్మార్గపూరితమైన ఉగ్రవాద సంస్థగా హమాస్‌ను ఆయన పేర్కొన్నారు. వారు మహిళల తలలు నరుకుతున్నారు, వారిపై అత్యాచారాలు చేస్తున్నారు, హీనంగా ప్రవర్తిస్తున్నారు, అలాంటివారు అల్బనీస్‌ను ప్రశంసించారంటే ఎక్కడో తప్పు జరుగుతోందని నెతన్యాహూ విమర్శించారు.

---

## ఉగ్ర గోదారి

(మొదటి పేజీ తరువాయి)

గోదావరికి వరద తాకిడి పెరిగింది. గోదావరిపై ఉన్న ప్రాజెక్టులు నీటితో నిండుకోవడంతో గేట్లు ఎత్తి ఆ నీటిని దిగువకు విడుదల చేశారు. దీంతో పాటు ఉపనదులైన ఇంద్రావతి, ప్రాణహిత నదులు, తాలిపేరు ప్రాజెక్టు వరద నీరు గోదావరిలోనే కలవడంతో వరద మరింతగా పెరుగుతూ వచ్చింది. ప్రస్తుతం గోదావరి నిరకడగా మారడంతో అధికారులు ఊపిరి పీల్చుకున్నారు. గోదావరి పరివాహక ప్రాంతంలోని రహదారులతో పాటు లోతట్టు ప్రాంతాలు నీట మునిగాయి. భద్రాచలం నుండి చర్ల వెళ్లే రహదారిలోని ఎటపాక, తూరుబాక, గంగోలు, పెద్దబండిరేవు ప్రధాన రహదారిపైకి నీరు చేరడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఆర్‌టిసి సైతం రవాణా సదుపాయాలను నిలుపుదల చేశారు. కూనవరం వెళ్లే దారిలో కొల్లుగూడెం, నెల్లిపాక వద్ద గోదావరి రోడ్డుపై తిష్ట వేయడంతో అంతరాష్ట్ర రాకపోకలు నిలిచిపోయాయి. భద్రాచలం పట్టణంలోని సుబాష్ నగర్‌కాలనీ ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. ఏక్షణమైనా వరద పెరిగే అవకాశం ఉండటంతో అంతా వరద శిభిరాలకు తరలి వెళ్లేందుకు సిద్ధంగా ఉండాలని అధికారులు సూచించారు. గోదావరి తీరంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు అప్రమత్తంగా ఉన్నారు. ప్రజలు ఎవ్వరూ గోదావరి తీరానికి వెళ్లరాదని, మత్స్యకారులు చేపలు పట్టేందుకు నదిలోనికి దిగడం మంచిదికాదని తెలిపారు.

## పెరిగిన అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

ఉండగా, ఆ దేశంపై యుద్ధం చేస్తూ మారణహోమం సృష్టిస్తున్న ఇజ్రాయిల్ వైఖరిని ప్రపంచంలోని 142 దేశాలు వ్యతిరేకిస్తుండగా, భారత్‌లోని బిజెపి ప్రభుత్వం మద్దతు ఇవ్వడం గర్హనీయమన్నారు. పహల్గామ్ సంఘటనకు ప్రతీకారంగా భారత్ చేపట్టిన 'ఆపరేషన్ సింధూర్' ప్రపంచంలోని ఒక్క దేశం కూడా మద్దతు ఇవ్వకపోవడం విదేశాంగ విధానంలో భారత్ ఎంత ఘోరంగా విఫలమైందో చెప్పడానికి నిదర్శనమన్నారు. సైద్ధాంతికంగా, రాజకీయంగా మరింత పటిష్టమైన విధానాలను రూపొందించుకుని ముందుకు సాగితే తప్ప బిజెపిని ఎదుర్కోలేమని, ఇందు కోసం దేశంలో వామపక్ష పార్టీల ఐక్యత కోసం సిపిఐ విశేష కృషి చేస్తున్నప్పటికీ ఇంకా చేయాల్సి ఉందన్నారు. సిపిఐలోని ప్రతి నాయకుడు, కార్యకర్త తీసుకున్న బాధ్యతను సమర్థివంతంగా నిర్వర్తించడం ద్వారా పార్టీని మరింత బలోపేతం చేయాల్న ఆయన కోరారు.

## యూరియా కొరత

(మొదటి పేజీ తరువాయి)

విషలమైందన్నారు. యూరియ కొరత ఏర్పడటానికి కేంద్ర ప్రభుత్వమే కరణమన్నారు. తెలంగాణ రైతులను ఆదుకునేందుకు కేంద్రం మెడలు వంచైనా యూరియా తెప్పిస్తామని అన్నారు. అధికారం కోల్పోయిన పార్టీలు ప్రాజెక్ట్ గేట్లు ఎత్తుతాం బటన్ లు నొక్కుతామని సొల్లు మాటలు మాట్లాడుతున్నారని ఎద్దేవ చేశారు.టి బిజెపి అధ్యక్షుడు రామచంద్ర రావు సోయి లేకుండా మాట్లాడుతున్నారని విమర్శించారు. దేశంలోని చాలా రాష్ట్రాల్లో యూరియా కోసం రైతులు ఆందోళన చేస్తున్నారని ఆయన గుర్తు చేశారు. యూరియా ఇతర పారిశ్రామిక అవసరాలకు వినియోగం పై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలు అధికారం పీకేసిన పార్టీలు పెత్తనం చేస్తామంటే అపహాస్యంగా ఉందన్నారు. రాజకీయ స్వార్థంతో బిఆర్ఎస్,బిజెపి పార్టీలు రైతాంగం ను గందరగోళం చేస్తున్నారని ఆరోపించారు. రాజకీయాలకు అతీతంగా రైతాంగం కోసం పార్టీలు పని చేయాలని హితవు పలికారు. రష్యా ఉక్రెయిన్, ఇరాన్ ఇజ్రాయిల్ యుద్ధాల వల్ల రెడ్ సీ లో నౌకాయనం నిలిచి ఇంపోర్ట్ యూరియా సరఫరా లో జాప్యం జరిగిందన్నారు. చైనా నుంచి ఇంపోర్ట్ కావల్సిన యూరియా ను తెప్పించడం లో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందన్నారు. పార్లమెంట్ ఆవరణలో మా ఎంపిలు ఆందోళన చేస్తేనే ఈ వారంలో యాభై వేల మెట్రిక్ టన్నులు యూరియా ఇస్తామన్నారు. గత ఐదు నెలలుగా లోటు సరఫరా చేసిన యూరియా కూడా అందించాలని ఆయన డిమాండ్ చేశారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి యూరియా సరఫరా పై చొరవ తీసుకోవాలని కోరారు. కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కు యూరియా కొరత పై వ్యక్తిగతంగా వివరించానని తెలిపారు.

## నామినేషన్ దాఖలు

(మొదటి పేజీ తరువాయి)

పత్రాలను సమర్పించారు. 160 మంది ఎంపిలు ప్రతిపాదకులు, ద్వితీయులుగా సంతకం చేశారు. వీరిలో ఖర్గే, రాహుల్ గాంధీ, సోనియా గాంధీ, ప్రియాంక గాంధీ వాద్రా, డింపుల్ యాదవ్, అఖిలేష్ యాదవ్, ఇతర అగ్ర నాయకులు ఉన్నారు. ప్రతి సెట్‌లో 20 మంది ద్వితీయ ప్రతిపాదకులు కూడా ఉన్నారు. రిటర్నింగ్ అధికారి నామినేషన్ పత్రాలను పరిశీలించి, సుదర్శన్‌రెడ్డి రసీదు అందజేశారు. ఉపరాష్ట్రపతి అభ్యర్థి తన నామినేషన్ పత్రాన్ని కనీసం 20 మంది ఓటర్లు ప్రతిపాదకులుగా, కనీసం 20 మంది ఓటర్లు ద్వితీయులుగా సభ్యత్వాన్ని పొందాలి. విపక్షాల ఉమ్మడి అభ్యర్థిగా సుదర్శన్‌రెడ్డిని ఎంపిక చేయాలనే చర్య ఉఈ ఎన్నికల్లో దక్షిణ వర్సెస్ దక్షిణ పోటీగా మార్చింది. దేశంలో రెండవ అత్యున్నత రాజ్యాంగ పదవికి రాజకీయేతర ముఖాన్ని తమ నామినీగా ఎంచుకోవాలని కూడా ప్రతిపక్షాలు కోరుకున్నాయి. అధికార ఎన్‌డిఎ ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా మహారాష్ట్ర గవర్నర్ సి.పి. రాధాకృష్ణన్ ను ఎంపిక చేసింది. తమిళనాడుకు చెందిన అనుభవజ్ఞుడైన బిజెపి నాయకుడు, ఆర్ఎస్ఎస్ నేపథ్యం కలిగిన వారు రాధాకృష్ణన్ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు.

**నిబద్ధతతో నామినేషన్ వేశా : సుదర్శన్‌రెడ్డి**

నామినేషన్ దాఖలు అనంతరం సుదర్శన్‌రెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఈ ఎన్నిక కేవలం ఒక వ్యక్తికి సంబంధించినది కాదన్నారు. పార్లమెంటు సమగ్రతతో పనిచేసే, అసమ్మతిని గౌరవించే సంస్థలు, స్వాతంత్ర్యం, న్యాయంగా ప్రజలకు సేవ చేసే భారతదేశ ఆలోచనను పునరుద్ధాటించేదని నొక్కి చెప్పారు. ఉపరాష్ట్రపతిగా ఎన్నికైతే, నిష్పాక్షికత, గౌరవం, సంభాషణలు, మర్యాదకు దృఢమైన నిబద్ధతతో తన పాత్రను నిర్వర్తిస్తానని ప్రతిజ్ఞ చేశారు. 'ఈరోజు, ప్రతిపక్ష పార్టీల ఉమ్మడి అభ్యర్థిగా భారత ఉపరాష్ట్రపతి పదవికి నా నామినేషన్ పత్రాలను దాఖలు చేసే గౌరవం నాకు లభించింది. నేను లోతైన వినయం, బాధ్యత, మన రాజ్యాంగంలో పొందుపరచబడిన విలువల పట్ల అచంచలమైన నిబద్ధతతో నామినేషన్ పత్రాలు దఖాలు చేశాను' అని సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. 'భారత సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా, న్యాయ విద్యార్థిగా, ఈ గణతంత్ర ప్రజాస్వామ్య సంప్రదాయాలలో పాతుకుపోయిన పౌరుడిగా నా ప్రజా సేవ జీవితం ప్రతి వ్యక్తి గౌరవం, రాజ్యాంగ నైతికత రక్షణ, మన వైవిధ్యంలో ఐక్యతలో భారత దేశ నిజమైన బలం ఉందని నాకు నేర్పింది' అని ఆయన అన్నారు. రాజ్యసభ చైర్‌పర్సన్‌గా ఉపరాష్ట్రపతి పార్లమెంటరీ ప్రజాస్వామ్య అత్యున్నత సంప్రదాయాలను పరిరక్షించే బాధ్యతను నిర్వర్తిస్తున్నారని ఆయన అన్నారు. తనపై నమ్మకం ఉంచినందుకు ప్రతిపక్ష పార్టీల నాయకులకు, న్యాయం, సమానత్వం, సామరస్యం కోసం ఈ సమష్టి పోరాటాన్ని ప్రేరేపిస్తున్న అనేక మంది పౌరులకు సుదర్సన్‌రెడ్డి కూడా ప్రగాఢ కృతజ్ఞతలు తెలిపారు. మన రాజ్యాంగం పట్ల నమ్మకంతో, ప్రజలపై ఆశతో తాను ఈ ప్రయాణాన్ని ప్రారంభిస్తున్నానన్నారు. మన ప్రజాస్వామ్య స్ఫూర్తి మనందరికీ మార్గనిర్దేశం చేస్తూనే ఉండాలని కోరుకుంటున్నానని చెప్పారు.

---

## రెండు శ్లాబులే

(మొదటి పేజీ తరువాయి)

రాజస్థాన్‌లకు చెందినవారు కాగా, మిగిలిన ముగ్గురూ ప్రతిపక్ష పాలిత కర్ణాటక (కాంగ్రెస్), కేరళ (వామపక్ష సంఘటన ప్రభుత్వం), పశ్చిమ బెంగాల్ (తృణమూల్ కాంగ్రెస్) రాష్ట్రాలకు చెందినవారు. జిఎస్‌టి విధానంలో, కేంద్ర రాష్ట్రాలమధ్య ఆదాయ వనరుల పంపిణీలో అనేక లొసుగులు ఉన్నాయని రాష్ట్రాల నుండి విమర్శలు వెల్లువెత్తటం, మరోవైపు కొన్ని రాష్ట్రాలలో ఎన్నికలు రావడంతోపాటు అనేక ప్రతికూల పరిస్థితులమధ్య వినియోగదారు అనుకూల విధానం అనుసరించడానికి కేంద్ర ప్రభుత్వం చేసిన ప్రతిపాదనలను ఆరుగురు సభ్యులతో కూడిన జిఎస్‌టి మంత్రుల బృందం ఆమోదించింది. సామాన్య ప్రజలకు, సాధారణ వినియోగదారులకు మేలు కలుగుతుందనుకుంటే ఈ నిష్పత్తిని, శ్లాబుల హేతుబద్ధీకరణకు కూడా మంత్రులబృందం సానుకూలంగా ఉందని సామ్రాట్ చౌధురి చెప్పారు. రెండు శ్లాబులను తొలగించేందుకు మంత్రుల కమిటీ అంగీకరించిందని, కేంద్రానికి ఈ మేరకు సిఫార్సు చేస్తామని చెప్పారు. అన్ని రాష్ట్రాలూ ఈ ప్రతిపాదిత మార్పులను స్వాగతించాయని ఉత్తర ప్రదేశ్ ఆర్థికమంత్రి సురేశ్ కుమార్ ఖన్నా చెప్పారు. పశ్చిమ బెంగాల్ ఆర్థికమంత్రి చంద్రిమా భట్టాచార్య మాట్లాడుతూ, కేంద్రం ప్రతిపాదించిన రేటు హేతుబద్ధీకరణలో రాష్ట్రాలకు వచ్చే నష్టాన్ని ఎలా భర్తీచేస్తారన్న విషయాన్ని వివరించి చెప్పలేదని విమర్శించారు. శ్లాబుల మార్పులవల్ల జరిగే ఈ ఆదాయ నష్టాన్ని ఎలా భర్తీ ని ఒకవైపు ప్రతిపక్ష పాలిత మంత్రులు ప్రశ్నిస్తుండగా, దీనిపై ఎస్‌బిఐ పరిశోధనా నివేదిక వెలువడింది. దీని ప్రకారం, కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జిఎస్‌టి సంస్కరణలవల్ల ప్రతి సంవత్సరం కోశాగారానికి రూ.85,000 కోట్ల మేరకు భారం పడతుంది. దీనివల్ల రూ.1.98 లక్షల కోట్ల మేరకు వినియోగవృద్ధి జరుగుతుందని నివేదిక అంచనావేసింది. ఆర్థిక వ్యవస్థ ఊపు అందుకుంటుందని, పన్నుల్లో కోతల వల్ల ధరలు తగ్గుతాయని, ప్రజల్లో వ్యయాలు భారీగా పెరగుతాయని కూడా నివేదిక అంచనావేసింది.

## బిజెపి యత్నం

(మొదటి పేజీ తరువాయి)

ప్రజా సంఘాల మనుగడ కష్టసాధ్యమని, ప్రజా పోరాటాలు కొనసాగించాల్సిందేనని ఆయన ఉద్ఘాటించారు. పార్టీలో యువత, విద్యార్థులు, మహిళలను పార్టీలో ప్రోత్సహించాలలన్నారు. వెనుకబడిన తరగతుల (బిసి) కు 52 శాతం రిజర్వేషన్‌ను, రాజ్యాంగపరమైన హక్కులను కల్పించాలని బిసిలు చేస్తున్న పోరాటానికి కమ్యూనిస్టు పార్టీ సంపూర్ణ మద్దతు ఇవ్వాలని, వారితో కలిసి కదనరంగంలోకి దిగాల్సిందేనన్నారు.

### జస్టిస్ సుదర్శన్ రెడ్డికి బిఆర్ఎస్ మద్దతు ఇవ్వబోమనడమేమిటి?

జాతీయ స్థాయిలో ఇండియా కూటమి ప్రకటించిన ఉప రాష్ట్రపతి అభ్యర్థి, తెలంగాణ వాది జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డికి తెలంగాణ సెంటిమెంట్ ఉన్న బిఆర్ఎస్ మద్దతు ఇవ్వబోదనడం బిఆర్ఎస్ అవకాశవాద రాజకీయాలకు నిదర్శమని డాక్టర్ కె.నారాయణ విమర్శించారు. ఇండియా కూటమిలో ఉండబోమని ప్రకటించిన ఆమ్ ఆద్మీ పార్టీ అధినేత కెజ్రివాలే ఇప్పుడు ఇండియా కూటమి ప్రకటించిన ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మద్దతు ప్రకటించారని, మరి బిజెపికి వ్యతిరేకమైన బిఆర్ఎస్ పార్టీ మాత్రం మద్దతు ఇవ్వకపోవడం కెటిఆర్‌ది వీరోచిత పలాయనమని డాక్టర్ నారాయణ పేర్కొన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీకి ఉన్న ధైర్యం బిఆర్ఎస్‌కు లేకుండా పోయిందని ఆయన ఎద్దేవా చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించిన జస్టిస్ సుదర్శన్ రెడ్డికి తాము ఓటు వేయబోమని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కె.తారాక రామారావు ప్రకటించడం సిగ్గు చేటు అని అన్నారు. సిఎంరేవంత్ రెడ్డికి ఉప రాష్ట్రపతి అభ్యర్థి ప్రకటనకు అసలు ఏమి సంబంధమని ప్రశ్నించారు. సిఎం రేవంత్‌రెడ్డిని అడ్డం పెట్టుకుని ఎన్‌డిఎకు ఓటు వేస్తున్న బిఆర్ఎస్ వైఖరికి మించిన దివాళాకోరుతనం మరొకటి ఉండబోదని పేర్కొన్నారు.

## సంక్షేమ పథకాలు దెబ్బతింటాయ్

(మొదటి పేజీ తరువాయి)

గుర్తు చేశారు. వృద్ధి రేటులో లోటును పూరించేందుకు, రాష్ట్రాలు స్థిరంగా 14 శాతం వృద్ధిని సాధించేందుకు, మొదటి 5 సంవత్సరాల పాటు జిఎస్‌టి పరిహారం అందించే విధానం అమలులోకి వచ్చిందని, కానీ ఇప్పటి వరకు 14 శాతం వృద్ధి స్థిరపడలేదని, ప్రస్తుతం రాష్ట్రాల వార్షిక వృద్ధి కేవలం 8 నుంచి 9 శాతం మధ్యలోనే ఉందని ఆయన తెలిపారు. ఆదర్శ వృద్ధి రేటు 14 శాతాన్ని, ప్రస్తుత 89 శాతం వృద్ధి రేటును అంశాన్ని పక్కన పెడితే , ప్రతిపాదనలు ఒంటరిగా పరిశీలిస్తే రాష్ట్రాలకు ప్రతికూల ఆదాయ వృద్ధికి దారితీసే అవకాశం ఉందని వివరించారు. తెలంగాణ, కర్నాటక, తమిళనాడు వంటి దక్షిణ రాష్ట్రాలు దేశ ఆదాయాలకు గణనీయంగా సహకరిస్తున్నప్పటికీ, జాతీయ ఆదాయంలో వాటి వాటాకు తగిన విధంగా నిధుల పంపిణీ జరగడం లేదన్నారు. జిఎస్‌టి సంస్కరణలలో భాగంగా రేట్ రేషనలైజేషన్ ప్రతిపాదనకు మద్దతు తెలిపినా, ఇందుకు సరైన పరిహార యంత్రాంగం ఉండాలని స్పష్టం చేశారు.

### పరిహార సెస్సును రాష్ట్రాలకు ఇవ్వండి..

లేదంటే 'లగ్జరీ'వస్తువులపై పన్ను పెంచి..ఆ అదనపు ఆదాయమైనా ఇవ్వండి...ప్రస్తుతం అమలులో ఉన్న పరిహార సెస్సును కొనసాగిస్తూ, దానివల్ల సమకూరే మొత్తాన్ని పూర్తిగా ఆయా రాష్ట్రాలకు ఇవ్వాలని భట్టి విక్రమార్క ప్రతి పాదించారు. పరిహార సెస్సును రద్దు చేసి, సిగరెట్లు, మద్యం, విలాస వస్తువుల వంటి 'సిన్' లేదా లగ్జరీ ఉత్పత్తులపై జిఎస్‌టి రేట్లు ప్రస్తుత స్థాయికి పెంచి, అదనంగా లభించే ఆదాయాన్ని రాష్ట్రాలకు కేటాయించాలని సూచించారు. తద్వారా సాధారణ పన్ను చెల్లింపుదారులపై భారం తగ్గడంతో పాటు, పేద, మధ్యతరగతి సంక్షేమ పథకాలు, మౌలిక వసతుల అభివృద్ధి ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వం సమర్థవంతంగా కొనసాగిస్తుందని భట్టి విక్రమార్క తెలిపారు.

## పటిష్టంగా అమలుచేయాలి

(మొదటి పేజీ తరువాయి)

ప్రతినిధుల సభ ఏక గ్రీవంగా ఆమోదించింది. కార్మికులకు కనీస వేతనం నెలకు రూ.26 వేలు చెల్లించాలని ఎఐటియుసి రాష్ట్ర అధ్యక్షులు ఎండి. యూసుఫ్ తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. ఆర్‌టిసిలో కార్మిక సంఘాలకు ఎన్నికలను నిర్వహించడంతో పాటు కార్మికుల అన్ని సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సిపిఐ రాష్ట్ర సమితి ప్రతిపాదించిన తీర్మానాన్ని ప్రతినిధుల సభ ఆమోదించింది. అటవీ హక్కుల చట్టాన్ని పటిష్టంగా అమలు చేయడంతో పాటు అర్హులైన గిరిజనులకు పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కల్లూరి వెంకటేశ్వరరావు, స్థానిక సంస్థల ఎన్నికలలో, విద్యా ఉద్యోగ రంగాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లను పెంచాలని తెలంగాణ అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను కేంద్ర ప్రభుత్వం ఆమోదించి రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్‌లో చేర్చాలని కోరుతూ బిసి హక్కుల సాధన సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనుంజయ నాయుడు తీర్మానాన్ని ప్రవేశ పెట్టారు. కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర కౌలు రైతు సంఘం ప్రధాన కార్యదర్శి కె.సూర్య నారాయణ, పెండింగ్ ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేసి గత ఏడు దశబ్దాలు సాగు నీటికి నోచుకోని 57 లక్షల పైచిలుకు ఎకరాలకు సాగునీటిని అందించాలని కొండపర్తి గోవిందరావు, రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో పనిచేస్తున్న కాంట్రాక్టు, శానిటేషన్, పేషంట్ కేర్, సెక్యూరిటీ సిబ్బందికి జిఓ 60 ప్రకారం రూ.13,600 వేతనం చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఎఐటియుసి రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నర్సింహా తీర్మానాన్ని పెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది. మున్సిపల్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ యూనియన్ నాయకులు కె.ఏసురత్నం, సింగరేణి సంస్థలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జోక్యం ఉండరాదని సింగరేణి క్యాలరీస్ వర్కర్స్ యూనియన్ అదనపు ప్రధాన కార్యదర్శి ఎం.రంగయ్య తీర్మానాలను ప్రవేశపెట్టారు. ప్రభుత్వపథకాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభు త్వ ఉద్యోగులుగా నియమించాలని శ్రామిక ఫోరం నాయకురాలు పి.ప్రేమ్‌పావని, భారత రాజ్యాంగాన్ని పరిరక్షించాలని హైకోర్టు న్యాయవాది కె.ప్రభాకర్‌రావు, జాబ్ క్యాలెండర్‌ను అమ లు, నిరుద్యోగ భృతి, రాజీవ్ యువ వికాస్ పథకం అమలు చేయాలని ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నెర్ల కంటి శ్రీకాంత్, కుల వివక్ష, దళితులపై పెరుగుతున్న దాడులను అరికట్టాలని డిహెచ్‌పిఎస్ నాయకులు టి.లక్ష్మ ణ్‌లు ప్రవేశ పెట్టిన తీర్మానాలను ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. గీతపనివారల పెండింగ్ ఎక్స్‌గ్రేషియో రూ.13 కోట్లు వెంటనే చెల్లించాలని, 1/70 చట్టం పరిధిలోని ప్రాంతాల్లో టి ఎఫ్ టి, టి సి ఎస్ లలో గీత కార్మికులకు సభ్యత్వం కల్పించి ఇతర ప్రాంతాలలో మాదిరిగానే అన్ని ప్రయోజనాలను వర్తింపజేయాలని గీతపనివారల సంఘం రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ బొమ్మగాని నాగభూషణం ప్రవేశ పెట్టిన తీర్మానాన్ని సభ ఆమోదించింది.

---

## చర్చ తర్వాతా? ముందా?

(మొదటి పేజీ తరువాయి)

జరిగాయి. పిటిషనర్ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యం సుందరం, దామా శేషాద్రి నాయుడు వాదించారు.కమిషన్ నివేదిక ఏకపక్షంగా ఉంది. సాక్షిగా విచారణకు పిలిచి వివరాలు కోరితే పిటిషనర్లు కమిషన్‌కు చెప్పారు. ఇతర సాక్షులు అభియోగాలు చేసి ఉం ఎంక్వయిరీస్ ఆఫ్ కమిషన్ యాక్ట్–1952లోని సెక్షన్ 8–బి కింద పిటిషనర్లకు నోటీసు ఇవ్వాలేదు. తమపై ఆరోపణలు చేసిన వాళ్లను క్రాస్ ఎగ్జామ్ చేసేందుకు కమిషన్ నోటీసులు ఇవ్వలేదు. కమిషన్ విచారణకు ఆఖరి సాక్షి కేసీఆర్. అప్పటికే తమపై ఎవరైనా ఆరోపణలు చేసి ఉం ఆ విషయాలను కేసీఆర్‌ను కమిషన్ ప్రశ్నించాలి. ఇలా చేయలేదు. ప్రతిపక్షంలో ఉండగా కాంగ్రెస్ పార్టీ కాళేశ్వరంపై లేనిపోని విమర్శలు చేసింది. అధికారంలోకి రాగానే మేడిగడ్డ పిల్లర్ బీటలు వారడాన్ని అడ్డం పెట్టుకుని విచారణ కమిషన్‌ను నియమించింది. కుట్రతో 2024 మార్చి 14న జీవో 6 ద్వారా కమిషన్ ఏర్పాటు చేసింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బారేజీల ప్రణాళిక, డిజైన్, నిర్మాణంపై కమిషన్ విచారణ చట్ట వ్యతిరేకంగా సాగింది. 2007లో ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి ప్రాజెక్టు నిర్మించాలని ఉమ్మడి ఏపీ సర్కార్ నిర్ణయించింది. మహారాష్ట్ర అభ్యంతరం చెప్పడంతో ముందుకు సాగలేదు. 2014లోతెలంగాణ రాష్ట్రం ఏర్పాటుతో సెంట్రల్ పబ్లిక్ సెక్టర్ సంస్థతో సర్వే జరిగింది. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల వద్ద బారేజీల నిర్మాణాలతో కాళేశ్వరం లిఫ్ట్ ప్రాజెక్టుకు పిటిషనర్ కేసీఆర్ సీఎంగా ఉండగా క్యాబినెట్ ఆమోదం చెప్పింది. సెంట్రల్ వాటర్ కమిషన్, కేంద్ర పర్యావరణ మంత్రిత్వ శాఖ, టెక్నికల్ అడ్వైజరీ కమిటీ అనుమతులు కూడా ఇచ్చాయి. అయితే, కేసీఆరే స్వయంగా ప్రాజెక్ట్ ప్రదేశాలను ఎంపిక చేశారని తప్పుగా కమిషన్ తేల్చింది. కేబినెట్ ఆమోదం లేదని కూడా చెప్పడం సరికాదు. పరిపాలనా అనుమతులు కూడా ఉన్నాయి. కాంట్రాక్టర్లకు అనుకూలంగా, అదనపు పనులకు ఆదేశాలిచ్చామని కమిషన్ చెప్పడం వాస్తవం కాదు. బారేజీల్లో పూర్తి స్థాయిలో నీరు నిల్వ చేయడంతో మేడిగడ్డ పిల్లర్ బీటలు వారిందని చెప్పడం కూడా నిజంకాదు అని వాదించారు. రాష్ట్రం తరఫున అడ్వొకేట్ జనరల్ ఎ.సుదర్శన్‌రెడ్డి ప్రతివాదన చేస్తూ కమిషన్ ముందున్న సమాచారం మేరకు విచారణ ఉంటుందని, సెక్షన్ 8–బి, 8–సి సెక్షన్ల కింద నోటీసు ఇవ్వాలనే నిబంధన ఏమీలేదన్నారు. ప్రజాధనాన్ని మంచినీళ్ల ప్రాయంగా వెచ్చించిన తర్వాత కూడా నీళ్లను లిఫ్ట్ చేయలేని దుస్థితి ఉందన్నారు. కమిషన్ నివేదికను ప్రభుత్వం అసెంబ్లీలో లోతుగా చర్చ జరగాల్సివుందని, పిటిషనర్లు ఇద్దరూ ఎమ్మెల్యేలని, అసెంబ్లీలో జరిగే చర్చలో అన్ని విషయాలు వాళ్లు చెప్పకునే ఆస్కారం ఉందన్నారు. మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయవద్దని, పిటిషన్లను కొట్టివేయాలన్నారు. లేదం కౌంటర్ వేస్తామని, గడువు కావాలని కోరారు. కమిషన్ రిపోర్టును ప్రభుత్వ వెబ్‌సైట్స్‌లో అప్‌లోడ్ చేయదన్నారు. కమిషన్ తరఫున సీనియర్ లాయర్ నిరంజన్ రెడ్డి వాదిస్తూ, కమిషన్ సమగ్రంగా విచారణ జరిపిందన్నారు. పిటిషనర్లు చెబుతున్న సుప్రీం కోర్టు తీర్పులు ఇక్కడ వర్తించవన్నారు. కమిషన్ రిపోర్టుపై జోక్యం అవసరం లేదన్నారు. వాదనలపై హైకోర్టు, కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టాక తదుపరి చర్యలు ఉంటాయో, లేక చర్యలు తీసుకున్నా అసెంబ్లీలో రిపోర్టు పెడతారో శుక్రవారం జరిగే విచారణ సమయంలో చెప్పాలని ప్రభుత్వాన్ని ఆదేశించింది.

## చూస్తూ ఊరుకోవాలా?

(మొదటి పేజీ తరువాయి)

అవలంబించడం కూడా కనుగొనబడింది.రాష్ట్ర ప్రభుత్వానికి, కేంద్ర ప్రభుత్వానికి మధ్య ఉన్నటువంటి ప్రతిష్ఠంభనకు ముగింపు పలకడానికి రాజనీతిజ్ఞత, రాజకీయ పరిణతితో ప్రార్థిస్తారు' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఉద్ఘాటించారు.'ఈ దేశంలోని ప్రతీ సమస్యకూ కోర్టులో పరిష్కారాలు ఉండకపోవచ్చని నేను చెబుతున్నాను. దేశంలో ఉన్న ఎన్నో సమస్యలకు అక్కడ మీరు వ్యవస్థలోనే పరిష్కారాలు కనుగొంటారు' అని తుషార్ మెహతా చెప్పారు. అప్పుడు సిజెఐ బిఆర్.గవాయ్ సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతాను ఉద్దేశించి మాట్లాడుతూ 'ఏదైనా తప్పు ఉంటే దానికి పరిష్కారం ఉంటుంది. ఈ కోర్టు రాజ్యాంగానికి సంరక్షుడు.రాజ్యాంగానికి అక్షరాల అర్థం ఇవ్వడం ద్వారా రాజ్యాంగాన్ని అర్థం చేసుకోవాలి' అని ఆయన అన్నారు. అప్పుడు జస్టిస్ సూర్య కాంత్ సిజెఐ బిఆర్.గవాయ్‌తో ఏకీభవిస్తూ వ్యాఖ్యాన అధికారం సుప్రీంకోర్టుకు ఉంటే, చట్టం యొక్క వ్యాఖ్యానాన్ని కోర్టు ప్రయత్నించాలన్నారు. ఈ కోర్టు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను పరిష్కరించడంలో గవర్నర్‌కు నిర్దిష్ట టైమ్‌లైన్‌ను నిర్ణయించమని పార్లమెంట్‌ను కోరవచ్చు. కానీ ఈ కోర్టు తీర్పు ద్వారా అది సాధ్యం కాకపోవచ్చని మెహతా జోడించారు. 'మీరు అలాచేయలేరని తీవ్రమైన అభిప్రాయం ఉంటే రాజ్యాంగాన్ని అమలు చేస్తే మాకు అలా అధికారం లేదని మీరు అంటున్నారా?' అని జస్టిస్ నరసింహ్మ ప్రశ్నించారు. తర్వాత సొలిసిటర్‌జనరల్ తుషార్ మెహతా తమిళనాడు గవర్నర్ కేసులో ఏప్రిల్ 8నాటి తీర్పును ప్రస్తావించారు.ఇది ప్రస్తుత రాష్ట్రపతి సూచనకు దారితీసింది. రాష్ట్రపతి, గవర్నర్ కారణాలను నమోదు చేస్తారని, వారు టైమ్‌లైన్‌ను పాటించకపోతే రాష్ట్రాలు సుప్రీంకోర్టు లేదా హైకోర్టును ఆశ్రయించవచ్చని తీర్పులు చెబుతున్నాయి. 'దీని అర్థం ఒక సంస్థ రాష్ట్రపతిని కొంత కాలపరిమితిలోపు అతా చేయమని నిర్దేశిస్తోంది. నేను ఆదేశాలను గౌరవిస్తాను. సమర్థన ఉండవచ్చు కానీ అది అధికార పరిధిని ఇవ్వదు' అని సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అన్నారు.విచారణ జరుగుతోంది. అంతకు ముందు న్యాయపరమైన కార్యకలాపాలు న్యాయపరమైన ఉగ్రవాదంగా మారకూడదు అని ప్రధాన న్యాయమూర్తి బిఆర్.గవాయ్ అన్నారు. ఎంతో అనుభవం ఉన్న ఎన్నికైన వ్యక్తులను ఎప్పుడూ తక్కువ అంచనావేయకూడదని తుషార్ మెహతా చెప్పినప్పుడు ప్రధానన్యాయమూర్తి ఈ వ్యాఖ్యలు చేశారు.

## 'మూసీ' సుందరీకరణ పేరుతో దోచుకునేందుకు సిద్ధమైన కాంగ్రెస్ : కెటిఆర్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** మూసీ నది ప్రక్షాళన, సుందరీకరణ పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల సొమ్మును దోచుకునేందుకు సిద్ధమవుతోందని బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటి.రామారావు అన్నారు. ఒక వైపు కాళేశ్వరం ప్రాజెక్టు కూలిపోయిందని అబద్ధాలు చెబుతూ, మరోవైపు అదే కాళేశ్వరంలో అంతర్భాగమైన కొండపోచమ్మ సాగర్ నుండి గోదావరి నీటిని తీసుకుంటామని చెప్పడాన్ని ప్రజలు గమనిస్తున్నారని పేర్కొన్నారు. మూసీ అభివృద్ధి కోసం గత బిఆర్ఎస్ ప్రభుత్వం రూ 16,000 కోట్లతో మాస్టర్ ప్లాన్, డిపిఆర్‌ను రూపొందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అంచనాలను రూ. 1,50,000 కోట్లకు పెంచి, దోపిడీకి పాల్పడుతోందని కెటిఆర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఫారం-6

చూడుము రూల్ - 19 యొక్క సబ్ రూల్ -1
మరియు చట్టం - 30/2013 లోని సెక్షన్ 11(1)

తెలంగాణ ప్రభుత్వం
రెవెన్యూ శాఖ (భూసేకరణ)

ప్రాథమిక ప్రకటన

జి/358/2025 తేది: 08.08.2025
నెం.జి/335/1/2025 తేది: 08.08.2025

తెలంగాణ ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ఆదేశానుసారం నల్లగొండ జిల్లా, దామరచర్ల మండలం, వాడపల్లి గ్రామంలో భూమి విస్తీర్ణం **ఎక. 30-38 3/4 గుంటలు** ప్రజాప్రయోజనార్థం న్యూఫోర్ లేన్ సిసి రోడ్, యదాద్రి థర్మల్ పవర్ స్టేషన్ నుండి నార్కెట్ పల్లి - అద్దంకి - మేదారమెట్ల రోడ్(స్టేట్ హైవే -2) వరకు నిర్మాణానికి ఈ దిగువ చూపిన భూమి అవసరం ఉన్నదని భావించినందున, భూసేకరణ పునరుపాది, పునరావాస కల్పనకు పారదర్శకత మరియు హేతుబద్ధమైన పరిహారాన్ని పొందే హక్కు చట్టం - 2013 లోని సెక్షన్ 11(1) అనుసరించి ప్రకటన జారీచేయనైనది.

తెలంగాణ ప్రభుత్వ నీటిపారుదల శాఖ జి.ఓ. నెం. 47, తేది: 18.06.2025 జారీ చేసినారు అట్టి G.O నందు భూసేకరణ చట్టం 2013 (చట్టం నెం.30 ఆఫ్ 2013) లోని 2013 చట్టం కింద అధ్యాయం II మరియు అధ్యాయం III ఈ ప్రాజెక్ట్ నుండి మినహాయించబడింది.

కావున, ఈ ప్రాజెక్టు నల్లగొండ జిల్లా, వాడపల్లి మండలం, దామరచర్ల గ్రామంలో భూమి విస్తీర్ణం ఎక. **30-38 3/4 గుంటలు** గల భూమి ఈ క్రింద చూపిన విధముగా భూసేకరణ నిమిత్తం ప్రాథమిక ప్రకటన జారీచేయనైనది.

షెడ్యూల్

గ్రామము: వాడపల్లి మండలము: దామరచర్ల జిల్లా: నల్గొండ

| క్ర.సం. | సర్వే నెం. | [illegible] | [illegible] | [illegible] | విస్తీర్ణం ఎక గుంటలు | భూమిని కోల్పోయే రైతు పేరు మరియు తండ్రి / భర్త పేరు | [illegible] |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 18 | 2 | ఖుష్కి | పట్టా | 00.25 1/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 2 | 23 | 2 | ఖుష్కి | బంచరాయి | 03-25.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 3 | 117 | 2 | ఖుష్కి | పట్టా | 01.04 1/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 4 | | | ఖుష్కి | పట్టా | 00.30 1/4 | బొడ్డు సాంబయ్య తండ్రి సైదులు | |
| 5 | | | ఖుష్కి | పట్టా | 00.30 1/4 | బొడ్డు శ్రీనివాసులు తండ్రి సైదులు | |
| 6 | | | ఖుష్కి | పట్టా | 00.30 1/4 | బొడ్డు రామయ్య తండ్రి సైదులు | |
| ఉప మొత్తం:- | | | | | 03-15.00 | | |
| 7 | 118 | 2 | ఖుష్కి | పట్టా | 00-09.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 8 | 120 | 2 | ఖుష్కి | పట్టా | 01.08 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 9 | | | ఖుష్కి | | 00.20 1/4 | రైల్వే లైన్ | |
| ఉప మొత్తం:- | | | | | 01-29.00 | | |
| 10 | 125 | 2 | ఖుష్కి | పట్టా | 00-36 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 11 | 143 | 2 | ఖుష్కి | పట్టా | 00-38 1/2 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 12 | 144 | 2 | ఖుష్కి | పట్టా | 00-21 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 13 | 145 | 2 | ఖుష్కి | పట్టా | 00-01.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 14 | 154 | 2 | ఖుష్కి | పట్టా | 03-01.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 15 | 155 | 2 | ఖుష్కి | పట్టా | 00-09.00 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 16 | 165 | 2 | ఖుష్కి | పట్టా | 00-35 3/4 | స్పిరిట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 17 | 166 | 2 | ఖుష్కి | పట్టా | 00-06 3/4 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| 18 | | | ఖుష్కి | పట్టా | 01-10 1/2 | స్పిరిట్ కంపెనీ ప్రైవేట్ లిమిటెడ్ | |
| ఉప మొత్తం:- | | | | | 01-17 1/4 | | |
| 19 | 180 | 2 | ఖుష్కి | పట్టా | 00-17.00 | వేముల లక్ష్మమ్మ భర్త భాస్కర్ రావు | |
| 20 | | | ఖుష్కి | పట్టా | 00-17 1/4 | వేముల విజయ్ భర్త అమృతం | |
| ఉప మొత్తం:- | | | | | 00-34 1/4 | | |
| 21 | 181 | 2 | ఖుష్కి | పట్టా | 00-16.00 | ఐయ్య బంగారమ్మ భర్త సైదులు | |
| 22 | | | ఖుష్కి | పట్టా | 00-16 1/4 | ఐయ్య సైదయ్య తండ్రి | |
| ఉప మొత్తం:- | | | | | 00-32 1/4 | | |
| 23 | 185 | 2 | ఖుష్కి | పట్టా | 00-03 3/4 | వేముల లక్ష్మమ్మ భర్త భాస్కర్ రావు | |
| 24 | | | ఖుష్కి | పట్టా | 00-03 3/4 | వేముల విజయ్ భర్త అమృతం | |
| 25 | | | ఖుష్కి | పట్టా | 00-01 1/2 | కోల నర్సింహా రావు తండ్రి వెంకటేశ్వర్లు | |
| 26 | | | ఖుష్కి | పట్టా | 00-24 1/2 | ఇండియన్ సిమెంట్ ప్రైవేట్ లిమిటెడ్ | |
| ఉప మొత్తం:- | | | | | 00-33 1/2 | | |
| 27 | 188 | 2 | ఖుష్కి | పట్టా | 00-22 3/4 | కొటిక కొండయ్య తండ్రి వెంకటేశ్వర్లు | |
| 28 | | | ఖుష్కి | పట్టా | 00-04.00 | లొట్టపల్లి నాగ సైదమ్మ భర్త వెంకయ్య | |
| 29 | | | ఖుష్కి | పట్టా | 00-26 3/4 | కొటిక వెంకటేశ్వర్లు తండ్రి సత్తయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-13 1/2 | | |
| 30 | 208 | 2 | ఖుష్కి | పట్టా | 00-01.00 | బెల్లంకొండ సుశీల భర్త శ్రీను | |
| 31 | | | ఖుష్కి | పట్టా | 00-01.00 | వాకిటి వెంకటేశ్వర్లు తండ్రి వెంకయ్య | |
| 32 | | | ఖుష్కి | పట్టా | 00-09 1/2 | గడ్డం వెంకన్న తండ్రి మల్లయ్య | |
| 33 | | | ఖుష్కి | పట్టా | 00-07 1/4 | కాసాని దుర్గమ్మ భర్త మల్లయ్య | |
| 34 | | | ఖుష్కి | పట్టా | 00-02 1/4 | కాలువ | |
| ఉప మొత్తం:- | | | | | 00-21.00 | | |
| 35 | 209 | 2 | ఖుష్కి | పట్టా | 00-01 3/4 | గుండు సైదులు తండ్రి గుర్వయ్య | |
| 36 | | | ఖుష్కి | పట్టా | 00-02.00 | కాలువ | |
| 37 | | | ఖుష్కి | పట్టా | 00-17 3/4 | వ్యక్తి తెలియదు | |
| 38 | | | ఖుష్కి | పట్టా | 00-06 3/4 | కాసాని దుర్గమ్మ భర్త మల్లయ్య | |
| 39 | | | ఖుష్కి | పట్టా | 00-03 1/2 | కాసాని వరలక్ష్మి భర్త గోపయ్య | |
| 40 | | | ఖుష్కి | పట్టా | 00-08.00 | రాయికింది ఇందిరమ్మ భర్త నారాయణ | |
| 41 | | | ఖుష్కి | పట్టా | 00-01 1/4 | గడ్డం వెంకన్న తండ్రి మల్లయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-01.00 | | |
| 42 | 210 | 2 | ఖుష్కి | పట్టా | 00-20 1/2 | గడ్డం వెంకయ్య తండ్రి పెద కోటయ్య | |
| 43 | | | ఖుష్కి | పట్టా | 00-23 1/2 | నార్సింగ్ ఈశ్వరమ్మ భర్త సైదులు | |
| 44 | | | ఖుష్కి | పట్టా | 00-11 1/2 | బెల్లంకొండ సుశీల భర్త శ్రీను | |
| 45 | | | ఖుష్కి | పట్టా | 00-07 1/4 | వాకిటి కోటేశ్వర్‌రావు తండ్రి వెంకయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-22 3/4 | | |
| 46 | 217 | 2 | ఖుష్కి | పట్టా | 00-02 1/4 | దాసరి కొండయ్య తండ్రి శ్రీరాములు | |
| 47 | | | ఖుష్కి | పట్టా | 00-10 1/4 | లొట్టపల్లి గుర్వయ్య తండ్రి తిరుపతయ్య | |
| 48 | | | ఖుష్కి | పట్టా | 00-14 1/4 | ఐయ్య జీడయ్య తండ్రి లింగయ్య | |
| 49 | | | ఖుష్కి | పట్టా | 00-00 1/2 | ముప్ప లక్ష్మీ నర్సమ్మ భర్త సత్యనారాయణ | |
| 50 | | | ఖుష్కి | పట్టా | 00-02.00 | రాయికింది నాగయ్య తండ్రి వెంకటేశ్వర్లు | |
| ఉప మొత్తం:- | | | | | 00-29 1/4 | | |
| 51 | 218 | 2 | ఖుష్కి | పట్టా | 00-33.00 | పద్దు పాపయ్య తండ్రి వెంకయ్య | |
| 52 | | | ఖుష్కి | పట్టా | 00-18.00 | దాసరి కనకా రావు తండ్రి శ్రీరాములు | |
| 53 | | | ఖుష్కి | పట్టా | 00-18 3/4 | దాసరి కొండయ్య తండ్రి శ్రీరాములు | |
| ఉప మొత్తం:- | | | | | 01-29 3/4 | | |
| 54 | 219 | 2 | ఖుష్కి | పట్టా | 00-01 1/2 | రాయికింది నాగయ్య తండ్రి వెంకటేశ్వర్లు | |
| 55 | | | ఖుష్కి | పట్టా | 00-04.00 | బెల్లంకొండ వెంకన్న తండ్రి ఆదినారాయణ | |
| 56 | | | ఖుష్కి | పట్టా | 00-04.00 | రాయికింది బ్రహ్మం తండ్రి యెర్ర కోటయ్య | |
| 57 | | | ఖుష్కి | పట్టా | 00-10 1/2 | రాయికింది వెంకన్న తండ్రి పల్లయ్య | |
| 58 | | | ఖుష్కి | పట్టా | 00-08 1/2 | రాయికింది ఇందిరమ్మ భర్త రమేష్ | |
| 59 | | | ఖుష్కి | పట్టా | 00-09.00 | రాయికింది నర్సయ్య తండ్రి చిన్న గుర్వయ్య | |
| 60 | | | ఖుష్కి | పట్టా | 00-07 1/2 | రాయికింది బిక్షమమ్మ భర్త శేఖర్ | |
| 61 | | | ఖుష్కి | పట్టా | 00-06 1/2 | రాయి కింది వెంకటేశ్వర్లు తండ్రి గుర్వయ్య | |
| 62 | | | ఖుష్కి | పట్టా | 00-13.00 | రాయికింది ఇందిరమ్మ భర్త నారాయణ | |
| 63 | | | ఖుష్కి | పట్టా | 00-07.00 | పాతులోతు రమేష్ తండ్రి హనుమ నాయిక్ | |
| 64 | | | ఖుష్కి | పట్టా | 00-07.00 | రాయికింది సురేష్ తండ్రి లక్ష్మయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-38 1/2 | | |
| 65 | 220 | 2 | ఖుష్కి | పట్టా | 00-17 1/4 | పాతులోతు వెంకటేశ్వర్లు తండ్రి హనుమ నాయిక్ | |
| 66 | 221 | 2 | ఖుష్కి | పట్టా | 00-02.00 | పాతులోతు వెంకటేశ్వర్లు తండ్రి హనుమ నాయిక్ | |
| 67 | 223 | 2 | ఖుష్కి | పట్టా | 01-05.00 | పయ్యావుల నాగరాజు తండ్రి శివయ్య | |
| 68 | | | ఖుష్కి | పట్టా | 00-03 1/2 | గడ్డం వెంకయ్య తండ్రి పెద కోటయ్య | |
| ఉప మొత్తం:- | | | | | 01-08 1/2 | | |
| 69 | డొంక | 2 | ఖుష్కి | పట్టా | 00-11.00 | నక్ష డొంక | |
| మొత్తం:- | | | | | 30-38 3/4 | | |

భూమి యొక్క ప్లాను మరియు వివరములు జిల్లా కలెక్టర్, నల్లగొండ, భూసేకరణ అధికారి మరియు సబ్-కలెక్టర్, మిర్యాలగూడ గారి కార్యాలయములలో ఉంచనైనది. సంబదిత వ్యక్తులు ఏదైనా కార్యాలయము పనిదినములలో మరియు పని వేళలలో తనిఖీ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం / జిల్లా కలెక్టర్, నల్లగొండ గారు సబ్-కలెక్టర్, మిర్యాలగూడ గారిని మరియు వారి సిబ్బందిని ఇట్టి భూసేకరణకు సంబందిచి సెక్షన్ 12 ప్రకారం పైన చూపిన భూములలో ఏదైనా ప్రదేశములో ప్రవేశించి సర్వే భూమి కొలతలు తీసుకొనుటకు మరియు ఇత్యాది పనులు చేపట్టటానికి అనుమతించనైనది.

సెక్షన్ 11 (4) ప్రకారం భూసేకరణ కొరకు ప్రతిపాదించబడిన భూమి విషయములో జిల్లా కలెక్టర్, నల్లగొండ గారి ముందస్తు అనుమతి లేకుండా, ప్రకటన జారీచేసిన తేది నుండి ఆ ప్రకటనలో ఉదహరించబడిన భూములకు సంబందించి ఎటువంటి కొనుగోలు, అమ్మకాలు, తనఖా మొదలగు చర్యలుచేపట్టరాదు.

భూసేకరణ విషయములో సంబందిచిన భూ యజమానులు ఏదైనా అభ్యంతరములున్న యెడల మరియు నష్టపరిహారం సంప్రదింపుల ద్వారా పరిష్కారం కొరకు చట్టంలోని సెక్షన్ 15 ప్రకారం జిల్లా కలెక్టర్, నల్లగొండ గారికి లిఖిత పూర్వకముగా ప్రకటన జారీ చేసిన 60 (అరవై) దినముల లోపల తెలియజేయవలసి ఉన్నది.

సం/- భూసేకరణ అధికారి మరియు సబ్-కలెక్టర్, మిర్యాలగూడ.
సం/- అదనపు కలెక్టర్, నల్లగొండ జిల్లా.
సం/- జిల్లా కలెక్టర్, నల్లగొండ.

DIPR RO NO. 500/LA/PP/Advt/Pub/2025-26



# జనరల్
STATE & REGIONAL NEWS

## గ్రామపంచాయతీ పెండింగ్ బిల్లులు చెల్లించాలి

### సర్పంచుల సంఘం డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** గ్రామపంచాయతీలకు పెండింగ్ బిల్లులు వెంటనే మంజూరు చేయాలని తెలంగాణ సర్పంచుల సంఘం డిమాండ్ చేసింది. ప్రభుత్వం ఏర్పడి 21 నెలల వుతున్నా స్టేట్ ఫైనాన్స్ (ఎస్ఎఫ్‌సి)కార్పొరేషన్ నుంచి చిల్లిగవ్వ పెండింగ్ బిల్లులు చెల్లించ లేదని సంఘం జాయింట్ యాక్షన్ కమిటీ రాష్ట్ర అధ్యక్షుడు సుర్వి యాదయ్య గౌడ్ అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం దయచేసి బిల్లులు చెల్లించి తమను ఆదుకోవాలని ఆయన అన్నారు.

## ఆదివాసీ గిరిజన సంస్కృతి..
# సంప్రదాయాలకు ప్రజాప్రభుత్వం కృషి

### మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సమ్మక్కసారలమ్మ మేడారం జాతర నిమిత్తం శాశ్వత పనులు చేపడుతున్నామని, జంపన్నవాగు నుంచి మేడారం ప్రాంగణం వరకు డబుల్ రోడ్లు, రోడ్ల వెడల్పు, డివైడర్లు, 29 ఎకరాల దేవాదాయ శాఖ భూమిలో స్మృతివనాన్ని అభివృద్ధి చేస్తున్నామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క వెల్లడించారు. కుటుంబ సభ్యుల ఫోన్లు ట్యాప్ చేయించడం కెటిఆర్ దర్టీమైండ్‌కు నిదర్శనమన్నారు. కేసులు, వ్యక్తిగత సమస్యలతో విసిగిపోయిన కెటిఆర్ ఫ్రస్టేషన్‌కు గురవుతున్నారని ఎద్దేవాచేశారు. హైదరాబాద్ సచివాలయంలో సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి మంత్రి సీతక్క గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఆదివాసీ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని, సమ్మక్క సారలమ్మ మహా జాతర కోసం ఎన్నడూ లేని విధంగా ఈ దఫా రూ.150కోట్లు ఖర్చు చేసిన్నట్లు వివరించారు. వచ్చే ఏడాది మేడారం సమ్మక్కసారలమ్మ జాతర జనవరి 22 నుండి 31వరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా జరుగుతుందన్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలనూ కల్పిస్తామని, భద్రత కోసం 12 వేల మంది పోలీస్ సిబ్బందిని నియమించనున్నట్లు వివరించారు. 13వ శతాబ్దపు ఈ చారిత్రక జాతరను భవిష్యత్ తరాలకు అందించే విధంగా ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తామన్నారు. శుక్రవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా లక్షా 15వేల పనులను రూ.2198కోట్ల వ్యయంతో ప్రారంభించనున్నామని వెల్లడించారు.

గ్రామాల రూపురేఖలను మార్చడంలో 'పనుల జాతర' కీలక పాత్ర పోషిస్తుందన్నారు. తనకు మంత్రి కొండా సురేఖకు ఎటువంటి విభేదాలు లేవని సీతక్క స్పష్టం చేశారు. రాజకీయాల్లో ఆడబిడ్డలను ఎదగనివ్వాలని, సమాజంలో ఆడబిడ్డలు ఎదుగుతుంటే ఓర్వలేకపోతున్నారని మండిపడ్డారు.

తామిద్దరమూ సమ్మక్కసారలమ్మ తరహా అక్కాచెల్లెళ్లలాగా కలిసే ఉన్నామన్నారు. సొంత చెల్లెలు కవిత కూడా లేఖ రాసి తనను సొంత పార్టీ నేతలే వేధిస్తున్నారని ఆరోపించారని, దీనిపైన కెటిఆర్ సమాధానం చెప్పాలని సీతక్క డిమాండ్ చేశారు. ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో యూరియా ఇచ్చినవారికి మద్దతు ఇస్తానని కెటిఆర్ చెబుతున్నారని, కానీ యూరియా ఇచ్చేది కేంద్ర ప్రభుత్వం అని కెటిఆర్‌కు తెలియదా? అని ఎద్దేవా చేశారు. బిజెపి, బిఆర్ఎస్ కలిసిపోయి రాష్ట్రంలో యూరియా కొరతను సృష్టించాయన్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికల విషయంలో బిజెపికి బిఆర్ఎస్ మద్దతు ఇస్తుందనే విషయాన్ని కెటిఆర్ దాచలేకపోతున్నారని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ గత మేడారం జాతరకు రూ.105 కోట్లు కేటాయిస్తే, ఈ సారి రూ.150కోట్లు కేటాయించామని వివరించారు. ఆదివాసి పూజారులు కోరిన విధంగా జాతర పనులు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందన్నారు. కాగా అంతకుముందు పంచాయతీరాజ్ శాఖ తరపున 'పనుల జాతర 2025 పోస్టర్'ను మంత్రులు ఆవిష్కరించారు.

## గురుకుల విద్యార్థుల
# ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టండి

### అధికారులను ఆదేశించిన మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** బిసి గురుకుల పాఠశాలలు, బిసి హాస్టల్‌లో ఉండే విద్యార్థుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెట్టాలని మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులను ఆదేశించారు. వరుస వర్షాల నేపథ్యంలో బిసి గురుకుల పాఠశాలలు, బిసి హాస్టల్‌లలో తాజా పరిస్థితులపై మంత్రి పొన్నం ప్రభాకర్ గురువారం అధికారులతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ టెలి కాన్ఫరెన్స్‌లో బిసి సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శ్రీధర్, కమిషనర్ బాల మాయాదేవి, గురుకుల సెక్రెటరీ సైదులు, జాయింట్ సెక్రెటరీలు శ్యామ్‌ప్రసాద్, తిరుపతి రెడ్డి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. భారీ వర్షాలు కుస్తుండటం, సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉండడంతో గురుకుల పాఠశాలలు, హాస్టల్‌లలో విద్యార్థుల ఆరోగ్యం విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అన్ని పాఠశాలల ప్రిన్సిపల్‌లు, వార్డెన్‌లకు ఆదేశాలు జారీచేశారు. విద్యార్థులకు విధిగా సిబ్బంది ఆరోగ్య పరీక్షలు నిర్వహించాలని, పాఠశాలలు, హాస్టల్‌లలో గడ్డి, ఇతర బుష్ క్లియరెన్స్ చేయాలని, కీటకాలు రాకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని తెలిపారు. తాగు నీటి ట్యాంకులు ఎప్పటికప్పుడు శుభ్రం చేసుకోవాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, వంటపాత్రలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. విద్యార్థులకు స్కూల్ యూనిఫాం, బెల్ట్, సాక్స్, స్పోర్ట్స్ పూర్తి చేయాలని తెలిపారు. సరైన సమయంలో పాఠ్యాంశాలు పూర్తి చేయాలని అన్నారు. అన్ని పాఠశాలల్లో 100 శాతం సీట్లు భర్తీ అయ్యానని .. ఎక్కడైనా ఖాళీలు లేకుండా చూసుకోవాలని ఆదేశించారు.



# నవంబర్ 8న హైదరాబాద్‌లో సిఎస్ఆర్ సమ్మిట్

### పోస్టర్‌ను విడుదల చేసిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** దక్షిణ భారతదేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించబడే కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) సమ్మిట్‌ను హైదరాబాద్‌లో నవంబర్ 8న నిర్వహిస్తున్నట్లుగా రోడ్లు, భవనాల మంత్రి కోమటి వెకంట్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సమ్మిట్‌కు సంబంధించిన అధికారిక పోస్టర్‌ను ఆయన హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో ప్రతీక్ ఫౌండేషన్ సిఇఒ గోనరెడ్డి, ఈవెంట్ లైసెన్సీ ఎదుదొడ్ల వినిల్ రెడ్డి, మాజీ మంత్రి జీవన్‌రెడ్డి పాల్గొని ఈ సమ్మిట్‌ను దక్షిణ భారతదేశ సిఎస్ఆర్ రంగంలో ఒక మైలురాయిగా మార్చాలని తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ ప్రఖ్యాత సమ్మిట్‌లో ప్రముఖ కార్పొరేట్ నాయకులు, సిఎస్ఆర్ నిపుణులు, అభివృద్ధిరంగ నిపుణులు మరియు పాలసీ మేకర్లు పాల్గొనబోతున్నారు. సామాజిక ఆవిష్కరణలు, సుస్థిర అభివృద్ధి మరియు సహకార భాగస్వామ్యాలపై ప్రభావవంతమైన చర్చల కోసం ఇది ఒక వేదికగా నిలవనుందని కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తెలిపారు. సమ్మిట్‌కు హైదరాబాద్‌ను వేదికగా ఎంచుకున్న నిర్వాహకులను ఈ సందర్భంగా ఆయన అభినందించారు. ఈ రాబోయే సమ్మిట్‌లో వినూత్న సిఎస్ఆర్ కార్యక్రమాలను ప్రదర్శించడంతో పాటు, ఉత్తమ అనుభవాలను పంచుకోవడానికి, వివిధ రంగాలలో భాగస్వామ్య అవకాశాలను అన్వేషించడానికి ఇది ఒక శక్తివంతమైన వేదికగా మారనుందన్నారు.

## తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారునిగా
# మాజీ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ హర్‌పాల్ సింగ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్ర నీటి పారుదల శాఖ సలహాదారునిగా మాజీ సైనికాధికారి లెఫ్టినెంట్ జనరల్ హర్‌పాల్ సింగ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. ఈమేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీచేశారు. హర్‌పాల్‌సింగ్ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఎటువంటి గౌరవ వేతనం పొందకుండానే రెండేళ్ల సలహాదారు పదవిలో కొనసాగనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న నీటిపారుదల సొరంగ ప్రాజెక్టుల సమస్యలను పరిష్కరించి, ఆ పనులను వేగవంతం చేయడంతోపాటు ఆయన నైపుణ్యాన్ని, సేవలను నీటి పారుదల, సిఎడి విభాగంలో వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. దేశ సరిహద్దులలో రహదారుల సంస్థలో డైరెక్టర్ జెనరల్‌గా,భారత సైన్యం ఇంజినీర్ ఇన్ చీఫ్‌గా హర్‌పాల్ సింగ్ ముఖ్య భూమిక పోషించారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంలో నిష్ణాతుడైన హర్‌పాల్‌సింగ్ భారత సైన్యంలో నాలుగు దశాబ్దాలకుపై చిలుకు విశిష్ట సేవలను అందించారు. ఇంజినీరింగ్ ఇన్ చీఫ్‌గా భారత సైన్యంలో విధులు నిర్వహిస్తున్న సమయంలోనే రోహ్తాంగ్ పాస్ కింద అటల్ టన్నెల్‌ను, అరుణాచల్ ప్రదేశ్‌లో సెల, నేచివ్ టన్నెల్‌ల నిర్మాణాలను పూర్తి చేశారు. హిమాలయాల ప్రాంతంలో అత్యంత క్లిష్టతరమైన భౌగోళిక పరిస్థితిలను అధిగమించి సొరంగాలను నిర్మించడంలోనూ హర్‌పాల్ సింగ్ కీలకపాత్రను పోషించారు. సివిల్



ఇంజినీరింగ్‌లో పట్టభద్రుడైన హర్‌పాల్‌సింగ్ అమెరికాలోని ప్రసిద్ధి చెందిన విశ్వవిద్యాలయం నుండి ఉన్నత చదువులు పూర్తిచేశారు. అపార అనుభవంతోపాటు జాతీయ, అంతర్జాతీయ సంస్థలలో గౌరవప్రదమైన విధులను కూడా నిర్వర్తిస్తున్నారు. అంతర్జాతీయ రోడ్ ఫెడరేషన్‌కు అధ్యక్షునిగా, భారత ఇనిస్టిట్యూషన్ ఆఫ్ సివిల్ ఇంజినీర్స్ ఉపాధ్యక్షునిగా, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ బ్రిడ్జి ఇంజినీర్స్ చైర్మన్‌గా, ఇండస్ట్రీ కనస్ట్రక్షన్ డెవలప్‌మెంట్ కౌన్సిల్‌కు వైస్‌ప్రెసిడెంట్‌గా ఆయన విధులు నిర్వర్తించారు.

**సొరంగ మార్గాల నిర్మాణంలో అపార అనుభవం :** సొరంగమార్గాల నిర్మాణంలో హర్‌పాల్ సింగ్‌కు ఉన్న అపార అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని తెలంగాణ రాష్ట్ర నీటిపారుదల శాఖ చేపడుతున్న సొరంగాల నిర్మాణాలను వేగవంతం చేయడంతోపాటు సొరంగ మార్గాల ఏర్పాటులో ఎదురయ్యే సాంకేతిక సమస్యల నివారణలో ఆయనకు ఉన్న సాంకేతిక నైపుణ్యాలను వినియోగించుకోవాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకే ఆయనను నీటి పారుదల సలహాదారునిగా నియమించింది.

రాష్ట్ర నీటిపారుదల శాఖను ఆధునిక పరిజ్ఞానం వైపు నడిపించడంతో పాటు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఇందులో భాగంగానే ఇప్పటికే డిజైన్ విభాగం పునర్వ్యవస్థీకరణ చేపట్టడంతో పాటు వివిధ విభాగాలలో నిపుణుల నియామకాలను చేపట్టి నీటిపారుదల శాఖను బలోపేతం చేస్తున్న నేపథ్యంలో సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడించి పనులను వేగవంతం చేస్తున్న నీటి పారుదల శాఖకు హర్‌పాల్‌సింగ్ నియామకం ఒక మైలురాయిగా నిలుస్తుందని అధికార వర్గాలు పేర్కొన్నాయి. సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగించి, అంతర్జాతీయ ప్రమాణాలు పాటించడంతోపాటు సాంకేతిక పరిజ్ఞానం భద్రతకు ఆయన అనుభవం ఎంతో ఉపయోగమని, తద్వారా నీటిపారుదల శాఖ శాస్త్రీయ ధృక్పథం అలవర్చుకునేందుకు హర్‌పాల్ సింగ్ నియామకం తోడ్పడుతుందని నీటి పారుదల శాఖ మంత్రి మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి ఆశాభావం వ్యక్తం చేశారు.

# రోడ్ల డ్యామేజ్ వివరాలపై నివేదిక రూపొందించండి

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** ఇటీవల కురిసిన భారీ వర్షాలు, వరదల వల్ల ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని రోడ్ల డ్యామేజ్ వివరాలపై నివేదిక రూపొందించాలని అధికారులను మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆదేశించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఆర్ అండ్ బి శాఖపై రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎంఎల్ఎ వెడ్మ బొజ్జు, ప్రభుత్వ స్పెషల్ సిఎస్ వికాస్ రాజ్, ఇఎన్‌సి జయభారతి, సిఇ.రాజేశ్వర్ రెడ్డి, ఎస్ఇ.ధర్మారెడ్డి పలువురు ఆర్‌అండ్‌బి అధికారులు పాల్గొన్నారు. ఈ సమావేశంలో కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి రోడ్ బ్రీచెస్ సంబంధించిన వివరాలు అడిగి తెలుసుకున్నారు. స్టేట్ రోడ్స్, నేషనల్ హైవే రోడ్స్, పలు కల్వర్టులు, మైనర్ బ్రిడ్జిల స్థితిగతుల లైఫ్ టైమ్ నమోదు చేయాలని సూచించారు. పూర్తి శిథిలావస్థకు చేరిన వాటి స్థానంలో కొత్తగా నిర్మించేందుకు ప్రపోజల్స్ తయారు చేయాలన్నారు. సుమారు 1000 కోట్ల వరకు ఆర్‌అండ్‌బి శాఖ రోడ్లు దెబ్బతిన్నాయని అధికారులు మంత్రి దృష్టికి తీసుకువచ్చారు. అతి కొద్ది రోజుల్లోనే హ్యామ్ విధానం ద్వారా మెరుగైన, నాణ్యమైన రోడ్లు వేసుకోబోతున్నామని మంత్రి ఈ సందర్భంగా పేర్కొన్నారు. త్వరలో టెండర్ ప్రక్రియ పూర్తిచేసుకొని, ఈ సీజన్ వర్షాలు తగ్గుముఖం పట్టగానే పనులు ప్రారంభించేందుకు ప్రభుత్వం పూర్తి ప్రణాళికాబద్ధంగా వెళ్తుందని చెప్పారు. కేంద్రం నుండి క్లియరెన్స్ రావాల్సిన నేషనల్ హైవే ప్రాజెక్ట్స్‌పై మంత్రి ఆరా తీశారు. వాటిపై ప్రత్యేకంగా దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. తాను ఇప్పటికే కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీతో కేంద్ర పరిధిలోని ప్రాజెక్ట్స్‌పై మాట్లాడానని, రాష్ట్ర ప్రభుత్వం తరుపున విజ్ఞప్తులు కూడా ఇచ్చామని వాటిపై ఆయన సానుకూలంగా స్పందించారని మంత్రి గుర్తుచేశారు. ఎమ్మెల్యే విజ్ఞప్తిపై మంత్రి సానుకూలంగా స్పందించారు.

## ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల ఫీజు నిర్ధారణ నిబంధనల సవరణకు ప్రభుత్వం అనుమతి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నాణ్యమైన విద్యను అందించే ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల ఫీజులను పెంచుకునేందుకు రాష్ట్రప్రభుత్వం అనుమతినిచ్చింది. దీనికి సంబంధించిన ఫీజు నిర్ధారణ నిబంధనలను సవరిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఆయా కళాశాలల అకౌంట్స్‌ను, విద్యా ప్రమాణాలను పరిగణలోకి తీసుకొని ఫీజులు నిర్ధారించనున్నారు. ఈమేరకు ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి డాక్టర్ యోగితారాణ ఉత్తర్వులు జారీచేశారు. ఇంజనీరింగ్, వృత్తి విద్యా కళాశాలల్లో విద్యార్థుల హాజరు, ఫేషియల్ రికగ్నిషన్ అమలు, ఆధార్ ఆధారిత ఫీజుల చెల్లింపులు సహా విద్యార్థులను పరిశోధనలవైపు ప్రోత్సహిస్తున్నారా? లేదా అనే అంశాలను కూడా పరిగణలోకి తీసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. అలాగే కళాశాలలు నాణ్యమైన విద్యను అందిస్తున్నాయా?, ఆ కళాశాలలో విద్యార్థులకు ప్లేస్‌మెంట్ ఎలా ఉన్నాయి?, అనే అంశాలపైనా కూడా దృష్టిసారించనుంది. జాతీయ, అంతర్జాతీయ ర్యాంకింగ్‌లను, ప్రభుత్వ నిబంధనలను ఏమేరకు అమలు చేస్తున్నారనే అన్ని అంశాలను పరిశీలించిన తర్వాతే కళాశాలల్లో ఫీజులను నిర్ధారించనున్నట్టు ఉత్తర్వుల్లో ఉన్నత విద్యాశాఖ స్పష్టం చేసింది. ఫీజులు పెంచాలని కొన్ని కళాశాలలు హైకోర్టును ఆశ్రయించగా, కళాశాలల ఫీజుల నిర్ధారణ కోసం సమర్పించిన ప్రతిపాదనలపై ఆరు వారాల్లో నిర్ణయం తీసుకుని ప్రభుత్వానికి సిఫార్సు చేయాలని టిఎఎఫ్ఆర్‌సికి హైకోర్టు ఆదేశాలు జారీచేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ వి.బాలకిష్టారెడ్డి, మెంబర్ సెక్రటరీగా ప్రొఫెసర్ శ్రీరాం వెంకటేశ్‌తో పాటు మరో ఆరుగురు సభ్యులతో ఒక కమిటీని ఏర్పాటు చేసింది. కమిటీ ఇతర రాష్ట్రాల్లో ఫీజులను, అక్కడి విధానాలను పరిశీలించి ప్రభుత్వానికి సిఫారసులు చేసింది. దీని ఆధారంగా ఫీజు నిబంధనల సవరణకు ప్రభుత్వం ఆమోదించింది.

# ఇద్దరు నక్సల్స్ లొంగుబాటు

### పోలీసుల ముందు లొంగిపోయిన రాష్ట్ర కమిటీ సభ్యులు



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** సిపిఐ మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ సభ్యుడు సుధాకర్ భార్య, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యురాలు కాకరాల సునీత, తెలంగాణ రాష్ట్ర కమిటీ మరో సభ్యుడు చెన్నూరి హరీశ్ లొంగిపోయినట్లు రాచకొండ పోలీసులు స్పష్టం చేశారు. 40 ఏళ్ల విప్లవ ఉద్యమ అనుభవం కలిగిన కాకర్ల సునీత అలియాస్ భద్రి, అలియాస్ లక్ష్మి, అలియాస్ గురుస్మృతి.. హరీశ్ అలియాస్ రామన్నతో పాటు గురువారం జనజీవన స్రవంతిలో కలిసినట్లు రాచకండ పోలీసులు కమిషనర్ సుధీర్‌బాబు మీడియా సమావేశంలో వెల్లడించారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల గురించి తెలుసుకున్న వీరు మావోయిజం మార్గాన్ని వీడి తమ కుటుంబ సభ్యులతో ప్రశాంతమైన జీవితాన్ని గడపాలని నిర్ణయించుకుని పోలీసుల ముందు లొంగిపోయినట్లు సుధీర్‌బాబు తెలిపారు. హైదరాబాద్‌లోని వనస్థలిపురంకు చెందిన కాకరాల సునీత(62) 1985లో రాజమండ్రిలో ఇంటర్మీడియట్ చదువుతున్న రోజుల్లో క్యాంపస్‌లో రాడికల్ స్టూడెంట్స్ యూనియన్ పట్ల ఆకర్షితురాలైంది. ఆమె తండ్రి కాకరాల సత్యనారాయణ విప్లవ రచయితల సంఘం ముఖ్య నాయకుడు అని పోలీసులు పేర్కొన్నారు. వరవరరావు, గద్దర్ వంటి విప్లవకారులు తరచూ వారి ఇంటికి వచ్చేవారని వారి ప్రభావం కూడా పార్టీ పట్ల ఆకర్షణ కలిగించిందని తెలిపారు. 1986 జనవరిలో సిపిఐ(ఎంఎల్) వార్ వైపు పూర్తిగా ఆకర్షితురాలై అజ్ఞాతంలోకి వెళ్లిపోయిందని తెలిపారు. 2014లో ఆమె కుతుల్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొందని, ఈ ఏడాది జూన్‌లో తన భర్త టిఎల్ఎన్ చలంతో కలిసి అన్నపురం నేషనల్ పార్క్ ఎన్‌కౌంటర్‌లో పాల్గొందని తెలిపారు. ఈ ఎన్‌కౌంటర్‌లో ఆమె భర్త టిఎల్ఎన్ మరణించినట్లు వివరించారు. 2006 నుంచి ఇప్పటి వరకు రీజినల్ పొలిటికల్ స్కూల్, ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్ కమిటీ సభ్యురాలిగా పనిచేసి అనేక మందిని మావో భావజాలం వైపు నడిపించగలిగిందని తెలిపారు.

భూపాలపల్లి జిల్లా రేగొండ మండలం రంగయ్యపల్లికి చెందిన చెన్నూరి హరీశ్ 2006లో ఏటూరునాగారంలో బిసి వెల్ఫేర్ హాస్టల్‌లో 10వ తరగతి చదువుతున్న సమయంలో మావోయిస్టు పార్టీ సాంస్కృతిక కార్యక్రమాలకు హాజరై ఆ భావజాలంవైపు ఆకర్షితులయ్యారని తెలిపారు. ఆ తర్వాత వివిధ మావోయిస్టు పార్టీలో వివిధ బృందాలతో కలిసి పనిచేసిన ఆయన.. 2022 డిసెంబర్‌లో జరిగిన నేషన్ పార్క్ ప్రాంతం టెకమెట్టా వద్ద జరిగిన ఎన్‌కౌంటర్‌లో హరీశ్ పాల్గొన్నారు. 2024లో ఆయన ఏరియా కమిటీ సభ్యుడిగా పదోన్నతి లభించినట్లు పోలీసులు తెలిపారు. తెలంగాణకు చెందిన అండర్ గ్రౌండ్ మావోయిస్టులందరూ అజ్ఞాతం వీడి జనంలోకి రావాలని ఈ సందర్భంగా పోలీసులు పిలుపునిచ్చారు. లొంగిపోయిన మావోయిస్టులకు తెలంగాణ ప్రభుత్వం ప్రకటించిన పునరావాస ప్రయోజనాలు అందించబడతాయని తెలిపారు.

**శ్రీ సీతారామచంద్ర స్వామి వారి దేవస్థానం, భద్రాచలం**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, తెలంగాణా రాష్ట్రం. ఫోన్ నం.08743-232428

ఆర్.సి.నం.డి1/358/2024 — ఈ-ప్రొక్యూర్‌మెంట్ షార్ట్ టెండర్ ప్రకటన-2వ పిలుపు — తేది: 18.08.2025

ఈ దేవస్థానము నందు ది.01.09.2025 నుండి ది.31.08.2026 వరకు ఒక సం॥ర కాలమునకు (1) అవసరమైన పూలు మరియు (2) పూజాద్రవ్యములు సరఫరా చేయుటకుగాను ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా విడివిడిగా టెండర్లు కోరబడుచున్నవి. **ఇ-టెండరు డాక్యుమెంట్స్ డౌన్‌లోడ్ తేది:** 22.08.2025 ఉదయం గం.11.00ల నుండి, **టెండరు దాఖలు చేయు చివరి తేది:** 28.08.2025 ఉదయం గం.11.00ల వరకు, **టెక్నికల్ బిడ్ తెరచు తేది:** 28.08.2025 ఉదయం గం.11.30లకు, **ఫైనాన్షియల్ బిడ్ తెరచు తేది:** 28.08.2025 మధ్యాహ్నం గం.12.00లకు, ఇతర వివరములకు https://tender.telangana.gov.in మార్కెట్ ప్లేస్ నందు చూడవచ్చును. లేదా ఈ కార్యాలయ పనివేళలలో సంప్రదించవచ్చును.

సం/- ఎల్. రమాదేవి
కార్యనిర్వహణాధికారి

DIPR R.O. No. : 6812-PP/CL/ADVT/1/2025-26, Date: 21-08-2025

**గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, గాజులరామారం సర్కిల్-26** GHMC

**NIT No & Date: 12/DB/EE/GJRM/CIRCLE-26/GHMC/2025-26 తేది: 21.08.2025**

**పని పేరు:** బిటి ప్యాచెస్ వేయడం, **అంచనా విలువ:** రూ.10.00 లక్షలు, **ప్రారంభ తేది & సమయం:** 22.08.2025న మ.02.00గం.ల నుండి, **బిడ్ స్వీకరణకు చివరి తేదీ & సమయం:** 25.08.2025 మ.02.30గం.ల వరకు, **ఇఇ పేరు & చిరునామా:** ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్-26, జిహెచ్ఎంసి. సెల్: 9849906776. మరిన్ని వివరాలను ఇ-ప్రొక్యూర్‌మెంట్ అనగా www.tender.telangana.gov.in లో చూడవచ్చు.

**సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, గాజులరామారం సర్కిల్, జిహెచ్ఎంసి.**

DIPR R.O. No. : 6830-PP/CL/ADVT/1/2025-26, Date: 21-08-2025

## శాంతిభద్రతలకు భంగం కలుగొద్దు

**ప్రజాపక్షం/చండూరు :** గణేష్ ఉత్సవాలు సమీపిస్తుండడంతో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఉండేందుకు సంబంధిత అధికారులు ముందస్తుగా తగు జాగ్రతలు తీసుకోవాలని చండూరు ఆర్‌డిఓ శ్రీదేవి అన్నారు. గురువారం చండూరులోని ఎంపిడిఓ కార్యాలయంలోని సమావేశ మందిరంలో చండూరు రెవిన్యూ విడివిజన్ పరిధిలోని వివిధ శాఖల అధికారులతో ఏర్పాటు చేసిన పీస్ కమిటీ మీటింగ్‌లో ఆమే మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపానికి ముందస్తుగా అన్ని అనుమతులు తీసుకోవాలని అన్నారు. మండపానికి ఉపయోగించే విద్యుత్ సరఫరా విషయంలో విధ్యుత్ అధికారుల అనుమతి తప్పని సరిగా ఉండేవిధంగా చూసుకోవాలని అన్నారు. వినాయక చవితి నుంచి నిమజ్జనం వరకు పోలీస్ శాఖ శాంతి భద్రతల విషయంలో అప్రమత్తంగా ఉండాలన్నారు.




## సద్దలచెర్వును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు

**ప్రజాపక్షం/సూర్యాపేట:** సద్దలచెర్వును పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు ప్రణాళికలు రూపొందించాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ అధికారులను అదేశించారు. గురువారం పట్టణంలోని సద్దల చెర్వును సందర్శించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ చెరువు పక్కన ఖాళీ ప్రదేశంలో పిచ్చిమొక్కలను తొలగించి అందమైన పూలమొక్కలు నాటి ఆహ్లాదకర వాతావరణం సృష్టించాలని అదేశించారు. మున్సిపాలిటి మాస్టర్ ప్లాన్ ప్రకారం సద్దల చెరువు పరిధి ఎక్కడ వరకు ఉందో మున్సిపల్ కమిషనర్‌ను, సద్దల చెరువు ఎఫ్టిఎల్ పరిధి ఎక్కడ ఉన్నదో ఇరిగేషన్ అధికారులను, ఖాళీ ప్రదేశంలో పర్యాటక శాఖ పరంగా ఏ విధంగా అభివృద్ధి చేయవచ్చో పర్యాటకశాఖ ఎఈని నివేదిక సమర్పించాలని అదేశించారు.





## రైతన్నను వేధిస్తున్న యూరియా కొరత

### మాజీ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి

**ప్రజాపక్షం/నల్లగొండ :** రైతులను నెల రోజులుగా యూరియా కొరత తీవ్రంగా వేదిస్తుందని ఇది ఇంకా తీవ్రమయ్యే ప్రమాదం ఉందని మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. గురువారం పట్టణంలోని బిఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రైతులు యూరియా కోసం నిద్రాహారాలు మాని లైన్‌లో చెప్పులు పెడుతూ అవస్థలు పడుతున్నారని ఎకరానికి 20 వేల పెట్టుబడి పెడితే ఒక్క బస్తా యూరియా మీద దిగుబడి ఆధార పడి ఉందన్నారు.కానీ ఈ ప్రభుత్వానికి చీమ కుట్టినట్లుగా కూడా లేదని కెసిఆర్ ప్రభుత్వంలో వేసవిలోనే గోదాముల్లో ఎరువులు నిల్వ చేసి పెట్టేవారని వ్యవసాయ రంగం పై రెగ్యులర్ రివ్యూ చేస్తూ రైతుల ఇబ్బందులు పడకుండ జాగ్రత్త పడేవాళ్ళంమని తెలిపారు. కనీసం సీజన్ లో నాలుగు సార్లు రివ్యూ జరిగేదనిరైతులు విత్తనాల కోసం, ఎరువుల కోసం ఇబ్బందులు పడడం దారుణం అన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యేలు కంచర్ల భూపాల్ రెడ్డి, గాదరి కిషోర్,రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్ కటింక సత్తయ్య గౌడ్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీరా పంకజ్ యాదవ్, మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి నిరంజన్ వలి,మాజీ ఆర్వో మాలే శరణ్య రెడ్డి,అభిమన్యు శ్రీనివాస్,రావుల శ్రీనివాసరెడ్డి,పట్టణ అధ్యక్షుడు భువనగిరి దేవేందర్ పాల్గొన్నారు.

## చిన్న పిల్లలకు సత్వర చికిత్స అందించాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** సీజనల్ వ్యాధులబారిన పడిన చిన్న పిల్లలకు సత్వర చికిత్స అందించాలని జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి వైద్యులను ఆదేశించారు. అంతేకాక ఆయా వ్యాధులకు సంబంధించి వ్యాధి నివారణ మందులు ముందే సిద్ధంగా ఉంచుకోవాలన్నారు.చిన్న పిల్లలు సీజనల్ వ్యాధుల బారిన పడకుండా తల్లిదండ్రులలో అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని అన్నారు.గురువారం ఆమె ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని సందర్శించి చిన్న పిల్లల వార్డును ఆకస్మికంగా తనిఖీ చేశారు.చికిత్స పొందుతున్న చిన్న పిల్లలను పరిశీలించిన అనంతరం వారి వివరాలను ఆసుపత్రి సూపరింటిండెంట్ అరుణ కుమారి,చిన్న పిల్లల విభాగం అధిపతి డాక్టర్ వందన లను అడిగి తెలుసుకున్నారు.సీజనల్ వ్యాధులతో ముఖ్యంగా జ్వరం తో ఆసుపత్రిలో చేరిన పిల్లలకు సంబంధించి మలేరియా,టైఫాయిడ్ ,డెంగ్యూ కేసుల వివరాలను అడిగారు. సీజనల్ వ్యాధులతో వచ్చిన చిన్న పిల్లలకు తక్షణ చికిత్స అందించాలని,ఇందుకు అవసరమైన మందులు ఎప్పుడు అందుబాటులో ఉంచుకోవాలని చెప్పారు.ముందు జాగ్రత్తగా ఆసుపత్రిలో ఉన్న మందులు,ఇతర సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు.డాక్టర్ నగేష్, డాక్టర్ చంద్రశేఖర్,డాక్టర్ స్వరూపా రాణి, తదితరులు ఉన్నారు.

## సోదరభావంతో గణేష్ చతుర్థి ఉత్సవాలు



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** మిర్యాలగూడ నియోజకవర్గంలో గణేష్ చతుర్థి ఉత్సవాలను, నిమజ్జన కార్యక్రమాలను కులమతాలకు అతీతంగా ప్రతి ఒక్కరు సోదరభావంతో నిర్వహించుకోవాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో సబ్ కలెక్టర్ నారాయణ్అమిత్‌తో కలిసి ఆయన పాల్గొని మాట్లాడారు. ఉత్సవ కమిటీ నిర్వాహకులు వందల సంఖ్యలో విగ్రహాలు నెలకొల్పనున్నందున మండపాల వద్ద అధికారులు సలహాలు సూచనలు పాటిస్తూ జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ, పోలీసు, విద్యుత్, మున్సిపల్, ఆర్అండ్‌బీ, నీటిపారుదల, పంచాయతీరాజ్ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. డివిజన్‌లో ఐదు ప్రాంతాలైనా వాడపల్లి కృష్ణానది, వేములపల్లిలో సాగర్ ఎడమకాల్వ, అనుముల మండలంలోని ఎడమకాల్వ 14వ మైలు వద్ద, సాగర్ డ్యాం దిగువన నిమజ్జన కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరు శాంతియుత వాతావరణంలో ఉత్సవాలు నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యుత్ డీఈ శ్రీనివాసచారి, డీఎస్పీ రాజశేఖర్‌రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో కేస రవి, నాయకులు రేపాల పురుషోత్తం రెడ్డి, రమేష్, మౌలానా మగ్దూం, మౌలానా జావెద్, హాఫీజుద్దీన్, ఖుర్బాన్ అలీ, తహసీల్దార్లు, ఎంపీడీవో, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

## వృద్ధులు, వికలాంగులు కిషోర బాలికలతో కొత్త సంఘాల ఏర్పాటు

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** రాష్ట్ర ప్రభుత్వం సెర్ప్ ద్వారా ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం క్రింద కోటి మంది మహిళలను కోటీశ్వర్లను చేసే కార్యక్రమం లో భాగంగా సంఘాలల్లో లేని మహిళలను కొత్త సంఘాలుగా ఏర్పాటు చేయడం జరుగుతుందని జిల్లా గ్రామీణభివృద్ధి అధికారి వై. శేఖర్ రెడ్డి తెలిపారు.ఇప్పటికే ఉన్న సంఘాలలో సభ్యులను చేర్పించడం కార్యక్రమము కొనసాగుతున్నప్పటికి ఈ నెలలో ఒక ప్రత్యేక కార్యక్రమం చేపట్టడము జరిగింది. ఈ ప్రత్యేక కార్యక్రమంలో మొదటిది వృద్ధ మహిళలను వృద్ధి సంఘాలుగా ఏర్పాటు చేయడం అంటే 60 సంవత్సరముల పై బడిన వృద్ధ మహిళలను 10 నుండి 15 మంది సభ్యుల వరకు ఒక సంఘముగా ఏర్పాటు చేయడము, వీరికి బ్యాంకు ఖాతా తెరవడం చేయడం వీరికి పొదుపులు సమావేశం అలవాటు చేయడం, చేస్తూ వీరికి సంబందించిన ఆరోగ్యం మానసిక సమస్యలు, ఆర్థిక అవసరాలు, సామజిక అవసరాలు ,బ్యాంకు రుణాలు సిఐఎఫ్ రుణాలు మ్యాచింగ్ గ్రాంట్లు లాంటి ప్రభుత్వం సహాయాలు కల్పించే అవకాశం ఉంటుంది అన్నారు. 13 సంవత్సముల నుండి 15 సంవత్సరముల వరకు15 సంవత్సరముల నుండి 18 సంవత్సరముల వరకు వయసు కలిగిన బాలికలతో కిషోర బాలికల సంఘాలు ఏర్పాటు చేయాలని వారి వారి వయసుకు తగినట్లుగా వారికి వచ్చే సమస్యలు బాలికలు మోసపోకుండా ఉండేందుకు ధైర్యం, వారికి చట్టాలపై అవగాహన ఆరోగ్యం పై అవగాహన, మోసపోయినప్పుడు ఎదురుకునే ధైర్యం, ఆలోచన ఎవరి వలన ఎలాంటి సమస్యలకు పరిష్కారం దొరుకుతుందో తెలియజేసే కార్యక్రమాల పై అవగాహన కల్పించ బడుతుందని తెలిపారు.

# పేదోడి ఆత్మ గౌరవానికి ప్రతీక రేషన్ కార్డులు

### ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య



**ప్రజాపక్షం/మోటకొండూర్ :** పేదోల్ల ఆత్మ గౌరవానికి ప్రతీక రేషన్ కార్డులు అని, గత ప్రభుత్వం ఏ ఒక్కరికి ఒక్క రేషన్ కార్డు కాని, రేషన్ కార్డులో పేర్లు ఆడ్ చేయడం కాని జరుగలేదని కాంగ్రెస్ ప్రభుత్వం రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రజలకు పేదోల్లకు ఆరు గ్యారంటీలతో పాటు, ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు అర్హులందరికి అందిస్తున్నట్లు ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య అన్నారు. ఆయన గురువారం మోటకొండూర్ మండల కేంద్రంలోని మహలక్ష్మి పంక్షన్ హాల్‌లో రేషన్ కార్డుల పంపిణి కార్యక్రమంలో పాల్గోని రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో కార్యకర్తలకే సంక్షేమ ఫలాలు అందాయని, కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో కుల మతాలకు, పార్టీలకు అతీతంగా అర్హూలందరికీ సంక్షేమ ఫలాలు అందిస్తున్నామని అన్నారు. మోట కొండూరు మండలంలో కొత్త రేషన్ కార్డులు 928 మంజూరు చేసినట్లు, 3628 కొత్త యూనిట్లు ఆడ్ చేయడం జరిగినట్లు తెలిపారు. బిఆర్‌ఎస్ నాయకులు మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ లాంటి పథకాలతో మిగులు రాష్ట్రాన్ని దోచుకుని తిన్నారని అన్నారు. ఆలేరు నియోజకవర్గంలో మొదటి విడతలో 3700 ఇండ్లు మంజూరు చేసినట్లు, రెండవ విడుతలో 3500 ఇండ్లు మంజూరౌవుతున్నట్లు, పేదవారి కలలు సహకారం చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని అన్నారు. గత యాసింగి సీజన్లో ఆలేరు నియోజకవర్గంలోని 135 చెరువు లలో నీళ్లు నింపినట్లు, ప్రస్తుతం వర్షాలు ఆలస్యంగా వచ్చినప్పటికీ అన్ని వాగులు పారి చెరువుల కుంటలు నిండినట్లు, రాబోయే ఫిబ్రవరిలో మరొకసారి గోదావరి జలాలతో చెరువులు, కుంటలు నింపేందుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ వీరారెడ్డి, ఆర్‌డిఓ క్రిష్ణా రెడ్డి, సిఐ శంకర్ గౌడ్,స్పెషల్ ఆఫీసర్ నరసింహా రావు, ఎంపిడిఓ ఇందిర, తహసిల్దార్ నాగ దివ్య, ఆర్ఐలు రామారావు, ఆసీప్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గంగాపురం మల్లేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరుని రఘునాథరాజు తదితరులు పాల్గొన్నారు.

**అర్హులందరికీ రేషన్ కార్డులు అందిస్తాం**

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం):** అర్హులైన వారందరికీ రేషన్ కార్డులను అందజేస్తామని, ఇది నిరంతర ప్రక్రియ అని ప్రభుత్వ విప్, ఆలేరు శాసనసభ్యులు బీర్ల ఐలయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ గత పది సంవత్సరాలు రేషన్ కార్డులను గత ప్రభుత్వం పంపిణీ చేయలేదని వారన్నారు. అర్హులైన వారందరికీ ఇందిరమ్మ ఇళ్లను దశలవారీగా మంజూరు చేస్తామన్నారు. అదనపు కలెక్టర్ వీరారెడ్డి, ఆర్డీఓ కృష్ణారెడ్డి, తహసిల్దార్ లావణ్య పాల్గొన్నారు.



## మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాజీ ప్రసక్తే లేదు

### గట్టుప్పలలో సరస్వతీ శిశు మందిర్ భవన ప్రారంభోత్సవంలో ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డి

**ప్రజాపక్షం/చండూరు /గట్టుప్పల :** మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని సమాజంలో ఉన్న ప్రతి ఒక్కరికి సమాజ సేవ చేయాలనే ఆలోచన ఉండాలని మునుగోడు ఎంఎల్‌ఎ కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అన్నారు. గురువారం గట్టుప్పల మండల కేంద్రంలో ఇడెం శ్రీనివాస్ సొంత ఖర్చులతో కార్పొరేట్ స్థాయిలో నూతనంగా నిర్మించిన సరస్వతీ శిశుమందిర్ భవనాన్ని ఎంఎల్‌ఎ రాజగోపాల్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో రాజగోపాల్‌రెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి సమాజ సేవ చేయాలనే తపన ఉండాలని కుటుంబం కోసమే కాకుండా సమాజం కోసం కూడా ఆలోచన చేసినప్పుడే సమాజంలో పేదరికం అనేది ఉండదన్నారు. బడి అంటే గుడి లాంటిదని గ్రామాలలో ఒక్కొక్క కులానికి ఒక గుడి ఉంటుంది కానీ ఊరందరి గుడి బడి మాత్రమేనని అన్నారు. నియోజకవర్గంలో మొదటి విడుతగా ప్రతి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలను కార్పొరేట్ స్థాయిలో అభివృద్ధి చేస్తానని అన్నారు. మునుగోడు నియోజకవర్గం అభివృద్ధి విషయంలో రాజగోపాల్‌రెడ్డి రాజీ పడే ప్రసక్తే లేదని స్పష్టం చేశారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో ముందుకు తీసుకెళ్తూ ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ కుభం శ్రీనివాస్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నామని జగన్నాథం , మాజీ జడ్‌పిటిసి గోపాల్, దండు యాదగిరిరెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

# ఐఐహెచ్‌టి పోచంపల్లిలోనే ఏర్పాటుకు ప్రణాళికలు

### రాష్ట్రంలోనే మొట్టమొదటి నేచురల్ డై యూనిట్ ఏర్పాటు

### చేనేత జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వెల్లడి




**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** ఐఐహెచ్‌టి పోచంపల్లిలోనే ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి సిఎం రేవంత్ రెడ్డి ఆదేశాలు ఇచ్చినట్లు చేనేత జౌళి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ వెల్లడించారు. పోచంపల్లి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ చైర్మన్ తడక రమేష్ సీఈవో కం చైర్మన్‌గా స్థాపించిన పోచంపల్లి ప్రొడక్షన్ హ్యాండ్లూమ్స్ అండ్ హ్యాండీక్రాఫట్స్ ప్రొడ్యూసర్ కంపెనీ లిమిటెడ్ షోరూమ్‌ను గురువారం ఆమె ప్రారంభించారు. షోరూంను ప్రారంభించిన ఆమె జ్యోతి ప్రజ్వలన చేసి వస్త్రాలను పరిశీలించి కొనుగోలు చేశారు. ఈ సందర్భంగా ఆమె ప్రత్యేకంగా ప్రజాపక్షం అడిగిన ప్రశ్నకు సమాధానంగా తాత్కాలికంగా హైదరాబాద్‌లో ఐఐహెచ్‌టి ఏర్పాటు చేసి కోర్సులు నడుపుతున్నామని రెండు మూడు సంవత్సరాల్లో పోచంపల్లికి షిఫ్ట్ చేసి ఐఐహెచ్‌టి స్థాపించి ఉపాధి శిక్షణ కోర్సులు అందించి చేనేత పరిశ్రమ పునర్నిర్మాణంలో ప్రపంచవ్యాప్తంగా వస్త్ర ప్రపంచాన్ని విస్తరించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని తెలిపారు. రీజనల్ డిప్యూటీ డైరెక్టర్ వీవర్ సర్వీస్ సెంటర్ అధికారి అరుణ్ కుమార్ ప్రోత్సాహంతో ఈ కంపెనీని స్థాపించడం చాలా సంతోషంగా ఉందని దీని ద్వారా చేనేత కార్మికులకు జీవనోపాధి కల్పించడమే కాకుండా ప్రొడక్షన్ పెంచడం ఉపాధి అవకాశాలు కల్పించడం మార్కెటింగ్‌కు మరింత మెరుగైన ఫలితాలు సాధించడానికి కేంద్ర ప్రభుత్వం ద్వారా మంజూరైన ఈ కంపెనీని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పోచంపల్లిలో పైలెట్ ప్రాజెక్టు కింద స్థాపించడం జరిగిందని పేర్కొన్నారు. దీనికోసం రూ.20 లక్షల రుణం మంజూరు చేసిందని తెలిపారు. ప్రొడ్యూసర్స్ కంపెనీ కోసం కేంద్ర ప్రభుత్వం అనేక పథకాలు అందించి ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ చౌటుప్పల్ ఆర్డీవో శేఖర్ రెడ్డి, హ్యాండ్లూమ్ ఏడి శ్రీనివాస్, ఎమ్మార్వో శ్రీనివాస రెడ్డి, మండల రెవెన్యూ ఇన్స్పెక్టర్ గుత్తా వెంకట్ రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తడక వెంకటేశ్వర్లు, టై అండ్ డై అసోసియేషన్ అధ్యక్షులు భారత లవ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## యూరియా కోసం ఉరుకులు...



**ప్రజాపక్షం/ హాలియా:** రైతుల అవసరాలకు అనుగుణంగా యూరియా దొరకడం లేదనే వదంతులు ఎక్కువై... అవసరం లేకున్నా కొందరు బడా రైతులు పెద్ద మొత్తంలో యూరియా నిల్వలు చేసుకుని కృత్రిమ కొరత కు కారణం అవుతున్నారు. గ్రామాలలో కొందరు వ్యాపారులు లైసెన్స్ లేకున్నా యూరియా నిల్వలు పెద్ద ఎత్తున చేసుకొని బహిరంగ మార్కెట్లో యూరియా కొరత తీవ్రంగా ఉందని ప్రచారం చేస్తూ రైతులు అవసరాలను ఆసరా చేసుకొని అధిక ధరలకు విక్రయిస్తున్నారు. అనుముల మండలానికి ప్రస్తుత వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం నాలుగు వేల మెట్రిక్ టన్నుల యూరియా అవసరముందని తేల్చారు. ఇందులో రెండు దఫాలుగా మొత్తం 1320 మెట్రిక్ టన్నుల యూరియాను సరఫరా చేశారు. గురువారం కొత్తపల్లి సహకార సంఘానికి 20 మెట్రిక్ టన్నుల యూరియా వస్తుందని తెలుసుకున్న రైతులు ఉదయం నుంచే పెద్ద మొత్తంలో బారులు తీరారు. దీంతో రైతుల మధ్య వాగ్వివాదాలు చోటు చేసుకోవడంతో హాలియా ఎస్సై సాయి ప్రశాంత్, సీఐ సతీష్ రెడ్డిలు సహకార సంఘం వద్ద ఎటువంటి ఘర్షణలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేయడంతో యూరియా సరఫరా సక్రమంగా జరిగింది.

# ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్ పెంచాలి

### నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నల్లగొండ నియోజకవర్గంలో ఇందిరమ్మ ఇండ్ల గ్రౌండింగ్‌ను పెంచాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. గురువారం ఆమె నల్లగొండ మున్సిపల్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో నల్గొండ నియోజకవర్గ పరిధిలోని ఇందిరమ్మ ఇండ్ల పురోగతిపై గృహనిర్మాణ శాఖ అధికారులు, తహసిల్దార్లతో సమీక్ష నిర్వహించారు. ఆయా మండలాల వారిగా సమీక్ష సందర్భంగా నల్లగొండ అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 గృహాలు కేటాయించగా, మొదటి ,రెండో విడతలో 3337 గృహాలు మంజూరు చేయడం జరిగిందని ,అందులో 1129 గ్రౌండ్ కాగా, బేస్మెంట్ స్థాయిలో 1037 రూఫ్ లెవెల్ స్థాయిలో 67 ,పూర్తి దశలో 25 ఉన్నాయని గృహ నిర్మాణ శాఖ పీడీ రాజ్ కుమార్ తెలిపారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నల్గొండ నియోజకవర్గంలోని మండలాల ప్రత్యేక అధికారులు, గృహ నిర్మాణ ఇంజనీర్లు, ఎంపీడీవోలు ప్రత్యేక శ్రద్ధ వహించి గ్రౌండింగ్ ను పెంచాలని చెప్పారు. గృహాలు నిర్మించుకోనెందుకు సుముఖత లేని లబ్ధిదారుల నుండి సమ్మతి తీసుకోవాలని చెప్పారు. పూర్తయిన గృహాలను రాష్ట్ర రోడ్లు, భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి ద్వారా ప్రారంభోత్సవం చేసేందుకు చర్యలు తీసుకోవాలని, మున్సిపాలిటీ తో పాటు ,కనగల్ , తిప్పర్తి మండలాలలో ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలకు ప్రణాళిక రూపొందించాలని ఆదేశించారు. ఇందిరమ్మ గృహాలకు సంబంధించి ఇసుక ,మేషన్ల సమస్యలను తహసిల్దార్లు ప్రత్యేక శ్రద్ధ వహించి పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మంజూరైన మొత్తం గృహాలు గ్రౌండ్ అయ్యేలా చూడాల్సిన బాధ్యత ఎంపీడీవోలపై ఉందని, ఈ విషయంలో నిర్లక్ష్యం వహిస్తే తగు చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, గృహ నిర్మాణ శాఖ పీడి రాజకుమార్ ,ఆర్డిఓ వై .అశోక్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ సయ్యద్ ముసాబ్ అహ్మద్ ఈ సమావేశానికి హాజరయ్యారు.

## కాంగ్రెస్ పార్టీలోకి చేరికలు



**ప్రజాపక్షం/సూర్యాపేటటౌన్:** కాంగ్రెస్ ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి పనులకు చూసి ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో భారీగా చేరుతున్నారని ఏఐసిసి సభ్యులు రాంరెడ్డి సర్వోత్తమరెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి లు అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని 13వ వార్డు కాంగ్రెస్‌పార్టీ ఇన్‌ఛార్జి కస్పరాజు రమేష్ సమక్షంలో 13వ వార్డు భాషానాయక్‌తండాకు చెందిన బిఎస్‌పి, బిఆర్‌ఎస్‌పార్టీల నుండి కాంగ్రెస్ పార్టీలోకి గండమల్ల వసంత, పోలేపాక సతీష్, సాయిరాజు, హుస్సేన్ లకు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు అంజద్‌అలీ, యువజన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్, ధారావత్ వీరన్ననాయక్, చింతమళ్ల రమేష్, తంగెళ్ల కరుణాకర్‌రెడ్డి, సాయినేత, పందిరి మల్లేష్, చింత వెంకన్న పాల్గొన్నారు.

## విద్యావ్యవస్థకు ప్రభుత్వం పెద్దపీట

### విద్యార్థులు మంచిగా చదువుకుని ఉన్నత స్థాయికి ఎదగాలి: కలెక్టర్



**ప్రజాపక్షం/యాదాద్రి :** ప్రభుత్వం విద్యా వ్యవస్థకి పెద్దపీట వేసిందని, విద్యార్థులు మంచిగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదగాలని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. గురువారం భువనగిరి మండలం బొల్లేపల్లి గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్‌ను కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. అటెండెన్స్ రిజిస్టర్ పరిశీలించి, స్కూల్‌లో ఎంత మంది ఉపాధ్యాయులు ఉన్నారని, అందరూ విధులకు హాజరయ్యారా అని అటెండెన్స్ రిజిస్టర్‌ను పరిశీలించారు. పదవ తరగతిలో ఎంత మంది విద్యార్థులు చదువుతున్నారని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సంవత్సరం కూడా 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా టీచర్లు కృషి చేయాలని, ఇప్పటి నుండే వాళ్ళకీ అర్థమయ్యేలా బోధన చేయాలన్నారు. ఉపాధ్యాయులు సబ్జెక్టులలో వెనకబడి ఉన్న విద్యార్థులకు స్పెషల్ క్లాస్ నిర్వహించాలన్నారు.

**పోష్ చట్టం పుస్తకం, వాతావరణ మార్పులపై అవగాహన కరపత్రాలు ఆవిష్కరణ**

పని ప్రదేశంలో మహిళలందరికి సురక్షితమైన వాతావరణాన్ని కల్పించవలసిన బాధ్యత యజమాని, యాజమాన్యాలదేనని జిల్లా కలెక్టర్ హనుమంతరావు అన్నారు. అసంఘటిత రంగంలో పనిచేస్తున్న మహిళా కార్మికులు , ప్రభుత్వ మహిళా ఉద్యోగులకు ఈ చట్టం పట్ల అవగాహన కార్యక్రమాలు చేపడుతున్న ఆక్షన్‌ఎయిడ్ కర్ణాటక ప్రాజెక్టు సంస్థను ఈ సందర్భంగా అభినందించారు. జిల్లాలో అన్ని సంస్థల్లో అంతర్గత కమిటీలు ఏర్పాటు తప్పనిసరిగా చేయాలని సూచించారు. ఆక్షన్‌ఎయిడ్ కమ్యూనిటీ ట్రైనర్ సురుపంగ శివలింగం విజ్ఞప్తి మేరకు పోష్ చట్టం పుస్తకాలు మరియు వాతావరణ మార్పులపై అవగాహన కల్పించేందుకు ముద్రించిన కరపత్రాలు జిల్లా కలెక్టర్ హనుమంతరావు, డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆకాంక్ష్ యాదవ్, స్థానిక సంస్థల కలెక్టర్ భాస్కరరావు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా గణేష్ నవరాత్రి ఉత్సవాలు




### సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్

**ప్రజాపక్షం/సూర్యాపేటకలెక్టరేట్:** గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని జిల్లా కలెక్టర్ తేజస్‌నందలాల్ పవార్ కోరారు. గురువారం కలెక్టరేట్ కార్యాలయంలో సమావేశ మందిరంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహాతో కలిసి కలెక్టర్ శాంతిసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గణేష్ నవరాత్రులలో ఎలాంటి సంఘటనలు జరగకుండా ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, మండపాలలో షార్ట్‌సర్క్యూట్ జరగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, పంచాయతీ అధికారులకు, మున్సిపల్ అధికారులు పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు నిర్వహించాలని, మండపాల వద్దకు రోడ్లు ఏర్పాటు ఏయాలని, చిన్న పిల్లలకి, వృద్దులకి నిమజ్జనం వద్ద ఎలాంటి ఇబ్బంది కలగకుండా తగు చర్యలు తీసుకోవాలని, నిమజ్జనం అయిపోగానే వాహనాలు వెళ్లిపోయేలా ప్రణాళికల సిద్ధం చేయాలని, మున్సిపాలిటిలలో శోభయాత్ర నిర్వహించేటప్పుడు చెట్లు అడ్డు తగలకుండా కొమ్మలు తొలగించాలని, రోడ్లపై గుంటలు పూడ్చాలని, స్పీడ్ బ్రేకర్ల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేయాలని, భక్తులకు తాగునీరు, వసతి కల్పించాలని, నిమజ్జనం చేసే ప్రదేశంలో వాహనాలు ప్రవేశించేందుకు బయటకు వెళ్లేందుకు వేర్వేరు రోడ్లు ఏర్పాటు చేయాలని అదేశించారు.

**శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలి : జిల్లా ఎస్‌పి కె.నర్సింహా**

ప్రజలను రక్షించేందుకు పోలీస్‌శాఖ ముందుగా ఉంటుందని, శాంతిభద్రతలకు ఎలాంటి ఆటంకం కలగకుండా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని, ప్రతి ఒక్కరు ఆన్‌లైన్‌లో రిజిస్టేషన్ చేసుకుంటే దాన్ని తగినట్లుగా ఏర్పాట్లు చేయడం జరుగుతుందని పోలీస్‌స్టేషన్‌లో మొబైల్ ద్వారా, ఆన్‌లైన్‌లో ప్రతి మండపాన్ని రిజిస్టేషన్ చేసుకోవాలని సూచించారు. అంతకు ముందు భానుపూరి గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు, విశ్వ హిందు పరిషత్ సభ్యులైన కృపాకర్, రుప్మారావు, రాజేశ్వరరావు, నర్సింహారావు, ఫరూక్, పండురంగచారి, విజయ్, కృష్ణ, రవిచంద్ర లు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగాశాంతియుత వాతావరణంలో నిర్వహించేందుకు తమవంతు సహకారం అందిస్తామని నిమజ్జనం చేసే సద్దల చెర్వు వద్ద ఏర్పాటు చేయాలన్నారు. వారి వెంట అదనపు కలెక్టర్ పి.రాంబాబు, ఆర్డీవోలు, డిఎస్‌పిలు, మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులు, గణేష్ ఉత్సవ కమిటి సభ్యులు పాల్గొన్నారు.



# జాతీయం
NATIONAL & GENERAL NEWS

## సరిహద్దు కయ్యానికి దిగిన నేపాల్

**న్యూఢిల్లీ :** భారత్‌–చైనా మధ్య వాణిజ్యాన్ని పునరుద్ధరించాలని రెండు దేశాల విదేశాంగ మంత్రులూ గడిచిన మంగళవారం నిర్ణయం తీసుకున్న తరుణంలో పొరుగుదేశం నేపాల్ కయ్యానికి దిగింది. ఉత్తరాఖండ్‌లోని లిపులేఖ్ పర్వత కనుమ మార్గం ద్వారా భారత్‌–చైనా మధ్య వాణిజ్య రాకపోకల పునరుద్ధరణకు వాంగ్ యీ (చైనా విదేశాంగమంత్రి), ఎస్.జైశంకర్ (భారత విదేశాంగమంత్రి) ఒక అంగీకారానికి వచ్చారు. కానీ లిపులేఖ్ ప్రాంతం తమదేనని, తమ భూభాగంలోంచి ఎలా వ్యాపార కార్యకలాపాలు చేస్తారని నేపాల్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేసింది. నేపాల్ ప్రభుత్వ వాదనను భారత ప్రభుత్వం గురువారం తీవ్రంగా ఖండించింది. నేపాల్ వ్యక్తంచేస్తున్న అభ్యంతరం ఎంతమాత్రం సమర్థనీయం కాదని విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖ అధిప్రతినిధి రణధీర్ జైశ్వాల్ అన్నారు. కల్పాని, లింపియాధుర, లిపులేఖ్ ప్రాంతాలను నేపాల్‌లో అంతర్భాగంగా చూపిస్తూ 2020లో నేపాల్ ప్రభుత్వం ఒక రాజకీయపటాన్ని విడుదల చేసి కయ్యానికి దిగింది. ఆనాడు నేపాల్ వాదనను భారత్ కొట్టిపారేసింది. భారత్‌–చైనా మధ్య లిపులేఖ్ ద్వారా 1954లోనే వాణిజ్యం ప్రారంభమైంది, అనేక దశాబ్దాలపాటు ఈ వాణిజ్య కార్యకలాపాలు ఈమార్గం ద్వారా కొనసాగాయి''అని రణధీర్ చెప్పారు.

# పార్లమెంట్ నిరవధిక వాయిదా



**న్యూఢిల్లీ :** పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు గురువారం నిరవధికంగా వాయిదా పడ్డాయి. నెల రోజుల పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో బిహార్‌లో కొనసాగుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ఓటర్ల జాబితాపై ఉభయ సభలలో దాదాపు ప్రతిరోజూ అంతరాయం ఏర్పడింది. ప్రతిపక్షాలు రోజూ నిరసన తెలియజేయగా, ప్రభుత్వం మాత్రం తమకు కావాల్సిన బిల్లులను ఆమోదింపజేసుకుంటూ ఎజెండాను కొనసాగించింది. తీవ్రమైన నేరారోపణలపై అరెస్టయిన ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించాలని కోరుతూ బిల్లులను బుధవారం హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెట్టారు. ఇది లోక్‌సభలో తీవ్ర గందరగోళానికి దారితీసింది. ప్రతిపక్ష సభ్యులు బిల్లుల కాపీలను చింపి విసిరికొట్టారు. అమిత్ షా బిల్లులను ప్రవేశపెట్టడానికి వెళ్ళినప్పుడు అధికార, ప్రతిపక్ష కూటమి సభ్యులు ముఖాముఖిగా వాగ్వాదానికి దిగారు. అయితే ముసాయిదా చట్టాలను పార్లమెంట్ ఉమ్మడి కమిటీకి నివేదించారు. ప్రశ్నోత్తరాల సమయాన్ని ప్రతిపక్షసభ్యులు నిత్యం అడ్డుకున్నారు. ఎస్ఐఆర్ అంశంపై నినాదాలు చేస్తూ వెల్‌లోకి దూసుకెళ్లారు. ఎస్ఐఆర్‌ను రద్దు చేయాలని ప్లకార్డులు ప్రదర్శించారు. కాగా, గురువారం తన ముగింపు వ్యాఖ్యలలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా సభ్యుల ప్రవర్తన పట్ల విచారం వ్యక్తం చేశారు.

### లోక్‌సభలో 12, రాజ్యసభలో 15 బిల్లులకు ఆమోదం

నెల రోజుల పాటు జరిగిన పార్లమెంటు వర్షాకాల సమావేశాల్లో లోక్‌సభ 12 బిల్లులను, రాజ్యసభ 15 బిల్లులను ఆమోదించింది. నిత్యం సభా కార్యకలాపాలకు అంతరాయం, వాయిదా, వాకౌట్‌లు జరిగాయి. జూలై 21న ఉభయ సభల్లోనూ ఆపరేషన్ సిందూర్‌పై చర్చలను మినహాయిస్తే నిత్యం అతి కొద్ది సమయం మాత్రం సభా కార్యకలాపాలు కొనసాగాయి. ఆపరేషన్ సిందూర్‌పై చర్చకు, బిహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎక్సర్‌సైజ్‌పై చర్చకు విపక్ష సభ్యులు డిమాండ్ చేయడంతో ఉభయ సభల్లోనూ పదేపదే అంతరాయం ఏర్పడింది. వాయిదాల కారణంగా సెషన్ ప్రారంభమైనప్పటి నుండి పెద్దగా చర్చ జరగలేదు. కాగా, లోక్‌సభ ఆమోదించిన బిల్లులను పరిశీలిస్తే... గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్డ్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు, 2025, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, 2025, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ) బిల్లు, 2025, మణిపూర్ కేటాయింపు(నం.2) బిల్లు, 2025, జాతీయ క్రీడాపాలన బిల్లు, 2025, మరియు జాతీయ డోపింగ్ నిరోధక(సవరణ) బిల్లు, 2025 ఉన్నారు. లోక్‌సభ ఆమోదించిన ఇతర బిల్లులు ఆదాయపు పన్ను బిల్లు, 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు, 2025, భారతీయ ఓడరేవుల బిల్లు, 2025, గనులు, ఖనిజాలు (అభివృద్ధి, నియంత్రణ) సవరణ బిల్లు, 2025, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు, 2025, ఆన్‌లైన్ గేమింగ్ ప్రమోషన్ మరియు నియంత్రణ బిల్లు, 2025 ఉన్నాయి. రాజ్యసభ ఆమోదించిన బిల్లులు లేక సభ తిరిగి పంపిన బిల్లుల్లో లాడింగ్ బిల్లు 2025, సముద్రం ద్వారా వస్తువులను రవాణా చేసే బిల్లు2025, తీరప్రాంత షిప్పింగ్ బిల్లు 2025, మణిపూర్ వస్తువులు, సేవల పన్ను (సవరణ)బిల్లు2025, మణిపూర్ కేటాయింపు (నం.2) బిల్లు 2025, మర్చంట్ షిప్పింగ్ బిల్లు, 2025, గోవా రాష్ట్ర అసెంబ్లీ నియోజకవర్గాలలో షెడ్యూల్ తెగల ప్రాతినిధ్య పునర్వ్యవస్థీకరణ బిల్లు 2025 ఉన్నాయి. ఇక రాజ్యసభ ఆమోదించిన ఇతర బిల్లులు జాతీయ క్రీడాపాలన బిల్లు 2025, జాతీయ డోపింగ్ నిరోధక (సవరణ) బిల్లు 2025, ఆదాయపు పన్ను బిల్లు 2025, పన్ను చట్టాలు (సవరణ) బిల్లు 2025, భారతీయ ఓడరేవుల బిల్లు 2025, గనులు, ఖనిజాలు(అభివృద్ధి,నియంత్రణ) సవరణ బిల్లు 2025, ఇండియన్ ఇన్‌స్టిట్యూట్స్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (సవరణ) బిల్లు 2025, ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు ప్రమోషన్, నియంత్రణ 2025. ఈసారి పార్లమెంటులో చాలా గందరగోళం నెలకొంది. రాజ్యసభలో వర్షాకాల సమావేశాల మొదటి రోజున ఎటువంటి అంతరాయం లేకుండా ఆమోదించబడిన దిబిల్స్ ఆఫ్ లాడింగ్‌బిల్లు 2025 మినహా, మిగిలిన బిల్లులు కొంతచర్చ తర్వాత లేదా ప్రతిపక్ష పార్టీలు వాకౌట్ చేసిన తర్వాత మాత్రమే ఆమోదించబడ్డాయని సభా నిర్వాహకులు తెలిపారు.

## జెపిసికి మూడు బిల్లుల ప్రతిపాదనకు రాజ్యసభ ఆమోదం

**న్యూఢిల్లీ :** గురువారం రాజ్యసభలో ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులు 30 రోజుల పాటు తీవ్రమైన నేరారోపణలపై జైల్లో ఉంటే తొలగించడం వంటి మూడు బిల్లులను పార్లమెంటరీ సంయుక్త కమిటీకి నివేదించాలనే తీర్మానం ఆమోదం పొందింది. సభలో గందరగోళం మధ్య హోంమంత్రి అమిత్ షా 'బిల్లులను సంయుక్త కమిటీకి నివేదించాలనే ప్రతిపాదన'ను ప్రతిపాదించారు. భారత రాజ్యాంగ సవరణ, కేంద్రపాలిత ప్రాంతాల ప్రభుత్వ చట్టం, 1963; జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ చట్టం, 2019కి సంబంధించిన మూడు బిల్లులు. బిల్లులను పరిశీలించడానికి సంయుక్త కమిటీలో పని చేయడానికి 10 మంది సభ్యులను నామినేట్ చేయడానికి సంబంధించిన ప్రతిపాదనను రాజ్యసభ గందరగోళం మధ్య ఆమోదించింది. కాగా, అమిత్‌షా బుధవారం లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. లోక్‌సభ నుండి 21 మంది సభ్యులు, రాజ్యసభ నుండి 10 మంది సభ్యులతో కూడిన పార్లమెంటు సంయుక్త కమిటీకి బిల్లులను సూచించాలనే తీర్మానాన్ని దిగువ సభ ఆమోదించింది. నవంబర్ మూడవ వారంలో సమావేశమయ్యే అవకాశం ఉన్న శీతాకాల సమావేశాల్లో ఈ కమిటీ తన నివేదికను సభకు సమర్పించాల్సి ఉంది.

## కేరళ సిపిఐ ఎమ్మెల్యే
# వర్ఘూర్ సోమన్ ఆకస్మిక మృతి



**తిరువనంతపురం :** కేరళ రాష్ట్రం పీర్‌మేడ్ అసెంబ్లీ నియోజకవర్గం సిపిఐ ఎమ్మెల్యే వర్ఘూర్‌సోమన్(72) గురువారం ఆకస్మికంగా మృతి చెందారు. రాష్ట్ర రాజధాని తిరువనంతపురంలో జరిగిన ఒక ప్రభుత్వ కార్యక్రమానికి హాజరైనప్పుడు ఆయన హఠాత్తుగా కుప్పకూలిపోయారు. ఎమ్మెల్యే సోమన్‌ను హుటాహుటిన సమీపంలోని ప్రభుత్వఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకపోయింది. ఆయన అప్పటికే మరణించినట్లు వైద్యులు తెలిపారు. తొలిసారి శాసనసభ్యుడైన వర్ఘూర్ సోమన్ 2021 శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి సిరియక్ థామస్‌ను ఓడించారు. ఎఐటియుసి కేరళ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా, జాతీయ కౌన్సిల్ సభ్యులుగా పనిచేశారు. పూర్వ సిపిఐ రాష్ట్రకార్యదర్శి కానం రాజేంద్రన్‌కు సోమన్ అత్యంత సన్నిహితుడిగా పేరొందారు. కార్మికసంఘ నాయకుడిగా సోమన్ కేరళ రాష్ట్ర రాజకీయాలలో చురుకైన పాత్ర పోషించారు. కొట్టాయంలోని వర్ఘూర్‌లో 1952 సెప్టెంబర్ 14న కుంజుపప్పన్, పార్వతి దంపతులకు జన్మించిన వర్ఘూర్ సోమన్ ఆల్ ఇండియా స్టూడెంట్ ఫెడరేషన్ (ఎఐఎస్ఎఫ్) ద్వారా రాజకీయాలలోకి ప్రవేశించారు. పీర్‌మేడ్ అసెంబ్లీ నియోజకవర్గం ఇడుక్కి జిల్లాలో ఉంది. ఆయన 2005నుండి 2010వరకు ఇడుక్కి జిల్లా పంచాయత్ వెల్ఫేర్ స్టాండింగ్ కమిటీ చైర్మన్‌గా, 2016 నుండి 2021వరకు స్టేట్ వేర్ హౌజింగ్ కార్పొరేషన్ చైర్మన్ గా బాధ్యతలు నిర్వర్తించారు. ఆయనకు భార్య బిందుసోమన్, పిల్లలు సాబిన్ సోమన్, సోబిత్‌సోమన్ ఉన్నారు.

### సోమన్ మృతి కార్మికోద్యమానికి తీరని లోటు : సిపిఐ సంతాపం

పీర్‌మేడ్ సిపిఐ శాసనసభ్యుడు వర్ఘూర్ సోమన్ కార్మికోద్యమానికి, పీడిత తాడిత అట్టడుగువర్గాల ప్రజలకు తీరని లోటు అని భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) సంతాపం తెలిపింది. ఆయన మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి కూడా పూడ్చలేని లోటు అని విచారం వ్యక్తంచేసింది. ప్రస్తుతం కేరళ రాష్ట్ర ఎఐటియుసి వైస్ ప్రసిడెంట్‌గా, జాతీయ కౌన్సిల్ సభ్యుడిగా పనిచేస్తున్న వర్ఘూర్ సోమన్ ఆసియాలోనే అతిపెద్ద తోటల కార్మికుల సంస్థగా పేరొందిన 'పీర్‌మేడ్ ప్లాంటేషన్ వర్కర్స్ యూనియన్' ప్రధానకార్యదర్శిగా బాధ్యతల్లో ఉన్నారు.ఇడుక్కిలోని ఎత్తైన ప్రాంతాలలోని తోట కార్మికులు, అణగారిన వర్గాల హక్కుల పోరాటాలకు నాయకత్వం వహించడంలో వర్ఘూర్ సోమన్ కీలక పాత్ర పోషించారని సిపిఐ శ్లాఘించింది. 2021లో పీర్‌మేడ్ ఎమ్మెల్యేగా శాసనసభలో అడుగిడిన ఆయన ప్రజల సమస్యలపై గళమెత్తారని, న్యాయం, సమానత్వం, అణగారిని వర్గాల హక్కుల సాధనలో ఆయనకు అచంచలమైన నిబద్ధత గుర్తించబడిందని సిపిఐ ఆయన సేవలను గుర్తుచేసింది. ఆయన మృతి భారత కమ్యూనిస్టు పార్టీకి, ట్రేడ్ యూనియన్ ఉద్యమానికి, కేరళలోని ప్రగతిశీల శక్తులకు తీరని లోటు అని పేర్కొంది. ఆయన కుటుంబానికి, కార్మికులకు, పీర్‌మేడ్ ప్రజలకు ప్రగాఢ సానుభూతిని వ్యక్తంచేసింది

# త్వరలోనే సొంత రాకెట్‌లో అంతరిక్ష యాత్ర

### వ్యోమగామి శుభాంశు శుక్లా



**న్యూఢిల్లీ :** అంతరిక్షం గురించి క్షేత్రస్థాయిలో నేర్చుకునే దానికన్నా కంటే పొందిన అనుభూతి భిన్నమైనది అని భారత వ్యోమగామి శుభాంశు శుక్లా ఉన్నారు. అంతరిక్ష యాత్ర అనేది యావత్ దేశ లక్ష్యమని పేర్కొన్నారు. త్వరలోనే భూమిపై నుంచి సొంత రాకెట్‌లో ఎవరో ఒకరు అంతరిక్ష యాత్ర చేస్తారని విశ్వాసం వ్యక్తం చేశారు. గురువారం ఢిల్లీలో నిర్వహించిన మీడియా సమావేశంలో అంతరిక్ష యాత్ర అనుభవాలను పంచుకున్నారు. 'యాక్సియం–4 మిషన్‌లో భాగంగా గతేడాదిలో నేర్చుకున్న పాఠాలు, భారత్ గగన్‌యాన్ మిషన్‌కు ఎంతో ఉపయోగపడతాయి. ఎంత శిక్షణ తీసుకున్నా, రాకెట్‌లో కూర్చొనప్పుడు కలిగే అనుభూతి పూర్తిభిన్నంగా ఉంటుంది. నిజానికి మొదటి కొన్ని సెకన్ల పాటు రాకెట్ వెనక పరిగెత్తుతున్నట్టే అనిపించింది. దానిని అందుకోవడానికి నాకు కొంత సమయం పట్టింది. అప్పటి నుంచి భూమి మీదకు తిరిగి వచ్చిన వరకు అనుభవం నమ్మశక్యం కానిది. దానిని మాటల్లో చెప్పడం కూడా కష్టంగా ఉంది. 1984లో వ్యోమగామి రాకేశ్ శర్మ అన్నట్టే ఇండియా ఈ రోజు కూడా సారే జహాసే అచ్ఛా(ప్రపంచలోకెల్లా గొప్పది). ఈ మిషన్‌ను విజయవంతగా కావడానికి కృషి చేసిన ప్రభుత్వానికి, ఇస్రోకు, ప్రతిఒక్కరికీ కృతజ్ఞులు. ఈ మిషన్‌ను దేశ ప్రజలందరికీ చేరేలా చేసినందుకు ధన్యవాదాలు. ప్రతిపౌరుడు ఈ మి షన్‌ను తనదిగా భావించాడు. ఇది నిజంగా దేశం మొత్తం మిషన్‌గా అనిపించింది' అని శుక్లా పేర్కొన్నారు. ఇదేవిలేకరుల సమావేంలో కేంద్ర మంత్రి జితేంద్రసింగ్ మాట్లాడారు. 'స్పేస్ విభాగం దాదాపు 70ఏళ్లుగా ఉంది. ఇస్రో 1969లో ఏర్పడింది. కానీ ఈ స్థాయి పురోగతి గత కొన్ని సంవత్సరాల్లో ఎందుకు జరగాల్సి వచ్చింది. గత 56 దశాబ్దాల్లో ఎందుకు జరగలేదు. ప్రపంచ వ్యూహాలను మేంఅనుసరించడం ప్రారంభించాం. ఇప్పుడు మనప్రమాణాలు ప్రపంచవ్యాప్తంగా ఉన్నాయి' అని జితేంద్రసింగ్ అన్నారు. కొన్ని నెలల్లో దీపావళి వస్తుంది. ఆసమయంలోనే రా ముడు అయోధ్యకు చేరుకున్నారు. ఇక్కడ నేను లక్ష్మణుడిలా ఉండాలనుకుంటున్నా. నేను శుక్లా కంటే పెద్దవాడిని. అయినప్పటికీ రాముడికి లక్ష్మణ్‌లా ఉండడానికే ఇష్టపడతా. అయితే, రామలక్ష్మణులకు వానరసేన సహాయం చేసినట్టే, మాకు ఇస్రోబృందం అండ గా ఉంది. లేకపోతే ఇది సాధ్యం అయ్యేది కాదు' ప్రశాంత్ అన్నారు.

# భర్తపై ఆధారపడనని భార్య చెప్పొద్దు : సుప్రీంకోర్టు



**న్యూఢిల్లీ :** పెళ్లి అంటే ఒక్కటిగా కలిసి జీవించడం అని, ఒకరిమీద ఒకరు ఆధారపడకుండా.. వ్యక్తిగతంగా జీవించడం కాదు అని సుప్రీంకోర్టు పేర్కొంది. వేర్వేరుగా జీవిస్తున్న భార్యాభర్తల కేసులో గురువారం సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. పెళ్లి చేసుకున్న జంట.. భాగస్వామి మీద ఆధారపడకుండా, వ్యక్తిగతంగా ఉంటానని చెప్పడం సరికాదు అని కోర్టు తెలిపింది. ఒకవేళ ఎవరైనా వ్యక్తిగతంగా జీవించాలనుకుంటే, అప్పుడు వాళ్లు వైవాహిక బంధంలోకి వెళ్లకూడదని సుప్రీం ధర్మాసనం తెలిపింది. జస్టిస్ బివి నాగరత్న, ఆర్ మహాదేవన్‌తో కూడిన ధర్మాసనం ఈ కేసును విచారించింది. వివాహ బంధం కొనసాగుతున్న సమయంలోనే.. వ్యక్తిగతంగా జీవిస్తామని.. భార్య కానీ, భర్త కానీ చెప్పడం కుదరదు అని కోర్టు చెప్పింది. ఈ విషయంలో కోర్టు చాలా స్పష్టంగా ఉందని, పెళ్లి అంటే కలిసి జీవించడం అని ధర్మాసనం అభిప్రాయపడింది. పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు, రెండు ఆత్మలు ఏకం కావడం అని, మీరెలా వ్యక్తిగతంగా ఉండగలరని కోర్టు ప్రశ్నించింది. పెళ్లి చేసుకున్న జంట.. వ్యక్తిగతంగా జీవిస్తానని చెప్పడం అసాధ్యమని కోర్టు పేర్కొన్నది. ఒకవేళ ఆ జంట ఒక్కటైతే, మేం సంతోషంగా ఉంటామని, ఎందుకంటే వాళ్ల పిల్లలు ఇంకా చిన్నవయసులోనే ఉన్నారని కోర్టు చెప్పింది. గూడు చెదిరిన ఇంట్లో ఎలా ఆ పిల్లలు ఉంటారని, దీంట్లో వాళ్ల తప్పు ఏంటని కోర్టు ప్రశ్నించింది. ఇద్దరూ తమ మధ్య ఉన్న విబేధాలను పరిష్కరించుకోవాలని కోర్టు సూచించింది. ప్రతి భార్యాభర్తల మధ్య ఏదో ఒక రకమైన వివాదం ఉంటుందని కోర్టు అభిప్రాయపడింది. హైదరాబాద్‌కు చెందిన ఓ మహిళ దాఖలు చేసిన పిటీషన్‌పై గురువారం సుప్రీంలో విచారణ జరిగింది. భర్త సింగపూర్‌లో ఉంటున్నాడు. ఆ జంటకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. అయితే సింగపూర్ వెళ్లేందుకు భార్య ఇష్టపడం లేదు. సింగపూర్‌లో తన భర్త ప్రవర్తన సరిగా లేదని ఆమె కోర్టుకు చెప్పింది. ఆసమయంలో కోర్టు ఆమెను కొన్ని ప్రశ్నలు వేసింది. పిల్లల పేరిట కొంత అమౌంట్ డిపాజిట్ చేయాలని భర్తకు కోర్టు సూచన చేయగా, అయితే తాను ఎవరిపై ఆధారపడడానికి ఇష్టంగా లేనట్లు భార్య చెప్పింది. ఆ సమయంలో జస్టిస్ నాగరత్న స్పందిస్తూ మీరలా మాట్లాడకూడదని, ఒకసారి పెళ్లి అయితే, మీరు భావోద్వేగంగా, మరే రీతిలో అయినా భర్తపై ఆధారపడుతారని, ఆర్థికంగా కాకపోవచ్చు అన్నారు. తాను ఎవరి మీద ఆధారపడను అని చెప్పవద్దు అని, అలాంటప్పుడు ఎందుకు పెళ్లి చేసుకున్నారని జస్టిస్ నాగరత్న అడిగారు. తాను పాతకాలం మనిషినే కావొచ్చు, కానీ భర్తపై ఆధారపడను అని ఏభార్య కూడా చెప్పవద్దు అన్నారు. మీరంతా చదువుకున్నవాళ్లు, సమస్యను మీరే పరిష్కరించుకోవాలని జస్టిస్ తెలిపారు.

## ఢిల్లీ సిఎంకు జెడ్ క్యాటగిరీ భద్రత



**న్యూఢిల్లీ :** ఢిల్లీ సిఎం రేఖాగుప్తాపై దాడి జరిగిన విషయం తెలిసిందే. ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. ఢిల్లీ సిఎం భద్రతపై ఆందోళనలను రేకెత్తించింది. ఈ నేపథ్యంలో కేంద్రం అప్రమత్తమైంది. ఢిల్లీ సిఎం భద్రతను పెంచింది. సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్(సిఆర్‌పిఎఫ్)తో జెడ్ కేటగిరీ భద్రతను కల్పించింది. దీంతో గురువారం ఉదయం సిఆర్‌పిఎఫ్ సిబ్బంది సిఎం నివాసానికి చేరుకుంది. సిఎంకు 24 గంటలూ రక్షణ కల్పించేందుకు ముఖ్యమంత్రి నివాసంతో పాటూ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున మోహరించారు. సిఆర్‌పిఎఫ్‌తోపాటూ ఢిల్లీ పోలీసులు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్స్ సిఎంకు నిరంతరం రక్షణ కల్పించనున్నారు. బుధవారం ఉదయం అధికారిక నివాసంలో 'జన్ సున్‌వాయి'(ప్రజావాణి) కార్యక్రమంలో ప్రజలతో మాట్లాడుతుండగా ఓ వ్యక్తి ఆమె దగ్గరికి వచ్చి.. కొన్ని పేపర్లు అందజేశాడు. హఠాత్తుగా ఆమె చేయి పట్టుకుని తనవైపు లాక్కునేందుకు ప్రయత్నించాడు. ఈ క్రమంలో పెనుగులాట జరిగింది. ఈ క్రమంలో సిఎం తలకు స్వల్ప గాయమైంది. అక్కడ ఉన్నవారు అతడిని బంధించారు. పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకుని హత్యాయత్నం కేసు నమోదుచేశారు. నిందితుడు గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన రాజేశ్‌భాయ్ సకారియా(42)గా గుర్తించారు. అతడు జంతు ప్రేమికుడిగా తెలుస్తున్నది.

# ఎస్ఐఆర్‌తో ప్రజాస్వామ్య నాశనమే ఎక్కువ

### కాంగ్రెస్ విమర్శ



**న్యూఢిల్లీ :** బిహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల కమిషన్ స్వయంగా నిర్వహించిన 2024 సర్వేను కాంగ్రెస్ గురువారం ఉదహరించింది. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ అనేది ఓటర్ల జాబితాను శుభ్రపరచడం గురించి కాదని, ప్రజాస్వామ్యాన్ని నాశనం చేయడం గురించి అని ఆరోపించింది. బిహార్ ఎన్నికల జాబితాను శుభ్రపరచడానికి ఎన్నికల కమిషన్ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్)ను ప్రారంభించినప్పటికీ, ఓటరు అంతర్దృష్టులపై దాని స్వంత కెఎపి (జ్ఞానం, వైఖరి, అభ్యాసాలు) సర్వే బిహార్‌లో ఓటరు జాబితా పరిపూర్ణ కచ్చితత్వాన్ని గుర్తించిందని కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేష్ ఎక్స్‌లో మీడియా నివేదికను పంచుకున్నారు. '2024 లోక్‌సభ ఎన్నికల తర్వాత బిహార్‌లోని మొత్తం 243 అసెంబ్లీ నియోజకవర్గాలలో ఎన్నికల కమిషన్ స్వంతంగా నిర్వహించిన 2024 కెఎపి (నాలెడ్జ్, యాటిట్యూడ్ అండ్ ప్రాక్టీసెస్) సర్వేలో ఓటర్ల జాబితా ఇప్పటికే 'పరిపూర్ణ కచ్చితత్వం' వద్ద ఉందని పేర్కొంది. కాగితపు పని, అవగాహన లేకపోవడం వల్ల చాలా మంది అర్హత కలిగిన పౌరులు ఇప్పటికీ ఓటరుగా నమోదు కాలేదని రమేష్ ఎక్స్‌లో పేర్కొన్నారు. చాలా మంది ప్రతివాదులు తమ ఓటరు కార్డులను భద్రపరచడంలో సంక్లిష్టతలను ఉదహరించినందున ఇసిఐ దృష్టి మినహాయింపుపై కాకుండా చేర్చడంపై ఉండాలని జైరామ్ రమేష్ అన్నారు. జనవరి 2025 నాటికి బిహార్ ఓటర్ల జాబితాల ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) నిర్వహించాల్సిన అవసరం ఉందని ఇసిఐ విశ్వసించలేదుదని, అప్పటి నుండి ఏమి మారిందని అని ఆయన అన్నారు. బిహార్‌లో రిగ్గింగ్ ఎన్నికల హామీ ద్వారా తన పదవిని దక్కించుకోవడానికి, శిథిలావస్థలో ఉన్న ఎన్‌డిఎ సంకీర్ణాన్ని కాపాడుకోవడానికి తీవ్రంగా ప్రయత్నిస్తున్న ప్రధానమంత్రి చేసిన విజ్ఞప్తి ఇది కాదా అని రమేష్ ప్రశ్నించారు.


## లాటరల్ ఎంట్రీ నియామకాల్లో రిజర్వేషన్లు వర్తించవు

### రాజ్యసభకు కేంద్రం వెల్లడి

**న్యూఢిల్లీ :** లాటరల్ ఎంట్రీ మోడ్ ద్వారా జరిగే నియామకాల్లో రిజర్వేషన్లు వర్తించవని ప్రభుత్వం గురువారం రాజ్యసభకు తెలిపింది. ప్రభుత్వ విభాగాలలో ప్రైవేట్ రంగానికి చెందిన వారితో సహా నిపుణుల నియామకాన్ని లాటరల్ ఎంట్రీ అంటారు. '2018 నుండి మూడు విడతల్లో (2018, 2021, 2023) లాటరల్ ఎంట్రీ ద్వారా వివిధ ప్రభుత్వ విభాగాలలో కాంట్రాక్ట్/డిప్యుటేషన్ ప్రాతిపదికన జాయింట్ సెక్రటరీ/డైరెక్టర్/డిప్యూటేషన్ ప్రాతిపదికన ఇప్పటివరకు 63 నియామకాలు జరిగాయని కేంద్ర సిబ్బంది సహాయ మంత్రి జితేంద్ర సింగ్ ఒక లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఈ నియామకాలు డొమైన్ ప్రాంతంలో వారి ప్రత్యేక జ్ఞానం, నైపుణ్యాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్దిష్ట నియామకాల కోసం జరిగాయన్నారు. ఈ నియామకాలలో ప్రతి ఒక్కటి ఒకే పోస్ట్ కేడర్‌కు వ్యతిరేకంగా చేయబడినందున, సుప్రీంకోర్టు 'పిజిఐఎంఆర్, చండీగఢ్ వర్సెస్ ఫ్యాకల్టీ అసోసియేషన్, ఇతరులు' అనే కేసులో తీర్పును దృష్టిలో ఉంచుకుని రిజర్వేషన్ వర్తించదు. తదనుగుణంగా నియమించబడిన అధికారుల కేటగిరీ వారీగా డేటాను నిర్వహించలేదు' అని మంత్రి అన్నారు. ప్రస్తుతం వివిధ మంత్రిత్వ శాఖలు/విభాగాల్లో 43 మంది అధికారులు పనిచేస్తున్నారని సింగ్ అన్నారు.

## కేంద్రం తీసుకొస్తున్న చట్టాలు..
# రాజ్యాంగానికి చెదపురుగుల్లాంటివి

### పిఎం, ముఖ్యమంత్రులు, మంత్రుల తొలగింపు బిల్లులపై రాజ్యసభ ఎంపి కపిల్‌సిబల్ ధ్వజం



**న్యూఢిల్లీ :** కేంద్రం పార్లమెంట్‌లో ప్రవేశపెడుతోన్న బిల్లుల తీరుపై రాజ్యసభ ఎంపి కపిల్ సిబల్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తీవ్ర అభియోగాలపై వరుసగా 30 రోజులపాటు అరెస్ట్ చేయబడి జైల్లో ఉంటే ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించాలని ప్రతిపాదించే బిల్లులను కేంద్రం ప్రవేశపెట్టడాన్ని గురువారం కపిల్ సిబల్ తీవ్రంగా విమర్శించారు. అలాంటి చట్టాలు రాజ్యాంగానికి 'చెద పురుగుల్లా పనిచేసే చట్టాలు' అని ఆయన నొక్కిచెప్పారు. ప్రతిపక్ష మంత్రులను, ముఖ్యమంత్రులను లక్ష్యంగా చేసుకోవడమే ఈ బిల్లు యొక్క ముఖ్యోద్దేశంగా కనిపిస్తున్నదని సిబల్ ఆరోపించారు. ఈ చర్యల ద్వారా కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగంలోని అనేక ప్రాథమిక సవరణలను 'నాశనం' చేస్తోందని మండిపడ్డారు. అయితే రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదానికి మూడింట రెండు వంతుల మెజారిటీ అవసరమని, ప్రభుత్వానికి అది లేనందున ప్రభుత్వం బిల్లులను ఆమోదించలేమని కపిల్ సిబల్ తెలిపారు. ఇండిపెండెంట్ రాజ్యసభ ఎంపి అయిన కపిల్ సిబల్ గురువారం ఇక్కడి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ '2014 నుంచి రాజ్యాంగం మనకు ఇచ్చిన మానవ హక్కులను లాక్కునే అనేక చట్టాలను మనం చూశాం. అలాంటి చట్టాలు రాజ్యాంగ నిర్మాణాన్ని దెబ్బతీస్తాయి' అని కపిల్ సిబల్ పేర్కొన్నారు. బుధవారం హోంమంత్రి అమిత్‌షా లోక్‌సభలో మూడు బిల్లులను ప్రవేశపెట్టారు. తీవ్ర అభియోగాలపై వరుసగా 30 రోజుల పాటు అరెస్ట్ చేయబడి జైల్లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులు, మంత్రులను తొలగించాలన్న ప్రతిపాదనతో ప్రవేశపెట్టిన బిల్లు కూడా అందులో ఒకటి. అయితే ప్రతిపక్ష ఎంపిలు దీనిని తీవ్రంగా ఆక్షేపిస్తూ పెద్దపెట్టున దీనికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అమిత్‌షా సీటు వద్దకు ప్రదర్శనగా దూసుకెళ్లారు. చట్టం ముసాయిదా ప్రతులను చింపివేసి నిరసన వ్యక్తం చేశారు. అమిత్‌షా ప్రతిపాదన, బిల్లులను సభ 21మంది సభ్యులు ప్రాతినిధ్యం వహించే జాయింట్ పార్లమెంట్ కమిటీ, 10 మంది సభ్యులు ప్రాతినిధ్యం వహించే రాజ్యసభ కమిటీకి స్క్రూటినీకి పంపించారు. తరువాత ఆ మూడు బిల్లుల్లో కేంద్రపాలిత ప్రభుత్వం (సవరణ) బిల్లు 2025, రాజ్యాంగం ( 130వ సవరణ) బిల్లు 2025, జమ్ముకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు 2025 ఉన్నాయి. కపిల్ సిబల్ మాట్లాడుతూ అరవింద్ కేజ్రీవాల్, మనీష్ సిసోడియా, హేమంత్ సొరేన్‌ను ఉదాహరణలుగా చెబుతూ ఈ బిల్లులను చూస్తే ప్రతిపక్ష మంత్రులు, ముఖ్యమంత్రులను లక్ష్యంగా చేసుకున్న ఉద్దేశం స్పష్టం అవుతోందని కపిల్ సిబల్ అన్నారు.

## నటి వేధింపుల ఆరోపణలు..
# కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడి రాజీనామా



**తిరువనంతపురం :** మలయాళ నటి రిని జార్జ్ చేసిన వేధింపుల ఆరోపణలు కేరళ రాజకీయాల్లో ప్రకంపనలు సృష్టించాయి. ఓ యువ రాజకీయ నేత మూడేళ్లుగా తనను వేధింపులకు గురిచేస్తున్నట్లు నటి ఆరోపించారు. ఆమెను వేధించింది కాంగ్రెస్ ఎమ్మెల్యే రాహుల్ మామ్‌కూటతిల్ అని ఆరోపిస్తూ బిజెపి ఆందోళనలు చేసింది. దీంతో పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా చేశారు. ప్రముఖ రాజకీయపార్టీ చెందిన ఓ యువ నాయకుడు మూడేళ్లుగా తనకు అసభ్యకర సందేశాలు పంపిస్తూ వేధిస్తున్నట్లు రిని ఓ ఇంటర్వ్యూలో తెలిపారు. ఫైవ్‌స్టార్ హోటల్‌లో రూమ్ బుక్ చేసి రావాలని వేధించినట్టు ఆరోపించారు. అయితే అతడి పేరు, పార్టీ పేరు మాత్రం నటి వెల్లడించలేదు. మూడేళ్ల క్రితం సామాజిక మాధ్యమాల ద్వారా అతడితో పరిచయం ఏర్పడినట్లు నటి తెలిపారు. అప్పటి నుంచి తనను వేధిస్తున్నట్టు ఆమె ఆరోపించారు. అతడిపై చర్యలు తీసుకోవాలని ఆ పార్టీకి ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని వాపోయారు. భద్రతా కారణాల దృష్ట్యా, న్యాయ వ్యవస్థపై నమ్మకం లేకపోవడం వల్లే అతడిపై ఫిర్యాదు చేయలేదని రినీ జార్జ్ వెల్లడించారు. తననే కాదు మరికొందరు మహిళలను కూడా అతడు వేధించినట్లు నటి ఆరోపించారు.

**'ఏ తప్పు చేయకపోయినా రాజీనామా చేస్తున్నా'...**

ఈ పరిణామాల నేపథ్యంలో కేరళ యూత్ కాంగ్రెస్ అధ్యక్ష పదవికి రాహుల్ రాజీనామా చేశారు. తనపై వచ్చిన ఆరోపణల విషయంలో పార్టీ పెద్దలతో మాట్లాడానని, వారెవరూ తనను రాజీనామా చేయాలని డిమాండ్ చేయలేదని రాహుల్ చెప్పారు. నటి జార్జ్ తన స్నేహితురాలని ఆమె ఆరోపణలు చేసిన వ్యక్తి తాను కాదన్నారు. తాను ఎటువంటి చట్టవిరుద్ధమైన చర్యలకు పాల్పడలేదని రాహుల్ వివరణ ఇచ్చారు. ఏ తప్పు చేయకపోయినా తనపై వచ్చిన ఆరోపణలు అవాస్తవాలేనని నిరూపించేందుకు రాజీనామా చేసినట్లు చెప్పారు.

ప్రజాపక్షం
శుక్రవారం, 22 ఆగస్టు

# నిరంకుశాధికార బిల్లులు

రాజ్యాంగాన్ని రద్దు చేయకుండానే దాన్ని లోపలినుంచి నాశనం చేయటం సాధ్యమేనన్న దాని రూపశిల్పి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ అభిప్రాయాన్ని నిజంచేసే దిశలో ఆర్ఎస్ఎస్–బిజెపి సారధ్యంలోని ఎన్‌డిఎ ప్రభుత్వం మరో చర్యకు ఉపక్రమించింది. నైతికంగా ఎంతో ఉన్నత ప్రమాణాలను పరిరక్షించే సంకల్పంగా హోంమంత్రి అమిత్ షా 130వ రాజ్యాంగ సవరణ బిల్లును, తత్సంబంధ మరో రెండు బిల్లులను బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. హిందూ రాష్ట్ర (దేశం) స్థాపన ధ్యేయంగా సంపూర్ణాధికారాన్ని కోరుకుంటున్న ఆర్ఎస్ఎస్–బిజెపి ప్రభుత్వం ఇప్పటికే 'ఒక దేశం – ఒకే ఎన్నికలు' బిల్లు తెచ్చింది. ఇప్పుడది పార్లమెంటరీ కమిటీ పరిశీలనలో ఉంది. ఎన్నికల కమిషనర్ల చట్టాన్ని సవరించి వారి నియామకాన్ని తమ చెప్పుచేతల్లోకి తీసుకుని ఓటర్ల జాబితాల్లో అక్రమాలకు పాల్పడుతూ తప్పుడు పద్ధతుల్లో అధికారాన్ని సొంతం చేసుకుంటున్నది. ఇండియా కూటమి దీనిపై ప్రస్తుతం బిహార్‌లో ఆందోళన సాగిస్తోంది. సుప్రీంకోర్టు కొలీజియం సిఫారసుల ప్రకారం జడ్జీల నియామకాలు చేయకుండా తొక్కిపట్టి, వడపోతలు, తిరస్కరణలతో తన ఆధిపత్యం నెరపుతోంది. మీడియాను ఇప్పటికే తమ చెప్పుచేతుల్లోకి తీసుకుంది. నూతన విద్యావిధానం ద్వారా చరిత్రను వక్రీకరిస్తూ హిందూత్వ విద్యకు ప్రాధాన్యత ఇస్తోంది. మైనారిటీలను అణచివేస్తోంది. అక్రమ కేసులతో ప్రతిపక్ష నాయకులను, అసమ్మతి గళమెత్తిన మేధావులను ఏళ్లతరబడి జైళ్లలో బంధించి బెయిలు రాకుండా వేధిస్తున్నది. పౌరహక్కులను కాలరాసి మావోయిస్టులపై నరమేధం సాగిస్తోంది.

తాజా బిల్లులను దేశంలో ప్రతిపక్ష రాజకీయ పార్టీల పట్ల బిజెపి శత్రుపూరిత, అణచివేత వైఖరి నేపథ్యంలో గమనంలోకి తీసుకోవాలి. ప్రతిపక్షపాలిత రాష్ట్రాల్లో పార్టీలను చీల్చుతూ, ఎమ్మెల్యేలను కొనుగోలు చేస్తూ అధికారం దక్కించుకుంటున్నది. ప్రతిపక్ష ప్రభుత్వాలపై గవర్నర్‌లను ప్రయోగించి పరిపాలనకు ఆటంకాలు కల్పిస్తూ, నిధుల విడుదల తొక్కిపడుతూ సమాఖ్య భావనకు తూట్లు పొడుస్తున్నది. ప్రతిపక్ష పార్టీల నాయకులపై, మంత్రులు, ముఖ్యమంత్రులపై సిబిఐ, ఇడి, ఐటిలను ప్రయోగించి, సోదాలు, అరెస్టులు చేసి వారిపై అవినీతి ముద్ర వేస్తోంది. తామొక్కరిమే నిజాయితీపరులైనట్లు, ప్రతిపక్షాలపై నిత్యం నిందారోపణలు చేసే బిజెపి కేంద్రప్రభుత్వం ఇప్పుడు "ప్రధానమంత్రి, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రి, రాష్ట్రమంత్రులు, కేంద్రపాలిత ప్రాంతాల ముఖ్యమంత్రులు, మంత్రులను ఐదు సంవత్సరాలకు మించి శిక్షార్హమైన క్రిమినల్ నేరారోపణలతో ఏదైనా ప్రభుత్వ ఏజన్సీ అరెస్టు చేసి లేదా జైల్లో నిర్బంధించి (డిటైన్‌చేసి) 30 రోజులకుపైగా ఉంచినట్లయితే, అటువంటివారు 31వ రోజు ఆటోమాటిక్‌గా అధికార పదవులను కోల్పోయే అధికారాలతో" రాజ్యాంగ 130వ సవరణను అమిత్ షా ప్రవేశపెట్టారు. పరిపాలనను "పరిశుద్ధం చేసేందుకు ఉద్దేశించినట్లు చెప్పబడుతున్న ఈ బిల్లు" పూర్తిగా అప్రజాస్వామికమైంది, రాజ్యాంగ వ్యతిరేకమైంది. ఇలా అంటే అవినీతిని సమర్థిస్తున్నట్లు కాదు.

మందబుద్ధికి సైతం కొన్ని అనుమానాలు రావటం సహజం. ఉదాహరణకు, ప్రధానమంత్రిపై బోఫర్స్, రఫెల్ యుద్ధ విమానాల కొనుగోలు ఒప్పందం లాంటి వాటిపై అవినీతి ఆరోపణలు దేశ, విదేశ మీడియాలో వచ్చాయనుకుందాం, ప్రతిపక్షాలు గొంతుకలిపాయనుకుందాం. అప్పుడు ప్రధానిని అరెస్టు చేయగల ఏజన్సీ ఉందా? లేక ప్రధానిని బర్తరఫ్ చేసే అధికారం 'మంత్రిమండలి సలహా'పై నడుచుకోవలసిన రాష్ట్రపతికి రాజ్యాంగం ఇచ్చిందా, లేదే! కేంద్రంలో ప్రభుత్వం లేకుండా ఉండటానికే వీలు లేదు కదా? ఒక ప్రధానమంత్రి ప్రభుత్వం మైనారిటీలో పడినా/పార్లమెంటులో ఓడి రాజీనామా చేసినా ప్రత్యామ్నాయ ప్రభుత్వ ఏర్పడేవరకు అతనే ఆపద్ధర్మ ప్రధాని తప్ప రాష్ట్రపతికి పాలనాధికారం లేదే! 1996లో ఎబి.వాజ్‌పేయి 13 రోజుల ప్రభుత్వం కూలిపోగా తదుపరి ఎన్నికల వరకు ఆయనే ఆపద్ధర్మ ప్రధానిగా కొనసాగుతూ గుర్తు చేసుకోదగింది. ప్రతిపాదిత రాజ్యాంగ సవరణ రాజ్యాంగ విరుద్ధంగా రాష్ట్రపతికి ప్రధానిని బర్తరఫ్ చేసే అధికారం ఇస్తుందా? ప్రధాని సలహాపై రాష్ట్రపతి మంత్రులను నియమించవచ్చు, తొలగించవచ్చు.

రాష్ట్రాల్లో రాష్ట్రపతి పాలన విధించటానికి – గతంలో ఆ అధికారం అతిగా దుర్వినియోగం అయిన దృష్ట్యా రాజ్యాంగ సవరణ ద్వారా అట్టి చర్యకు కట్టుబాట్లు విధించినప్పటికీ, ముఖ్యమంత్రిని బర్తరఫ్ చేసి కొంతకాలం రాష్ట్రపతిపాలన అనగా గవర్నర్ పాలన విధించే అవకాశం ఉంది. పార్లమెంటు ఆమోదంతో కొనసాగించనూవచ్చు. దీన్ని కశ్మీర్‌లో చూశాం. మణిపూర్‌లో చూస్తున్నాం. అయితే అది ఎప్పుడు? అతడు శాసనసభా పార్టీ విశ్వాసం కోల్పోయినప్పుడు', మైనారిటీలో ఉండి కూడా రాజీనామా చేయకుండా రాజకీయాలు చేస్తున్నప్పుడు, శాంతి–భద్రతలు పూర్తిగా భగ్నమైనప్పుడు.

మరో ముఖ్యమైన సమస్యను పరిశీలించుదాం. ప్రతిపాదిత బిల్లు ప్రకారం అటువంటి అరెస్టులు జరిగినాయనే ఊహించుకుందాం. అయ్యవారు తలుచుకుంటే దెబ్బలకు కొదవా అన్నట్లు కేంద్ర హోంమంత్రి పురమాయిస్తే సిబిఐ, ఇడిలు ఎవరిపైనైనా క్రిమినల్ కేసు బనాయించి బొక్కలో వేయటం సులభం. న్యాయవ్యవస్థ 30రోజుల నియమంలోపల బెయిలు ఇస్తుందన్న హామీ లేదు. అందుకు ప్రాసిక్యూషన్ ఏజన్సీ అడ్డుపడుతుంది. బెయిలు దొరకదు. అప్పుడు ఆ నిందితుడు పదవి కోల్పోతాడు. అర్నెల్లకో, సంవత్సరానికో బెయిలుపై విడుదలయ్యే వరకు రాజకీయ జీవితం కోల్పోతాడు. కోల్పోయిన పదవి అతని కోసం సిద్ధంగా ఉండదు. ఐదేళ్లకో, పదేళ్లకో అతడు నిర్దోషి అని కోర్టు నిర్ధారించినా ప్రయోజనం ఉండదు కదా! అందువల్ల దుర్వినియోగానికి పూర్తి అవకాశం ఉంది.

రాజకీయ అవినీతి కేసుల్లో సిబిఐ, ఇడి, ఐటి ప్రాసిక్యూషన్ ఏజన్సీలు. అవి సచ్ఛీలురతో కూడి ఉంటాయని రాజ్యాంగ నిర్మాతలు ఊహించారు. కానీ ఆచరణలో అవి పాలకుల చేతిలో కీలుబొమ్మలు కాలేదా? సిబిఐ 'పంజరంలో చిలుక' అని సుప్రీం కోర్టే అభిశంసించలేదా? ఇడి మోసకారి (క్రూక్)గా వ్యవహరించరాదని ఈ మధ్యనే సుప్రీం కోర్టు ధర్మాసనం చురక అంటించింది. ఇడి కేసులు వందల సంఖ్యలో పెండింగ్‌లో ఉన్నాయి. సంవత్సరాలకి 2శాతానికి మించి పరిష్కారం కావటంలేదు. అటువంటి కేసులో పదవిలో ఉన్న రాజకీయనాయకుడు చిక్కుకుంటే ఆ జీవితం అంతటితో సరి! చట్టం తరతమ భేదంలేకుండా అన్ని రాజకీయ పార్టీలకు వర్తిస్తుంది. కాని అధికారం చెలాయిస్తున్న బిజెపి ప్రత్యర్థులను దెబ్బతీయటానికే ఇప్పుడు ఆకస్మికంగా ఈ బిల్లులు తెచ్చిందనే అనుమానాలు త్రోసిపుచ్చదగినవి కావు. రాహుల్‌గాంధీ అన్నట్లుగా ఇది చక్రవర్తే అన్ని నిర్ణయాలు చేసే మధ్యయుగాల న్యాయంలోకి దేశాన్ని తీసుకుపోతోంది.

అయితే అవినీతిపరులు ఏలికలుగా కొనసాగవలసిందేనా? పరిష్కారం లేదా అనే ప్రశ్న ఎదురవుతుంది. బిజెపివారు జైలులోనుంచే ఆరునెలలు పరిపాలన చేసిన ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఉదంతాన్ని ప్రస్తావిస్తున్నారు. లిక్కర్ కుంభకోణంలో అరెస్టు చేయబడిన వెంటనే రాజీనామా చేసి ఉంటే ఆతని నిజాయితీని ఓటర్లు అర్థం చేసుకునేవారు. అలా చేయలేదుకాబట్టే, మూడుసార్లు నెత్తికెత్తుకున్న ఓటర్లు నాల్గవసారి ఆయన్ను, ఆయన పార్టీని నేలకేసికొట్టారు. ఇక్కడే మరో ఉదంతం. బొగ్గు కుంభకోణం నేరారోపణతో సిబిఐ అరెస్టు చేసిన జార్ఖండ్ ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ వెంటనే పదవికి రాజీనామా చేసి, బెయిలుపై విడుదలైనాక తిరిగి ముఖ్యమంత్రి పదవి చేబట్టారు. ఆ తదుపరి అసెంబ్లీ ఎన్నికల్లో ఆయన ఇండియా కూటమికి ఓటర్లు తిరిగి అధికారం అప్పగించారు. దీన్నుంచి నేర్చుకోవలసింది ఒక్కటే – మన ప్రజాస్వామ్యంలో ప్రజలే ప్రభువులన్న భావనను నమ్మాలి, పరిరక్షించాలి. పాలకుల తప్పొప్పులపై ఓటర్లే తీర్పు చెబుతారు. నిరంకుశాధికారాన్ని కూడా ప్రజలు సహించరు. ఎమర్జెన్సీ విధించినందుకు ఇందిరాగాంధీని ఓడించటమే గుణపాఠం. అందువల్ల బిజెపికి ప్రజాస్వామ్యంపై, ఫెడరల్ స్ఫూర్తిపై నమ్మకం ఉంటే పునరాలోచించాలి. జాయింట్ పార్లమెంటరీ కమిటీకి పంపిన ఈ బిల్లులను ఉపసంహరించుకోవాలి.

# తెలంగాణ 'గేమ్ ఛేంజర్' కులగణన!!



ఎస్.కె. జకీర్

'కులం ఒక సామాజిక వాస్తవం' అని సుప్రసిద్ధ పార్లమెంటేరియన్ ఎస్.జైపాల్ రెడ్డి చెబుతుండేవారు 'నేను రెడ్డి అయినందువల్ల చాలా లాభాలు పొందాను. నేను కులానికి దూరం కావాలనుకున్నా కులం నన్ను వదిలిపెట్టలేదు' అని ఆయన మరణించడానికి ఏడాది ముందు ఒక టివి ఛానల్ ఇంటర్వ్యూలో చెప్పారు. జైపాల్‌రెడ్డి ప్రతిపాదించిన ఆలోచనా విధానాన్ని కాంగ్రెస్ పార్టీ అందుకునేందుకు ప్రయత్నిస్తున్నట్టు అర్థమవుతోంది. 1990 అక్టోబర్ 1న రాజ్యసభలో జైపాల్ రెడ్డి చేసిన ప్రసంగం చారిత్రాత్మకమైనది. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించడాన్ని సమర్థిస్తూ ఆ ప్రసంగంలో బలంగా వాదించారు. కాంగ్రెస్ పార్టీ 'సామాజిక న్యాయ' పంథాను వీడినందువల్లనే బిజెపి ఎదుగుతోందని జైపాల్ రెడ్డి తన చివరి రోజుల్లో విశ్లేషించేవారని ఢిల్లీలో నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్న సీనియర్ జర్నలిస్టు ఒకరు గుర్తు చేశారు.


"ఒబిసిలు ఎదుర్కొంటున్న సవాళ్లను అర్థం చేసుకోవడంలోనూ, వారికోసం చేపట్టాల్సిన చర్యలను గ్రహించడంలోనూ కాంగ్రెస్ విఫలమైనట్లు నాకు అనిపిస్తోంది. ఒబిసిలకు సానుకూలంగా ప్రతిస్పందించకపోవడం వల్లనే బిజెపికి అవకాశం కల్పించామని భావిస్తున్నా". ఇటీవల పార్టీ ఎంపిల నుద్దేశించి మాట్లాడుతూ రాహుల్ గాంధీ అన్నారు. తెలంగాణలో జరిపిన సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సర్వేపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఇచ్చిన ప్రజంటేషన్‌ను పార్టీ హైకమాండ్ ప్రశంసించింది. రాహుల్ గాంధీ సహా ఆ పార్టీ అగ్రనేతల దగ్గర సిఎం రేవంత్ డిస్టింక్షన్ మార్కులు కొట్టేసినట్టు ఎఐసిసి వర్గాలంటున్నవి.

జైపాల్‌రెడ్డి స్ఫూర్తిని ఆయనకు అత్యంత సమీప బంధువైన రేవంత్‌రెడ్డి కార్యరూపంలో పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. రాహుల్ ఆయన కు పూర్తి ప్రోత్సాహం ఇస్తున్నారు. తెలంగాణ నమూనా దేశానికి ఆదర్శమని రాహుల్ గాంధీ ప్రకటించడం ఒక కీలక పరిణామం. సొంత కులం వారు ఆగ్రహిస్తారని తెలిసినా రేవంత్‌రెడ్డి తమ అంచనాలను అధిగమించి కులగణనను శాస్త్రీయంగా, అర్థవంతంగా జరిపించారని రాహుల్ ప్రశంసించడం తెలిసిందే.

"దళితులు, వెనుకబడిన వర్గాలు, అత్యంత వెనుకబడిన వర్గాల విశ్వాసాన్ని కాంగ్రెస్ చూరగొని ఉంటే బిజెపి ఎప్పుడూ అధికారంలోకి వచ్చి ఉండేది కాదు." ఢిల్లీలో ఎనిమిది నెలల కిందట దళిత మేధావుల సదస్సులో రాహుల్ గాంధీ ప్రసంగిస్తూ వ్యాఖ్యానించారు. వెనుకబడిన, అట్టడుగున ఉన్నవారి ఆందోళనలను సమగ్రంగా అర్థం చేసుకొని నిర్మాణాత్మక పరిష్కారాలను సాధించి ఉంటే వారు తమకు దూరమయ్యేవారు కాదని ఆలస్యంగానయినా రాహుల్ గాంధీ గుర్తించారు. భారతీయ జనతా పార్టీ ఎప్పుడూ కులాన్ని ఎజండాగా చేపట్టలేదు. కానీ మండల్ కమిషన్ నివేదికను విపి సింగ్ వెలుగులోకి తీసుకురాగానే అద్వానీ నాయకత్వంలో బిజెపి రథయాత్ర చేపట్టి దాని ప్రభావాన్ని తుడిచి పెట్టేందుకు ప్రయత్నించింది. మోదీ నాయకత్వంలో 'హిందూత్వ'వాదాన్ని బిజెపి ఎజండాపైకి తీసుకువచ్చింది.

కాంగ్రెస్ తప్పిదాల వల్ల ఆ పార్టీ యువత, పేదలు, మహిళలు, రైతులు, వెనుకబడిన తరగతులు, దళితుల ఓటు బ్యాంకును బిజెపి దాదాపు తన వైపునకు తిప్పుకోగలిగింది. కులాన్ని కేవలం ఓటు బ్యాంకు రాజకీయాలకు మాత్రమే ఉపయోగించుకోవాలని, సంక్షేమ పథకాలు ప్రకటిస్తే సరిపోతుందన్న భావన కాంగ్రెస్ పార్టీలో చాలా కాలంగా ఉన్నది. ఆ పంథాను బిజెపి కూడా అనుసరించింది. బిజెపి కేవలం అగ్రవర్ణాల పార్టీగా ఉండేది. కాలక్రమంలో ఓబీసీల్లో అతి వెనుకబడిన వర్గాలను తన వైపునకు తిప్పుకొని సంఘటితం చేయగలిగింది. 2009 నుంచి 2019 మధ్య దేశ వ్యాప్తంగా బిజెపికి ఒబిసి ఓట్లు 20 నుంచి 44 శాతం మేరకు పెరిగాయన్న లెక్కలున్నవి. కాంగ్రెస్ సహా రాష్ట్ర స్థాయి పార్టీలను కూడా బిజెపి దెబ్బతీయగలిగింది. 2024 ఎన్నికల్లో దేశవ్యాప్తంగా ఎన్డీఏ 4 శాతం ఒబిసి ల మద్దతును కోల్పోయింది. ఇండియా కూటమి 11 శాతం ఎగువ స్థాయి ఒబిసిలు,7 శాతం మరింత వెనుకబడిన ఒబిసిల మద్దతును సాధించగలిగింది.

జాతీయస్థాయిలో, వివిధ రాష్ట్రాల్లో అధికారం కోల్పోయిన కాంగ్రెస్ ఒబిసి ఓట్లతో లోక్‌సభ ఎన్నికల్లో పుంజుకున్నది. ప్రస్తుత పరిస్థితుల్లో 'సామాజిక న్యాయాన్ని' ఎజెండాగా చేపట్టడం కన్నా కాంగ్రెస్‌కు మరో గత్యంతరం లేదు. రాజకీయ అధికారంలో, సంపదలోనూ వెనుకబడిన వర్గాలకు జనాభా ప్రాతిపదికన 'వాటా' ఇవ్వాలని కాంగ్రెస్ భావిస్తోంది. ఎవరి జనాభా ఎంత ఎక్కువ ఉంటుందో అంత భాగస్వామ్యం కల్పించాలనే నినాదంతో ప్రజల్లోకి వెళుతోంది. తెలంగాణలో వలె దేశవ్యాప్తంగా విస్తృత స్థాయిలో కులగణన నిర్వహించి ప్రజల సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యా, ఉపాధి పరిస్థితులను కూడా ఆరాతీస్తే ఈ దేశంలో ప్రజలు స్వాతంత్ర్యం వచ్చిన 78 సంవత్సరాల తర్వాత కూడా ఏ స్థాయిలో ఉన్నారో కచ్చితంగా తేలేందుకు అవకాశాలు ఉన్నాయి. తద్వారా విధానాల రూపకల్పన కూడా శాస్త్రీయంగా చేసేందుకు తోడ్పడుతుంది.




'కులగణన'తో రేవంత్ రెడ్డి గ్రాఫ్ పెరిగింది. పాలనాపరంగానూ నిధుల కొరత ఉన్నా సంక్షేమ కార్యక్రమాలను అమలు చేయడానికి ప్రయత్నిస్తున్నారు. ఎకరానికి రూ.12వేలు రైతు భరోసా, ప్రతి కుటుంబం తినేలా సన్న బియ్యం పంపిణీ, అన్నదాతలకు రూ.21 వేల కోట్ల రుణమాఫీ, సన్న వడ్లు క్వింటాకు రూ.500 బోనస్, 77 వేల ఉద్యోగ నియామకాలు, హాస్టల్ విద్యార్థులకు డైట్, కాస్మొటిక్ చార్జీల పెంపు, మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, ఆడ బిడ్డలకు ఉచిత బస్సు ప్రయాణం, 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్, పేదలకు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంతో తెలంగాణలో ప్రతి ఒక్క ఇంటికి సంక్షేమ ఫలాలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అందజేస్తున్నారు. కేవలం ఏడాదిన్నరలోనే తెలంగాణ పాలనారంగంపై చెరగని ముద్రవేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రానున్న మూడేళ్లలో ఇదే రీతిలో పాలన కొనసాగిస్తే తమ పార్టీకి నామరూపాలు ఉండవని కెసిఆర్, ఆయన కుటుంబం ఒణికిపోతోంది. అందుకే పాలనాపరమైన విమర్శలు మాని అసభ్య పదజాలంతో ముఖ్యమంత్రిపై బిఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శలు చేస్తున్నారు.

అధికారం పోవడమే కెసిఆర్, కెటిఆర్‌లకు పీడకల అయితే, ఇంటిపోరు ఇద్దరినీ మరింత ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. తండ్రి తనను ముఖ్యమంత్రిని చేస్తాడని కెటిఆర్ ఆశించారు. యువరాజు మహారాజుగా పట్టాభిషిక్తుడు అవుతాడంటూ కెటిఆర్ మద్దతుదారులు ప్రచారం నడిపించారు. కానీ కెటిఆర్ శక్తి, సామర్థ్యాలపై నమ్మకం లేని కెసిఆర్ ఆయనను దూరం పెట్టారు. 2023 ఎన్నికల తర్వాతైనా తనకు పట్టం కడతారని భావిస్తే ప్రజా తీర్పు కెటిఆర్ ఆశలపై నీళ్లు చల్లింది.గొర్రెల కుంభకోణం, మద్యం కుంభకోణం, కాళేశ్వరం కమీషన్ల బాగోతం, ఫోన్ ట్యాపింగ్‌లతో విసిగిపోయిన తెలంగాణ ప్రజలు బిఆర్‌ఎస్‌ను తిరస్కరించారు. ప్రతిపక్షంలోకి వెళ్లిన తర్వాత కూడా ప్రజలు తమను ఎందుకు తిరస్కరించారో ఆత్మవిమర్శ చేసుకోకుండా, ప్రజలే తప్పు చేశారని నిందించడానికి పూనుకున్నారు.

2009లో తనతో పాటు ఎమ్మెల్యే అయిన రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి కావడాన్ని కెటిఆర్ జీర్ణించుకోలేకపోతున్నారు. కెసిఆర్‌కు ప్రత్యామ్నాయ నాయకునిగా రేవంత్‌రెడ్డిని ప్రజలు ఆమోదించడం అనూహ్య ఘటన. అధికారంలో ఉన్నప్పుడు ముఖ్యమంత్రి పదవి దక్కకపోవడం, అధికారం పోయిన తర్వాత పార్టీ అధ్యక్ష బాధ్యతలు దక్కకపోవడం, చివరకు బిఆర్‌ఎస్‌ఎల్పీ నాయకత్వాన్ని సైతం కెసిఆర్ తన దగ్గరే ఉంచుకోవడం, ఓ వైపు చెల్లెలి తిరుగుబాటు ఇవన్నీ కెటిఆర్‌ను ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. మరోవైపు హరీశ్‌రావు పార్టీని హస్తగతం చేసుకుంటారేమోనన్న బెంగ వెంటాడుతోంది. ఈ ఒత్తిడినంతా ముఖ్యమంత్రిపై తిట్లరూపంలో కెటిఆర్ వెళ్లగక్కుతున్నట్టు పరిశీలకులంటున్నారు.

కాగా తమ ప్రభుత్వం బిసిలకు కల్పించాలనుకుంటున్న 42 శాతం రిజర్వేషన్లకు గతంలో కెసిఆర్ చేసిన చట్టమే శాపంగా మారిందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విమర్శించారు. మొత్తం రిజర్వేషన్లు 50 శాతానికి మించకుండా పకడ్బందీగా చట్టం చేశారని సిఎం ఒక సమావేశంలో మండిపడ్డారు. మరోపక్క మతం ముసుగులో బిజెపి నాయకులు బిసిల రిజర్వేషన్లను అడ్డుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశా రు. "మత ప్రాతిపదికన రిజర్వేషన్లు చట్టంలోనే లేవు. అబద్దాలతో బహుజనులకు అన్యాయం చేయాలని చూస్తున్నారు. దూదేకుల, నూర్ బాషా, బార్బర్, దోబీవృత్తి చేసే ముస్లింలకు 56 ఏళ్లుగా బిసి రిజర్వేషన్లు అమలవుతున్నాయి. మహారాష్ట్ర, గుజరాత్, ఉత్తరప్రదేశ్ లో బిసిలలో ఉన్న ముస్లింలను రిజర్వేషన్ల నుంచి తొలగించగలరా? గతంలో తెలంగాణ ఇస్తామని ఇచ్చిన మాటను కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకున్నది. బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని రాహుల్‌గాంధీ మాట ఇచ్చారు. ఆయన సూచనల మేరకే కులగణన సర్వే చేశాం. దీన్ని తప్పుపడితే మరో వందేళ్ల వరకు బిసిలకు న్యాయం జరగదు. విద్య, ఉద్యోగ, రాజకీయాల్లో బిసిలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు బిల్లులు రూపొందించి ఆమోదం కోసం గవర్నర్‌కు పంపి నెలలు గడుస్తున్నా వాటిని ఆమోదించలేదు. సెప్టెంబర్ 30 లోపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని హైకోర్టు ఆదేశించడంతో కెసిఆర్ చేసిన చట్టాన్ని సవరిస్తూ ఆర్డినెన్స్‌ను రూపొందించి, గవర్నర్ ఆమోదం కోసం పంపగా, అది కూడా రాష్ట్రపతి వద్దే పెండింగ్‌లో ఉంది" అని ముఖ్యమంత్రి ప్రస్తావించారు.

కాంగ్రెస్ పార్టీలోకి రేవంత్ రెడ్డి రాకముందు ఒక లెక్క, రేవంత్ వచ్చిన తర్వాత ఒక లెక్క. నిత్యం గొడవలు, పార్టీ ఫిరాయింపులతో అచేతనావస్థలో ఉన్న పార్టీని తనదైన శైలిలో ఉత్తేజం నింపి,అన్నీ తానే అయి కాంగ్రెస్ పార్టీని ఆయన అధికారంలోకి తీసుకువచ్చారు. తెలంగాణలో కాంగ్రెస్ పనైపోయిందన్న వారికి, తన వ్యూహాలతో సమాధానం చెప్పారు. తనకంటూ ఒక మాస్ ఫాలోయింగ్‌ను ఏర్పాటు చేసుకొని విమర్శలు, స్వపక్షం నుంచే వ్యతిరేకత, కేసులు వంటి ఒడిదొడుకులను ఎదుర్కొని నిలబడినట్లు ముఖ్యమంత్రి పనితీరు గురించి కొందరు విశ్లేషిస్తున్నారు. తెలంగాణ ఇచ్చిన కాంగ్రెస్‌కు పదేళ్ల పాటు జరిగిన పరాభవాన్ని అసెంబ్లీ ఎన్నికల్లో గెలుపుతో రేవంత్‌రెడ్డి తుడిచి పెట్టినట్టు ఎఐసిసి వర్గాల్లో ఒక టాక్ ఉంది. మొత్తమ్మీద 'సామాజిక న్యాయ' సాధన లక్ష్యాన్ని ప్రకటించిన రాహుల్ గాంధీ మెచ్చుకునే రీతిలో నిర్వహించిన 'కులగణన' తెలంగాణ రాజకీయాల్లో 'గేమ్ ఛేంజర్' గా రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.

## మానవ హక్కులు హరిస్తున్న మత విద్వేషాలు

మతం, కులం, విశ్వాసాలను పాటించడానికి రాజ్యాంగం హక్కులను కల్పించింది. కులమతాలు మన వ్యక్తిగత అంశాలు. కులమతాలు మానవాళి ఐక్యతకు, ప్రపంచ శాంతికి అడ్డుపడరాదు. మాట్లాడడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, విశ్వాసాలు పాటించడం, ఆచారాలను గౌరవించడం, పరమత సహనం కలిగి ఉండడం పౌర సమాజ కనీస కర్తవ్యం. ఏటా ఆగష్టు 22న మతం లేదా విశ్వాసం ఆధారంగా హింసాత్మక ఘటనల బాధితులను స్మరించుకునే అంతర్జాతీయ దినం పాటించాలని ఐరాస సర్వసభ్య సమావేశం తీర్మానించ డం హర్షదాయకం. మతం ఆధారంగా ఒక వర్గానికి చెందిన గృహాలను ధ్వంసం చేయడం, హింసాత్మక ఘటనలకు పూనుకోవడం, ఆస్తులు/వ్యాపారాలు/విద్యాలయాలు/సాంస్కృతిక కేంద్రాలు/ప్రార్థనా స్థలాలపై పలు రకాలుగా హింసాత్మక చర్యలకు పూనుకోవడం లాంటి సంఘటనలను తీవ్ర స్థాయిలో వ్యతిరేకించాలి, ఖండించాలి.

మైనారిటీల హక్కుల పరిరక్షణ, పరమత సహనం, మతం లేదా విశ్వాసాలను స్వేచ్ఛ గా వినియోగించుకునే హక్కులను కల్పించడం మానవాళి కనీస కర్తవ్యం. భావ ప్రకటన, మత విశ్వాసాలు పాటించడం, అభిప్రాయాలను వ్యక్తం చేయడం, శాంతియుతంగా సమావేశాలు నిర్వహించుకోవడం లాంటి అంశాలకు రాజ్యాంగం పూర్తి స్వేచ్ఛ కల్పించాలి.. ఒకరి మత విశ్వాసం మరొకరికి అడ్డు పడరాదు. ఇతరుల మత విశ్వాసాలను గౌరవించడం అలవాటు కావాలి. ఈ విధమైన పలు రకాల హక్కులు ప్రధానమైనవి, పరస్పరం బలీయమైనవి, ఒకదానితో మరొకటి సంబంధం కలిగి ఉన్నది. ఇలాంటి హక్కులకు భంగం కలిగితే శాంతియుత వాతావరణం వేడెక్కి వివాదాస్పద హింసాత్మక ఘటనలకు దారి తీస్తాయి. ఇటీవల 22 ఏప్రిల్ 2025 రోజున పహల్గాం దుర్ఘటనలో హిందూ మతస్తులపై పాకిస్థాన్ ముస్లిమ్ ఉగ్రవాదులు భయంకరమైన దాడిచేసి 26 మంది ప్రాణాలు బలిగొనడం చూసాం. ఈ దుర్ఘటన మతపరమైన హక్కులకు భంగం కలిగించడమే కాకుండా ఒక మతానికి చెందిన వారిని ఏరి కోరి కాల్చి వేయడం దురదృష్టకరం. మతం మానవత్వానికి అడ్డు కారాదు. విశ్వాసాలు మరొకరికి విశ్వాసాలకు భంగం కలిగించరాదు. ప్రపంచ మానవాళి శ్రేయస్సు కోరి మత విశ్వాసాలను వ్యక్తిగతంగా మాత్రమే పాటిస్తూ, మరొకరికి అడ్డు కాకుండా చూసుకోవాలి. పరమత సహనమే మంత్రంగా మన జీవితాలు సమైక్యతతో కొనసాగాలి. జాతి, కులం, మతం, విశ్వాసం, ఆచారం లాంటివి గౌరవించబడాలి. మన విశ్వాసాలు మరొకరి హక్కులకు భంగం కలిగించరాదని గమనించాలి. అన్నీ మరిచి మానవత్వమే సాధనంగా ప్రపంచ సమైక్యతకు పునాదులు వేయాలి, హింస లేని ప్రపంచ నిర్మాణం జరగాలి.

డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి, 9949700037

## సర్కార్ బడుల్లో రీడింగ్ క్యాంపెయిన్

తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ, పంచాయతీ రాజ్ బడు ల్లో నిర్వహిస్తున్న 'రీడింగ్ క్యాంపెయిన్' విద్యార్థులలో పఠనా శక్తిని పెంపొందిస్తుంది. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ, విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) సంయుక్త ఆధ్వర్యం లో విద్యార్థులలో పఠనా శక్తిని పెంచడానికి ఆగష్టు 20 నుండి జాతీయ అక్షరాస్యత దినోత్సవమైన సెప్టెంబర్ 5 వరకు ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాల్ల తెలుగు ఉపాధ్యాయులకు ఈ కార్యక్రమ నిర్వహణ బాధ్యతను అప్పగించారు. సెల్‌ఫోన్‌లు వచ్చిన తర్వాత పుస్తక పఠనం తగ్గిపోయిందని అనేకమంది విద్యావేత్తలు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు ఆవేదనను, ఆందోళనను వ్యక్తం చేస్తున్నారు. 'బుక్ కల్చర్ పోయి లుక్ కల్చర్' వచ్చింది. విద్యార్థులు సెల్ ఫోన్‌లకు పూర్తిగా బానిసలుగా మారుతున్నారు. గతంలో వచ్చిన మహమ్మారి కరోనా వైరస్ వల్ల ప్రభుత్వ, పంచాయతీ రాజ్, ప్రయివేటు పాఠశాలలు, విద్యాసంస్థలు మూతపడటం, ఆన్‌లైన్‌లో విద్యాబోధన కొనసాగించడం జరిగింది. కరోనా తర్వాత పాఠశాలలు, విద్యాసంస్థలు ప్రాంభమైనా సెల్‌ఫోన్ వాడ టం మాత్రం మర్చిపోవడం లేదు.



తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ఆధ్వర్యంలో వేసవి సెలవుల్లో తెలంగాణ రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ, పంచాయతీ రాజ్, గురుకుల, ఆదర్శ పాఠశాలలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణా తరగతులు నిర్వహించి విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, విద్యార్థులలో పఠనా శక్తిని పెంచడానికి, అభ్యసన ఫలితాలు సాధించడానికి, విషయ పరిజ్ఞానం పెంపొందించడానికి శిక్షణ ఇవ్వడం జరిగింది. విద్యార్థులందరికీ చదవడం రావాలి. చదివింది అర్థం చేసుకోవాలి. అర్థం చేసుకున్నది వ్యక్తీకరించడం వలన విద్యార్థులలో ఉపాధ్యాయులు ఆశించిన అభ్యసన ఫలితాలు సాధించడానికి అవకాశం ఉంటుంది.

**పాఠశాల గ్రంథాలయాలు:** పాఠశాల గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు. విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు ఇతర కథలు, నవలలు, నాటకాలు, దేశభక్తి గేయా లు, పాటలు, ఆధ్యాత్మిక పుస్తకాలు, నిఘంటువులు, పద్యాల పుస్తకాలు ఉండడం వల్ల అవి చదివే విద్యార్థులకు విస్తృతమైన పఠనం చేయడానికి అవకాశం ఉంది. విద్యార్థులకు కావాల్సిన పోటీ పరీక్షలకు కావలసిన మెటీరియల్స్, పుస్తకాలు అందుబాటులో ఉండడం వల్ల పేద, మధ్యతరగతి, బడుగు, బలహీన, ఎస్సీ, ఎస్టీ, బి.సి, ఇడబ్ల్యుఎస్, మైనారిటీ విద్యార్థులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుంది. విద్యార్థులకు పాఠశాల స్థాయిలో గ్రంథాలయాల్లో ఉన్న పుస్తకాలను చదివే అలవాటు కావడం వల్ల భవిష్యత్తులో ఉన్నత విద్యను అభ్యసించడానికి, పోటీ పరీక్షలకు ప్రిపేర్ కావడానికి ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ రాష్ట్ర విద్యా శాఖ, తెలంగాణ రాష్ట్ర విద్యా పరిశోధన శిక్షణ సంస్థ (ఎస్సీఈఆర్టీ) ప్రభుత్వ, పంచాయతీ రాజ్ పాఠశాలల్లో, ప్రభుత్వ విద్యా సంస్థల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి, విద్యార్థులలో పఠనాశక్తిని పెంపొందించడానికి చేస్తున్న కృషిపట్ల తల్లిదండ్రులు, ఉపాధ్యాయు సంతోషాన్నివ్యక్తం చేస్తున్నారు.

డాక్టర్ ఎస్.విజయ భాస్కర్, 9290826988

## జవాబుదారీతనానికి, పారదర్శకతకు పాతరేసిన ఎన్నికల కమిషన్

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశానికి సంరక్షకుడిగా ఒకప్పుడు ప్రపంచవ్యాప్తంగా కీర్తించబడిన భారత ఎన్నికల కమిషన్, ఇప్పుడు తప్పుడు కారణాల, నిర్ణయాల వల్ల తీవ్ర అపనమ్మకానికి గురవుతోంది. బీహార్‌లో 'ఓట్ల దొంగతనం' ఆరోపణలను పరిష్కరించడానికి ఆదివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో, ఎన్నికల కమిషన్ సందేహాలు నివృత్తి కంటే ఎక్కువ సందేహాలను లేవనెత్తి సమస్యను మరింత జటిలం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ రాహుల్ గాంధీ ఆరోపణలను 'నిరాధారమైనది' అని నిర్ద్వంద్వంగా తిరస్కరిస్తూ, అఫిడవిట్ లేదా జాతికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల నిర్వహణ, కమిషన్ నిష్పాక్షికత గురించి అనేక ప్రాథమిక ప్రశ్నలకు ఆయన సమాధానం ఇవ్వలేదు.

ఎన్నో ప్రశ్నలకు దాటవేసే ధోరణి కొనసాగింది, నీళ్లు నమలడం తప్ప చేయగలిగింది ఏమి లేదని సమాధానాలు దాటవేశారు. ఓటర్లకు భరోసా ఇవ్వడానికి బదులుగా ప్రధాన ఎన్నికల కమిషనర్ ప్రతిస్పందనలు లేకపోవడం చట్టబద్ధమైన ఆందోళనలతో పాల్గొనడానికి ఇష్టపడ ని సంస్థ ఇమేజ్‌ను చిత్రించాయి. వరద ప్రభావిత బీహార్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ఎందుకు అమలు పరుస్తున్నారు? ఎన్నికల సంవత్సరంలో అటువంటి సవరణకు వ్యతిరేకంగా కమిషన్ స్వంత మార్గదర్శకాల ఉల్లంఘన, ఎన్నికల జాబితా ఫార్మాట్లలో ఆకస్మిక మార్పులు, ప్రతిపక్ష నాయకులు గతంలో సమర్పించిన అఫిడవిట్‌లపై చర్య తీసుకోకపోవడం వంటి ప్రశ్నలు అన్నీ పక్కదారి పట్టాయి. ఓటరు ఐడి నకిలీ, బయోమెట్రిక్ భద్రతా ప్రమాణా లు లేకపోవడం మెషిన్‌రీ డబుల్ రోల్స్‌పై సుప్రీంకోర్టు ఆదేశాలపై జర్నలిస్టులు కమిషన్‌ను ఒత్తిడి చేశారు. ఎన్నికల విశ్వసనీయతకు కేంద్రంగా ఉన్న పదకొండు ప్రశ్నలకు ఎటువంటి సమాధానాలు రాలేదు. కమిషన్ పక్షపాత పద్ధతిలో వ్యవహరిస్తుందనే ప్రతిపక్ష ఆరోపణను తేలికగా తోసిపుచ్చలేము. ఎన్నికల కమిషన్ అధికారం రాజ్యాంగబద్ధమైనది మాత్రమే కాదు, నైతికమైనది కూడా అని గుర్తుంచుకోవడం ముఖ్యం. దాని విశ్వసనీయత రాజకీయ పోరాటాలకు అతీతంగా ఉండి, ప్రభుత్వాలు లేదా పార్టీలకు కాదు, ఓటరుకు సేవ చేయగల సామర్థ్యంపై ఆధారపడి ఉంటుంది. ఎన్నికల సమగ్రతకు కేంద్రంగా ఉన్న ప్రశ్నలను తప్పించుకోవడం ద్వారా, భారత ప్రజాస్వామ్యన్ని అపహాస్యం చేసినట్లు. పారదర్శకతను కోరుతున్న సమయంలో కమిషన్ ఆ విశ్వసనీయతను కోల్పోయే ప్రమాదం ఉంది. బీహార్ వివాదం ఒక విముక్త సంఘటన కాదు. ఓటర్ల జాబితాలను నిర్వహించడం, విధానపరమైన న్యాయాన్ని నిర్ధారించడం విశ్వసనీయ ఆరోపణలకు ప్రతిస్పందించడంలో కమిషన్ ప్రవర్తన ఒక రాష్ట్ర ఎన్నికల ఫలితాన్ని మాత్రమే కాకుండా, ఎన్నికల ప్రక్రియ చట్టబద్ధతను కూడా నిర్ణయిస్తుంది. 2004లో, రాబోయే ఎన్నికల కారణంగా ఎన్నికల కమిషన్ అరుణాచల్ ప్రదేశ్, మహారాష్ట్రలలో ఇలాంటి సవరణ చర్యలను వాయిదా వేసింది. ప్రజాస్వామ్యం హామీల ద్వారా మాత్రమే నిలవదు; ఇది నిష్కాపట్యత, జవాబుదారీతనంపై వృద్ధి చెందుతుంది.

కీలక అంశాలపై కమిషన్ మౌనం వహించడం తటస్థత కాదని అది తన బాధ్యతను వదులుకోవడమేనని గుర్తుంచుకోవడం మంచిది. విశ్వాసాన్ని పునరుద్ధరించడానికి, అది వాస్తవాలను రికార్డులో ఉంచాలి, దాని ప్రక్రియలను పూర్తిగా వివరంగా వివరించాలి రాజకీయ నాయకులు, పౌర ప్రజా సంఘాల నుంచి అది ఆశించే పరిశీలనకు లోబడి ఉండాలి.

ఎన్నికల కమిషన్ ఖ్యాతి కంటే ప్రమాదం అంచున ఉందని ప్రజలు భావిస్తే కష్టం. ఎన్నికలను భారత ప్రజాస్వామ్యానికి మూలస్తంభాలుగా చేసే నమ్మకం సమతుల్యత మధ్య వేలాడుతోంది. బీహార్ ఎన్నికలు దగ్గరపడుతున్న తరుణంలో, కమిషన్ ఒక ప్రెస్ మీటింగ్ పెట్టి తమ వైఫల్యాలను బహిర్గతపరుచుకుంది.

విమర్శకులతో చర్చకు బహిరంగంగా పాల్గొనాలి, రాజకీయ పార్టీలు కోరినట్లే తనను తాను పరిశీలించుకోవాలి. ఏదైనా తక్కువైతే, 'స్వేచ్ఛాయుతమైన, న్యాయమైన ఎన్నికలు' అనే పదబంధం ఒక వాస్తవికతగా కాకుండా ఒక ఆచార మంత్రంగా మారే ప్రమాదం ఉంది. సూర్యకాంతి ఉత్తమ క్రిమి సంహారక మందు. ప్రజాస్వామ్యంలో,ఎన్నికల కమిషన్ నీడ వెనుక దాక్కున్న అందరూ ఓడిపోతారు.

డా. ముచ్చుకోట సురేష్ బాబు

## రిమాండ్ ఖైదీ మృతి



**ప్రజాపక్షం/ నర్సంపేట:** నర్సంపేట సబ్ జైల్ ఓ రిమాండ్ ఖైదీ గురువారం మృతి చెందింది. స్థానికుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండ జిల్లా సుబేదారి పోలీస్టేషన్లో ఓ కేసులో నిందితురాలైన పెండ్యాల సుచరిత (36) నర్సంపేట సబ్ జైలుకు ఈనెల 13న రిమాండ్ నిమిత్తం తీసుకువచ్చారు. గురువారం ఉదయం బాత్రూం వెళ్లి ఒక్కసారిగా కుప్పకూలి కింద పడిపోయింది. వెంటనే జైలు సిబ్బంది నర్సంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆస్పత్రి వైద్యులు పరిశీలించి మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం తరలించారు. జైలు సిబ్బంది ఫిర్యాదు మేరకు నర్సంపేట టౌన్ సిఐ రఘుపతి రెడ్డి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేసినట్లు తెలిపారు. దీనిపై నర్సంపేట జైలర్ లక్ష్మి శృతిని వివరణ కోరగా సుచరిత ఉదయం బాగానే ఉందని ఒక్కసారి కింద పడిపోవడంతో ఆసుపత్రికి తరలించామని పోస్టుమార్టం అయితేనే పూర్తి వివరాలు అందుతాయన్నారు.

## యూరియా కోసం వచ్చి సొమ్మసిల్లిన రైతు

### తలకు గాయం.. ఆస్పత్రికి తరలింపు



**ప్రజాపక్షం /మరిపెడ:**యూరియా కోసం వచ్చి రైతు సొమ్మసిల్లి పడిపోవడంతో తలకు తీవ్ర గాయమైంది. ఈ ఘటన మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండల కేంద్రంలో బుధవారం చోటు చేసుకుంది. కుటుంబ సభ్యుల కథనం ప్రకారం. మండ లంలోని చిల్లంచర్ల గ్రామపంచాయతీ పరిధి లోని మల్లమ్మకుంట తండాకు చెందిన అజ్మీర లక్క, విజయ దంపతులకు 2ఎకరాల భూమి ఉంది. మండల కేంద్రంలో ఓ షాపులో యూరియా ఇస్తున్నారని తెలిసి భార్య భర్తలు వచ్చి లైన్లో నిలబడ్డారు. అయితే లక్క కు గతంలో పక్షవా తం ఉండగా ఈ క్రమంలో లైన్లో నిలబడి న వ్యక్తి ఒ క్కసారిగా సొమ్మసిల్లి మెట్ల పై నుంచి పడిపోవడంతో. దీంతో లక్క తల పగిలి రక్తస్రావం అయింది. పోలీస్ వాహనడ్రైవర్ సందీ ప్స్పందించిలక్కను ప్రభుత్వఆస్పత్రికితరలించారు.

## అవసరమైన యూరియా అందుబాటులో ఉంచాలని రైతులధర్నా



**ప్రజాపక్షం /మరిపెడ :**వానాకాలం సీజన్లో రైతులకు అవసరమైన యూరియాను అందుబాటులో ఉంచాలని సిపిఎం మరిపెడ నాయకులు బాణాల రాజన్న డిమాండ్ చేశారు. మరిపెడ పట్టణంలోని బస్టాండ్ సెంటర్ ఆగ్రోస్ రైతు సెంటర్ వద్ద రైతుల ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. ఈ సందర్భంగా రాజన్న మాట్లాడుతూ రాష్ట్రానికి కేంద్రం నుండి 9.80 లక్షల టన్నుల యూరియా కేటాయిస్తే 6.60 లక్షల టన్నులు మాత్రమే సరఫరా చేశారు. 4,23 లక్షల టన్నుల యూరియా లోటు ఏర్పడిందని అన్నారు. వానాకాలం సీజన్ కొనసాగుతుందని, రైతులు నారుమళ్ళు పోసుకొని నాట్లు వేసుకునేందుకు సిద్ధంగా ఉన్నారని, రైతులకు అవసరమైన యూరియా, డిఎపి, పురుగు మందు, కాంప్లెక్స్ ఎరువులను అందుబాటులో ఉంచాలని కోరారు. యూరియాను రైతులకు అందించాలని కోరారు. యూరియా కొరత లేకుండా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మార్పీ ధరలకే యూరియా అమ్మకాలు చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. ఎరువులపై కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు తగ్గించుకోవాలని ప్రయత్నాలు చేస్తుందని ఆ ఆలోచనను విరమించుకుని సబ్సిడీలను పెంచాలన్నరు. ఈ కార్యక్రమంలో రైతులు వెంకన్న, పాపయ్య, వెంకటయ్య, నెహ్రూ, దశ్రు, మలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమ పథకాలు సద్వినియోగం చేసుకోవాలి

### రాష్ట్ర దేవాదాయ శాఖమంత్రి కొండా సురేఖ



**ప్రజాపక్షం/ వరంగల్ :** ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగంచేసుకోవాలని రాష్ట్ర దేవాదాయ, అటవీ, పర్యావరణ శాఖ మాత్యులు కొండా సురేఖ అన్నారు. వరంగల్ తూర్పు నియోజకవర్గంలో రూ. 5. 87 కోట్ల వ్యయంతో చేపడుతున్న పలు అభివృద్ధి పనులకు గురువారం మంత్రి కొండా సురేఖ శంకుస్థాపన చేశారు. జిడబ్ల్యూఎంసీ ఆధ్వర్యంలో 15వ ఆర్థిక సంఘ, జనరల్ ఫండ్ నిధులు, ఎస్ఎఫ్సి పథకాల కింద రూ. 4.87 కోట్ల వ్యయంతో, బల్దియా పరిధి 32 వ డివిజన్ బిఆర్ నగర్లో బస్తి దవాఖాన, ఎన్ఎన్నగర్లో సిసి రోడ్లు, జ్యోతినగర్ లో సిసి రోడ్లు, అంబేద్కర్ భవన్ కమ్యూనిటీ హాల్, బీరన్నకుంట కమ్యూనిటీ హాల్ ఏర్పాటుకు, 28వ డివిజన్ బట్టల బజార్ వేంకటేశ్వర స్వామి దేవాలయంలో కిచెన్ షెడ్, 42 డివిజన్ రంగశాయిపేట లో నిర్మించనున్న అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ పనులకు, ఆర్అండ్బి ఆధ్వర్యంలో కోటి రూపాయల వ్యయంతో మాషుఖ్ రబ్బానీ దర్గా లో చేపట్టే అభివృద్ధి పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. అనంతరం కరీమాబాద్లో ఆదర్శ పరపతి సంఘ భవనంలో లబ్ధిదారులకు నూతన



రేషన్ కార్డులను మంత్రి అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ గుండు సుధారాణి, జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద, జిడబ్ల్యూఎంసి కమిషనర్ చాహాత్ బాజ్ పాయి, కార్పొరేటర్లు, రెవెన్యూ, బల్దియా ఇంజనీరింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

**మానసిక ఉల్లాసాన్ని, ఉత్సాహాన్ని పొందడానికి ఎగ్జిబిషన్ ఎంతో దోహదపడుతుంది**

మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని పొందడానికి ఎగ్జిబిషన్ ఎంతో దోహదపడుతుందని రాష్ట్ర దేవాదాయ, అటవీ శాఖ మంత్రివర్యులు కొండా సురేఖ అన్నారు. వరంగల్ నగరంలోని ఇస్లామీయ కళాశాల గ్రౌండ్ లో గురువారం కొండా సురేఖ ఎగ్జిబిషన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నిత్యం వృత్తి ఉద్యోగాలతో సతమతమౌతూ ఒత్తిడికి గురైయ్యేవాళ్ళు మానసిక ఉల్లాసాన్ని ఉత్సాహాన్ని పొందడానికి ఎగ్జిబిషన్ ఎంతో దోహదపడుతుందని అన్నారు. ఎంతో వ్యయ ప్రయాసలకు ఓర్చి తీర్చి దిద్దిన విమానం సెట్టింగ్ ను స్వాగత ద్వారం గా చాలా బాగా ఆకట్టుకుంటుందని ఎగ్జిబిషన్ నిర్వాహకులను అభినందించారు. ముఖ్యంగా పిల్లలకు ప్రత్యేకంగా విజ్ఞానము వినోదాన్ని పంచే ఐటమ్స్ ఏర్పాటు చేయాలని నిర్వాహకులకు సూచనలు అందజేస్తూ ఈ విషయం పై జిల్లా కలెక్టర్ తో కూడా మాట్లాడుతానని ఆమె అన్నారు. నిర్వాహకులు అస్లాం మాట్లాడుతూ వరంగల్ నగర ప్రజలకు వినోదం ఉల్లాసం ఉత్సాహాన్ని అందించడానికి బారీ సెట్టింగ్ లతో విమానం ప్రధాన ముఖద్వారంగానే కాకుండా దుబాయ్, ఇతర దేశాల్లో పర్యటించిన అనుభూతి కలిగించే సెట్టింగులను ఎంతో ఆకర్షనీయంగా ఏర్పాటు చేశామన్నారు, దేశంలోని నలుమూలల నుండి వచ్చిన వివిధ రకాల చేతివృత్తుల కలంకారీ వస్తువులు, స్త్రీ అలంకరణ వస్తువులు, గృహోపకరణాలు, పిల్లలకు బొమ్మలు, ఇతర రకరకాల వందకు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశామని, పిల్లలను పెద్దలను ఉల్లాసం ఉత్సాహం పరిచే ఇటాలియన్ టైప్ బారీ అమ్యూజ్మెంట్ పార్క్ లో రెంజర్, జైంట్ వీలు తదితర అనేక ఐటమ్స్ ఏర్పాటు చేశామని అంతేకాక నోరూరించే డిల్లీ పాపడ్, సిమ్లా మిర్చి, కలకత్తా చాట్ బండార్, శీతల పానీయాలు ఐస్క్రీమ్ లు ఏర్పాటు చేశామని చెప్పారు , ఈ ఎగ్జిబిషన్ ప్రతిరోజూ సాయంత్రం 5 గంటల నుండి రాత్రి 10 గంటల వరకు ప్రదర్శన ఉంటుందని అస్లాం వివరించారు. ఈకార్యక్రమానికి నిర్వాహకులు శ్రీ కాంత్, మీర్జా రఫీక్ బేగ్, మేనేజర్లు ఫిరోజ్, డేవిడ్, శ్రీ పాల్ రెడ్డి, స్థానిక కాంగ్రెస్ నాయకులు పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## తండ్రి బాటలోనే తనయుడు

### సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలలో అరుదైన సంఘటన




**ప్రజాపక్షం /ఎల్కతుర్తి:** గత కొన్ని సంవత్సరాలుగా ఎల్కతుర్తి మండలం, గోపాల్ పూర్ గ్రామం నుండి సిపిఐ పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తు క్రియాశీలకంగా ఎదిగిన కమ్యూనిస్టు పార్టీ లీడర్ వుట్కూరి రాములు. హనుమకొండ జిల్లా సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా కొనసాగుతున్నారు.. ఈ తరుణంలో సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4 వ మహాసభలు ఆగస్టు 20 నుండి 22 వరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా, గాజులరామారం మహారాజ ఫంక్షన్ హాల్లో జరుగుతున్న మహాసభలో, తండ్రి తో పాటు ఇటీవల క్రియాశీలకంగా హనుమకొండ జిల్లా ఏఐఎస్ఎఫ్ అధ్యక్షునిగా పనిచేస్తున్న వుట్కూరి ప్రణీత్ గౌడ్ ప్రతినిధిగా ఎన్నికై మహాసభలో తండ్రి తో పాటు పాల్గొనడంతో తండ్రితో పాటు ఈ తరంలో కమ్యూనిస్టు పార్టీలో పనిచేసి, ఒకే మహాసభలో ఇద్దరు ఒకేసారి పాల్గొనడంతో హనుమకొండ జిల్లా ప్రజలు పార్టీ నాయకులు పలువురు అభినందించారు.

## పెంచిన పెన్షన్స్ అమలు చేయాలంటూ 'చలో హైదరాబాద్'

### వికలాంగుల హక్కుల పోరాట సమితి జిల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి



**ప్రజాపక్షం/గూడూరు;**ఎన్నికల్లో హా మీ ఇచ్చి పెంచిన పెన్షన్ అమలు చే యాలని డిమాండ్ చేస్తూ తల పెట్టిన చ లో హైదరాబాద్ ను విజయవంతం చే యాలని ఎంఎస్పి పాశం సాంబయ్య వి కలాంగుల హక్కుల పోరాట సమితి జి ల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి పిలుపు నిచ్చారు.గురువారం మహబూబాబాద్ జి ల్లా గూడూరు మండలం అయోధ్యపుర ంలో వృద్ధులు వితంతువులు గీత కార్మికులు వికలాంగుల సమావేశం నికీ మ ండల అధ్యక్షుడు గుర్రం ప్రభాకర్ అధ్యక్షతన జరిగింది.ఈకార్యక్రమానికీ ము ఖ్యఅతిథిగా హాజరై ఎంఎస్సి రాష్ట్ర నా యకలు పాశం సాంబయ్య మానుకోట వికలాంగుల హక్కుల పెరాట సమితి జి ల్లా కార్యదర్శి రుద్ర తిరుపతి మాట్లాడు తూ 6000 వేల వృద్ధులకు వితంతువులకు చేనేత కార్మికులకు 4000 వేల రూ పాయాలు వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు.సెప్టెంబర్ 9 తేదీన దీ న్ని నిరసిస్తూ చలో హైదరాబాద్ మహాగర్జన సభ నిర్వహించడం జరుగుతుందని ఈసభకు భారీ ఎత్తున వికలాంగులు వృద్ధులు వితంతువులు అధిక సంఖ్యలో పాల్గోన్ని విజయవంతం చేయాలని వారు పిలుపు నిచ్చారు.అకార్యక్రమంలో నాయకలు శ్రీరాములు ముక్తేశ్వర్గౌడ్ వెంకన్న లక్ష్మ ణ్ బిక్షపతి వీర స్వామి కోండయ్య తదితరులు పాల్గొన్నారు.

## గురుకుల హాస్టల్లో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలి: కలెక్టర్

### సాంఘిక సంక్షేమ గురుకులాన్ని తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్



**ప్రజాపక్షం/హనుమకొండ:** గురుకుల హాస్టల్ లో సౌకర్యాలు మెరుగ్గా ఉండాలని, విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూసుకోవాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ అన్నారు.గురువారం హనుమకొండ జిల్లా కాజీపేట మండలం మడికొండ శివారులోని తెలంగాణ రాష్ట్ర సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, కళాశాలను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భం గా హాస్టల్లోని డైనింగ్ హాల్, ప్రాంగణం, స్టోర్ రూమ్, తరగతి గదులను కలెక్టర్ పరిశీలించారు. హాస్టల్ నిర్వహణకు సంబంధించిన పలు రికార్డులను జిల్లా కలెక్టర్ తనిఖీ చేశారు. కిచెన్ రూమ్ లో కూరగాయలు, పప్పులు, వంట నూనెలు, తదితర నిత్యావసరాలను కలెక్టర్ తనిఖీ చేసి తాజా కూరగాయలు, నాణ్యమైన వంట పదార్థాలను వంటల్లో వినియోగించాలన్నారు. డైనింగ్, వాష్ ఏరియా ఎప్పుడు కూడా పరిశుభ్రంగా ఉండాలన్నారు. తరగతి గదులను పరిశీలించిన కలెక్టర్ ఇంటర్మీడియట్ ఎంపీసీ, బైపీసీ విద్యార్థులతో మాట్లాడారు. ఎంసెట్, నీట్ వంటి పోటీ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించాలని కలెక్టర్ విద్యార్థులతో అన్నారు. దీనిపై పలువురు విద్యార్థులు పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే పుస్తకాలు కావాలని కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పోటీ పరీక్షల పుస్తకాలను అందజేస్తానని అన్నారు. విద్యార్థులలో చాలామంది ఇంజినీరింగ్, వైద్య సీట్లను తప్పనిసరిగా సాధించాలన్నారు. అదేవిదంగా ఆర్ట్ రూంలో విద్యార్థులు వేసిన పెయింటింగ్స్ బాగున్నాయని కలెక్టర్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా సమన్వయ అధికారి దాసరి ఉమామహేశ్వరి, కాజీపేట తహసీల్దార్ భావ్ సింగ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాల్లో ఎఒ ఆకస్మిక తనిఖీ



**ప్రజాపక్షం/దేవరుప్పుల :** మండలంలోని వివిధ ఎరువుల దుకాణాలను మండల వ్యవసాయ అధికారి బజ్జూరి దివ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగామాట్లాడుతూ ఎరువుల షాపులలో యూరియా 62.64 ట న్నుల నిల్వలు కోలుకొండ, సింగరాజుపల్లి, దేవరుప్పులలో దుకాణాలలో అ oదు బాటులో ఉన్నాయన్నారు. యూరియా లిక్విడ్ రూపంలో (నానో) ఎకరానికి 1 లీటర్ 2 సార్లు స్ప్రేచేస్తే ఒక బస్తా యూరియా వేసిన దానితో సమానమని రైతులు గమనించాలన్నారు.కోల్కొండఎ ఇఒసఫియా, రైతులు పాల్గొన్నారు.

## భూ భారతి కోసం సర్వేయర్లకు శిక్షణ



**ప్రజాపక్షం / నల్లబెల్లి :**లంగాణ రాష్ట్ర ప్రభుత్వం గ్రామాలలో భూ సమస్యలను పరిష్కరించేందుకు భూ భారతిని తీసుకువచ్చి సర్వేయర్లను ఎంపిక చేసి శిక్షణ ఇస్తుందని వరంగల్ జిల్లా నల్లబెల్లి సర్వేయర్ మేకల మల్లయ్య అన్నారు . గురువారం మండలంలోని పంతులుపల్లి గ్రామంలో ఇద్దరు రైతుల భూముల వద్ద ఉన్న తేడాలను గుర్తించేందుకు కొత్త సర్వేయర్లతో సర్వే కార్యక్రమం చేపట్టారు . అఈ సందర్భంగా సర్వేయర్ మల్లయ్య మాట్లాడుతూ నల్లబెల్లి మండలానికి 20 మంది సర్వేయర్లకు శిక్షణ ఇచ్చేందుకు జిల్లా అధికారులు ఆదేశాలు ఇచ్చినట్లు చెప్పారు . భూ భారతిలో ధరఖాస్తు పెట్టుకున్న ప్రతి రైతు భూమిలో ఉన్న సమస్యను పరిష్కరించేందుకు మండల అధికారులు కృషి చేస్తున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో నూతన సర్వేయర్లు ,రైతులు ఇంతల అనంతరెడ్డి , ఏడాకుల రవింధర్రెడ్డి ,కూస కొంరెల్లి , నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు .

## బాలబాలికల సంరక్షణ సామాజిక బాధ్యత

### జనగామ జిల్లా కలెక్టరేట్ రిజ్వాన్ బాష షేక్



**ప్రజాపక్షం / జనగామ:**బాలల బాలికల సంరక్షణ సామాజిక బాధ్యత అని, మానవ అక్రమ రవాణాపై అవగాహన కలిగి ఉండాలని జనగామ జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ అన్నారు. గురువారం బాల బాలికల రక్షణ, మానవ అక్రమ రవాణాపై ప్రజ్వల ఎన్జిఓ ఆధ్వర్యంలో ఏకశిల బిఈడి కళాశాలలో జిల్లా రిసోర్స్ పర్సన్కి అవగాహన సదస్సు జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాష షేక్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని ప్రతి చిన్నారి రక్షణ ప్రతిఒక్కరి ప్రథమ కర్తవ్యంగా అందరు పరిగణించాలన్నారు. చిన్నారుల ప్రాథమిక అవసరాలు తీరుస్తూనే శారీరక, మానసిక లేదా, లైంగిక వేధింపులకు గురికాకుండా చూసుకోవడం అత్యంత ప్రాధాన్యతమనానరు. పిల్లలకు విద్య, వైద్యం ఆహారం, ఆశ్రయం పొందే హక్కు ఉందని, వారు హింస, దోపిడి అక్రమ రవాణాకు గురి కాకుండా చూసుకోవల్సిన బాధ్యత ఉందన్నారు. బాలల రక్షణకు అధికారుల కృషితో పాటు సమాజం నుండి కూడా సహకారం తప్పనిసరిగా ఉండాలన్నారు. వివిధ కార్యక్రమాల ద్వారా బాల బాలికల సంరక్షణ కోసం ఉన్న చట్టాలు, విధానాలను రక్షణ సేవలను హక్కుల గురించి అవగాహన కల్పించాలన్నారు. బాలల రక్షణ, విద్యార్థి దశలో కిష్టమైనదని, బాల, బాలికలు 412 సంవత్సరాల పాటు పాఠశాలలో గడుపుతారని, అందుకని పాఠశాల యాజమాన్యం, పిల్లల తల్లిదండ్రులు వారి రక్షణ కోసం ప్రధాన భూమికను నిర్వయించాలన్నారు. బాల బాలికలు సమాజిక భద్రతా ప్రయోజనాలను అనుభవించాలని, ఆరోగ్యంగా పెరగడానికి అభివృద్ధి చెందడానికి ప్రతి ఒక్కరు తమ వంతుగా బాధ్యత వహించాలన్నారు. అన్ని రకాల నిర్లక్ష్యం, క్రూరత్వం, దోపిడీల నుండి బాలలకు రక్షణ కల్పించాలని, ఏ రకమైన అక్రమ రవాణాకు వారు గురికాకుండ చూసుకోవావల్సిన అవసరం ఉందన్నారు. ఈ అవగాహన సదస్సులో అభ్యసించిన అంశాలను కాంప్లెక్స్ సమావేశాలు, తల్లి దండ్రులతో జరిగే సమావేశాలలో చర్చించి వారికి కూడా అవగాహన కల్పించాలన్నారు. మానవ అక్రమ రవాణ ఏ విధఃగా జరుగుతుంది, ఎటువంటి జాగ్రత్తలు తీసుకోవాలి, ఆసాంఘిక కార్యక్రలాపాలకు పాల్పడే వారి బారీన పడకుండా ఎలా జాగ్రత్తగా ఉండాలి, అనుమానిత వ్యక్తులు కనిపిస్తే ఏం చేయాలి, మానవ అక్రమ రవాణా నిరోధ అంశాలపై ప్రతి పాఠశాల, కళాశాలలో, సమాజిక కార్యక్రమాల్లో అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో కోర్స్ కోఆర్డినేటర్ శ్రీనివాస్, జిసిడిఓ గౌసియాబేగం, సెంటర్ ఇంచార్జీ మల్లిఖార్జున్, ప్రజ్వల ఎన్జీవో ప్రతినిధులు అంబర్సింగ్, కృష్ణవేణి, రిసోర్స పర్సన్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్ర రాష్ట్ర పక్షపాత వైఖరి వల్లే రాష్ట్రానికి యూరియా కొరత

### ఎంసిపిఐయు జిల్లా సహాయ కార్యదర్శి నూకల ఉపేందర్




**ప్రజాపక్షం/గూడూరు;**కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల పక్షపాత వైఖరికీ నిదర్శనమే యూరియా కోరత అని కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైతులకు యూరియా సప్లై చేయాల్సిన వారు చోద్యం చూస్తున్నట్లు చూ స్తున్నారని రైతులు తెల్లవారుజామునే పిఏసిఎస్ సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి నూకల ఉపేందర్ అన్నారు. గురువారం మహబూబాబాద్ జిల్లా గూడూరు మండల కేంద్రంలో ఎంసిపిఐయు పార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం జరిగింది ఈ కార్యక్రమానికీ ముఖ్యఅతిధిగా హాజరైన ఉపేందర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ సమర్థత వలన కేంద్ర ప్రభుత్వ పక్షపాతి వైఖరి వల్ల రాష్ట్ర రైతులకు సరిపడా యూరియా సకాలంలో అందించడంలో పూర్తిగా వైఫల్యం చెందారని అన్నారు.రాష్ట్ర వ్యాప్తింగా తొమ్మిది లక్షల మెట్రిక్ టన్నుల యూరియా అవసరం ఉండగా కేవలం 3 మెట్రిక్ టన్నుల యూరియా సరఫరా అయిందని అదే కాకుండా ఈ యూరియా కోసం తెల్లవారి జామున రైతులు పిఏసిఎస్ సెంటర్ల వద్ద పడికాపులు కాస్తూ క్యూలైన్ ను కట్టిన లైన్లో నిలిచిన రైతులందరికీ యూరియా అందకపోవడం బాధాకరమని అన్నారు.రైతులు వరి మొక్కజోన్న పత్తి ఇతర పంటలకు యూరియా అందకపోవండం బాధాకరమన్నారు. మన రాష్ట్రం నుండి ఎనిమిది మంది బిజేపి ఎంపీలు అందులో ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రాతినిథ్యం వహిస్తున్న ప్పటికి రాష్ట్ర రైతన్నకీ మూరియా కావాలని తెలంగాణ రైతల పక్షాన మాట్లాడకపోవడం శోచనీయమని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తెచ్చి రైతులకు సరిపడా యూరియా అందించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.వర్షాకాలంలో సీజన్ల్ వ్యాధులు నివారణ కోసం గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్యాంపేలు ఏర్పాటు చేయాలని ప్రజలకు డెంగి మలేరీయ తదితర విషజ్వరాలు సంభవించి ఇబ్బందులు పడతిరని వెంటనే ఆ గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ క్యాంపులు ఏర్పాటు చేసి ప్రభుత్వం వైద్యం మందులు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని అన్నారు.ఈకార్యక్రమంలో నాయకలు పాల్గొన్నారు.

## సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించిన కేంద్ర అధికారి



**ప్రజాపక్షం/మహాదేవ-పూర్;**మండల కేంద్రం లోని సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని కేంద్ర నోడల్ అధికారి డాక్టర రమణ గురువారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆసుపత్రిలో ఓపి,ఐపి విభాగాలతో పాటు ప్రసూతి గ ది,వార్డులు,దయాలసిస్ కేంద్రాన్ని పరిశీలించారు.అనంతరం రోజు ఎంత ఓపి వస్తుందని,ఎంతమంది దయాలసిస్ రోగులు వస్తున్నారని, మరింత మె రుగైన వైద్యం కోసం రోగులను ఎక్కడికి రెఫర్ చేస్తారని ఆసుపత్రి సూపరింటెండెంట్ విద్యావతిని అడిగి తెలుసుకున్నారు.రోగులకు మెరుగైన చికిత్స అందించాలని రోగుల పట్ల తగు జాగ్రత్తు పాటించాలని అన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్సివిబిడిసి ప్రోగ్రాం అధికారిణి డాక్టర్ ఉమాదేవి,జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి ప్రమోద్ కుమార్,ఎన్సిడి ప్రోగ్రాం అధికారి సందీప్,డిపిఎంఒ చిరంజీవి,వైద్యురాలు సుస్మిత,ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

## సిజిహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ను ప్రారంభించాలని వినతి

### కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఎంపి కడియం కావ్య



**ప్రజాపక్షం/హనుమకొండ :** కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జె.పి. నడ్డాను గురువారం వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మర్యాదపూర్వకంగా కలిశారు. వరంగల్లో ఇప్పటికే ఆమోదం పొందిన సీజీహెచ్ఎస్ వెల్నెస్ సెంటర్ ను త్వరితగతిన ప్రారంభించాలని కేంద్ర మంత్రికి వినతి పత్రం అందజేసి ఎంపివిజ్ఞప్తి చేశారు.ఈ సందర్భంగా వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య మాట్లాడుతూ, వరంగల్లో వేలాది మంది కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, వారి కుటుంబ సభ్యులు ఉన్నారని, వరంగల్ లో సీజీహెచ్ఎస్ సౌకర్యాలు లేకపోవడం వల్ల వారు హైదరాబాద్ లేదా ఇతర నగరాలకు వెళ్లి చికిత్స పొందాల్సి వస్తోందని తెలిపారు. ఇది వృద్ధులు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతున్నవారు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వరంగల్ఎంపి డాక్టర్ కడియం కావ్య కేంద్రమంత్రికి వివరించారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే వరంగల్లో సీజీహెచ్ఎస్ సెంటర్కు ఆమోదం తెలిపిందని, కానీ ఇంకా ప్రారంభం కానందు వల్ల ఉద్యోగులు, పెన్షనర్లు నష్టపోతున్నారని ఎంపి కడియం కావ్య తెలిపారు. వెంటనే వరంగల్ సీజీహెచ్ఎస్ లో వైద్య సిబ్బంది నియామకం చేపట్టి, శాశ్వత భవనం కేటాయించి సెంటర్ను ప్రారంభించాలని ఎంపికేంద్ర మంత్రి జె.పి. నడ్డాను కోరారు.యువతకు వ్యాపార అవకాశాలు కల్పించాలని పార్లమెంట్ లో ప్రశ్నించిన ఎంపి కడియం కావ్య ప్రధాని ఉపాధి కల్పన పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో చిన్న చిన్న వ్యాపారాలు పెరుగుతున్నాయని, ఇందులో ఎస్సీ యువతకు ఎక్కువ సబ్సిడీలు కల్పించడం వల్ల వారికి వ్యాపారం చేయడం సులభమవుతుందని వరంగల్ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య అన్నారు. ఎస్సీ, ఎస్టీ హబ్ గా ఉన్న వరంగల్ లో ప్రధాని ఉపాధి కల్పన పథకం ద్వారా యువతకు శిక్షణ, నైపుణ్యాలు, మార్కెట్ అవకాశాలు, ప్రభుత్వ కొనుగోళ్లలో భాగస్వామ్యం కల్పిస్తే యువత ఆర్థికాభివృద్ధికి ఎంతగానో తోడ్పడుతుందని అన్నారు. కడియం కావ్య అడిగిన ప్రశ్నకు సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే ఈ మేరకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు. ప్రధాని ముద్రా యోజన పథకం ద్వారా వడ్డీ లేకుండా 20 లక్షల రూపాయల వరకు రుణాలు లభ్యమవుతున్నాయని తెలిపారు.అయితే, వరంగల్లో ఇన్నోవేషన్ కోసం అవసరమైన ఇంక్యుబేషన్ సెంటర్ లేకపోవడంపై వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య నిరాశ వ్యక్తం చేశారు. వరంగల్ లో ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు కోసం తాను నిరంతరం కృషి చేస్తానని ఎంపీ డాక్టర్ కడియం కావ్య స్పష్టం చేశారు.

## వెనువెంటనే దరఖాస్తుల పరిష్కారం



**ప్రజాపక్షం/జఫర్గడ్:** రెవెన్యూ సదస్సులలో రైతులు చేసుకున్న దరఖాస్తులను వెంటవెంటనే పరిష్కరించాలని స్టేషన్ఘనపూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. గురువారం మండల కేంద్రంలోని తహశిల్దార్ కార్యాలయాన్ని స్టేషన్ఘనపూర్ ఆర్డిఒ డిఎస్ వెంకన్న ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రెవెన్యూ సదస్సులలో వచ్చిన దరఖాస్తులు, కళ్యాణలక్ష్మి, ఎన్ఎఫ్బిఎస్, మీ సేవ సర్టిఫికెట్లపై సమీక్ష నిర్వహించారు. ఎప్పటికపుడు పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. పనులలో ఎవరు నిర్లక్ష్యం వహించరాదన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ బలరాం, స్థానిక తహసీల్దార్ బి రాజేష్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## కేంద్ర మంత్రిని కలిసిన ఖమ్మం ఎంపి

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌ను ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి గురువారం కలిశారు. తెలంగాణ కాంగ్రెస్ ఎంపిలు చామల కిరణ్‌కుమార్‌రెడ్డి, సురేష్ షెట్కర్‌తో కలిసి ఎంపి రామసహాయం రఘురాం రెడ్డి కేంద్ర మంత్రిని కలిశారు.
ఈ సందర్భంగా ప్రధాన మంత్రి కృషి సించాయ్ యోజన (పిఎంకెఎస్‌వై) క్రింద అన్ని జిల్లాలకు ప్రాజెక్టులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. నీటిపారుదల సంరక్షణ చర్యలు చేపట్టాలని, స్థిరమైన గ్రామీణాభివృద్ధికి సహకారం అందించాలని కోరారు.

## రేపు జాబ్‌మేళా నిర్వహణ

**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** జిల్లాలోని నిరుద్యోగ యువతీ, యువకులకు ప్రైవేట్ రంగం ఖమ్మం రిలయన్స్, నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్, భారత్ హ్యూండాయ్‌లో ఉద్యోగాలు కల్పించుటకు ఆగస్టు 23 శనివారం జాబ్‌మేళాను నిర్వహిస్తున్నట్లు జిల్లా ఉపాధి అధికారిణి ఎన్. మాధవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మోడల్ కెరీర్ సెంటర్ (ప్రభుత్వ ఐటిఐ ఖమ్మం నందు శనివారం ఉదయం 10 గంటలకు జాబ్‌మేళా జరుగుతుందన్నారు. ఖమ్మం జిల్లాలో పనిచేసే విధంగా రిలయన్స్, నిప్పాన్ లైఫ్ ఇన్సూరెన్స్‌లో లైఫ్ ప్లానింగ్ ఆఫీసర్ పోస్టులకు ఏదైనా డిగ్రీ అర్హత గల 25 నుండి 45 వయస్సు గల మహిళలు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి రూ. 20వేల నుండి రూ. 25వేల వరకు వేతనం ఉంటుందని తెలిపారు. భారత్ హ్యూండాయ్ ఖమ్మం, సత్తుపల్లి, మధిరలో సేల్స్ కన్సల్టెంట్ ఉద్యోగాల ఖాళీలకు ఏదైనా డిగ్రీ, ఎంబిఏ అర్హత కలిగి టూ వీలర్ వాహన లైసెన్స్ అర్హత కలిగిన 24 నుండి 32 సంవత్సరాల వయస్సు గల యువకులు అర్హులని తెలిపారు. ఎంపికైన వారికి వేతనం రూ. 18వేలు ఉంటుందని తెలిపారు. విద్యార్హత సర్టిఫికెట్ జిరాక్స్ కాపీలతో జాబ్‌మేళాకు అర్హత గల యువతీ, యువకులు హాజరు కావాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి తెలిపారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా మంజూరైన చెక్కులను లబ్దిదారులకు పంపిణీ చేశారు. ఖమ్మం పార్లమెంటు సభ్యులు రామసహాయం రఘురాంరెడ్డి సిఫారసు మేరకు 120 మంది లబ్ది దారులకు మంజూరైన రూ. 43 లక్షల విలువ గల చెక్కులను గురువారం గట్టయ్య సెంటర్‌లోని ఎంపి క్యాంపు కార్యాలయంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌సి బాలసాని లక్ష్మినారాయణ మాట్లాడుతూ ఎంపి ప్రత్యేక శ్రద్ధతో అనారోగ్యాలతో ఇబ్బందులు పడుతున్న వారికి ఆర్థిక భరోసా కల్పించేందుకు ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి నిధులు మంజూరు చేయించారని తెలిపారు. ఎంపి రామసహాయం రఘురాంరెడ్డికి లబ్దిదారులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కొప్పుల చంద్రశేఖర్, మాజీ ఎంపిపి గోసు మధు, భూక్యా బాలాజీ, మిక్కిలినేని నరేంద్ర, ఉమ్మినేని కృష్ణయ్య, ఇమ్మడి తిరుపతిరావు, సొసైటీ ఛైర్మన్ చెరుకుమల్లి రవి, మల్లెల నాగేశ్వరరావు, కన్నెబోయిన సీతారామయ్య, షేక్ మజీద్, గౌస్, ఉమర్, కాంపాటి వెంకన్న, వెంకట్రావు, ఏనుగు మహేష్, నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

## యూరియా సరఫరా కేంద్రాలు పెంచాలి



**ప్రజాపక్షం/ కొణిజర్ల :** కొణిజర్ల మండలం గోపవరం సొసైటీ పరిధిలో యూరియా సరఫరా కేంద్రాలు నాలుగు పెంచాలని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, సీనియర్ నాయకులు కొప్పుల కృష్ణయ్య లు డిమాండ్ చేశారు. గురువారం గోపవరం సొసైటీ వద్ద రైతులు యూరియా సరఫరా కేంద్రాలు పెంచాలని నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలో గోపవరం సొసైటీ పెద్ద సొసైటీగా ఉందని కొణిజర్ల మండలం ఒకే సొసైటీగా ఉండటం వల్ల వంద మంది రైతులు సొసైటీ ఎదుట క్యూలైన్‌లో నిలబడి ఇబ్బందులు పడుతున్నార న్నారు. పెద్ద మునగాల, తీగలబంజర, తనికెళ్ల, గుబ్బగుర్తిలో యూరియా సరఫరా కేంద్రాలు వ్యవసాయ శాఖ, సొసైటీ ద్వారా అదనంగా ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. బయోమెట్రిక్ వేలిముద్రలు పడక రైతులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వ్యవసాయ డివిజన్ అధికారి కరుణ, మండల వ్యవసాయ అధికారి బాలాజీ, సొసైటీ ఛైర్మన్ చెరుకుమల్లి రవి లు మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు చింతనిప్పు చలపతిరావు, సొసైటీ డైరెక్టర్ సంక్రాంతి నర్సయ్య, రైతు సంఘం మండల కార్యదర్శి ఎర్రమల మాధవరెడ్డి, అనుమోలు కృష్ణయ్య, దుగ్గిని ఉపేందర్, నర్సింహారావు, నరేష్, పెద్ద సంఖ్యలో రైతులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ శాఖల్లోని ఉద్యోగ ఖాళీలను భర్తీ చేయాలి



**ప్రజాపక్షం/ కొణిజర్ల :** తెలంగాణ ప్రభుత్వం ప్రభుత్వ శాఖల్లోని ఖాళీలన్నింటిని వెంటనే భర్తీ చేయాలని భారత కమ్యూనిస్టు పార్టీ కొణిజర్ల మండల కార్యదర్శి గడల భాస్కర్‌రావు తీర్మానం ప్రవేశపెట్టారు. మేడ్చల్ జిల్లా బాల మల్లేష్ హాల్‌లో జరుగుతున్న భారత కమ్యూనిస్టు పార్టీ 4వ రాష్ట్ర మహాసభల్లో ఆయన తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. రాష్ట్ర ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లుగా వ్యవహరిస్తుందని ముఖ్యంగా విద్య, వైద్య రంగాల్లో ఖాళీలను నింపకపోవడం వల్ల విద్యార్థులు, ప్రజలు అనేక ఇక్కట్లకు గురవుతున్నారన్నారు. వెంటనే లక్షలాది మంది నిరుద్యోగులు ఆశతో ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్నారన్నారు. ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ తీర్మానం ప్రవేశపెట్టారు. రెండవ తీర్మానంగా ఉద్యోగ విరమణ పొందిన ప్రభుత్వ ఉద్యోగులకు రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ వెంటనే అందజేయాలని కోరుతూ, ఉద్యోగ విరమణ పొందిన ఉద్యోగులు దాచుకున్న నగదును కూడా వారి వారి అవసరాల కోసం వెంటనే విడుదల చేయాలని, బకాయిపడ్డ ఐదు డిఎ బకాయిలను వెంటనే విడుదల చేయాలని, పిఆర్‌సిని వెంటనే ప్రకటించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ నాల్గవ రాష్ట్ర మహాసభ సందర్భంగా ప్రతినిధుల సమక్షంలో తీర్మానాన్ని ప్రవేశపెడుతూ మహాసభని ఆమోదించమని కోరారు.

## చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పిఆర్‌టియు ఆధ్వర్యంలో చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్‌ను ఆవిష్కరించారు. సెప్టెంబర్ ఒకటి పెన్షన్ విద్రోహ దినాన్ని పురస్కరించుకుని పిఆర్‌టియు ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ మహాధర్నా పోస్టర్‌ను గురువారం పిఆర్‌టియు అర్బన్ మండల అధ్యక్ష, కార్యదర్శులు గుడిపూడి శ్రీనివాసరావు, బి. రవికిరణ్ లు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉద్యోగ, ఉపాధ్యాయులందరికీ కాంట్రిబ్యూషన్ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు పర్చాలన్నారు. సెప్టెంబర్ ఒకటిన హైదరాబాద్‌లోని ఇందిరాపార్కు వద్ద ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు మహాధర్నానిర్వహించడం జరుగుతుందన్నారు. ఈ ధర్నాలో సిపిఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. అదేవిధంగా ఉపాధ్యాయులకు సంబంధించిన వివిధ రకాల మెడికల్, జిపిఎఫ్, సరెండర్ లివ్ తదితర బిల్లులు గత రెండు సంవత్సరాల నుంచి పెండింగ్‌లో ఉన్నాయని వాటిని దశల వారీగా మంజూరు చేయాలని కోరారు. ఇటీవల సమ్మె చేసిన కెజిబివి, ఎస్ఎస్‌ఏ ఉద్యోగుల సమ్మె కాలానికి వేతనాన్ని మంజూరు చేయాలన్నారు. . ఈ సమావేశంలో నాయకులు దర్గయ్య, సత్యనారాయణ, రంగారావు,

# ప్రభుత్వ విద్య బలోపేతం

### వసతుల కల్పనకు రూ. 497 కోట్లు
### -మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**ప్రజాపక్షం/ నేలకొండపల్లి /తిరుమలాయపాలెం :** ఇందిరమ్మ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత రాష్ట్రంలో ప్రభుత్వ విద్య ను బలోపేతం చేసి పేద విద్యార్థులు ఉన్నత చదువులు చదివేందుకు చేయూతనందిస్తున్నామని రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ శాఖ మం త్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గురువారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మండలంలో ప ర్యటించారు. బోదుల బండ ఉన్నత పాఠశాలలో పిఎస్‌ఆర్ ట్రస్టు ద్వారా సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ ప్ర భుత్వ విద్యపై ప్రత్యేక దృష్టిసారించినట్లు ఆయ న తెలిపారు. ప్రైవేటుకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు ప్రభుత్వం అవసరమై న చర్యలు చేపడుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో వసతుల కల్పనకు పాలేరు నియోజక వర్గ ప రిధిలో రూ.497 కోట్లు కేటాయించినట్లు ఆయన తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించేలా కృషి చేయాలన్నారు. నియోజక వర్గ వ్యాప్తం గా దూరప్రాంతాల నుంచి వచ్చే బాలికలకు 500 సైకిళ్లు పంపిణీ చేస్తున్నామన్నారు. అనంతరం గువ్వల గూడెం గ్రామం నుంచి బాలసముద్ర మం రోడ్డుకు శంకుస్థాపన చేశారు. నేలకొండపల్లి మండల కేంద్రంలో పశు వైద్యశాలకు మం త్రి పొంగులేటి శంకుస్థాపన చేశారు. బైరవుని పల్లి గ్రామానికి చెందిన సిపిఐ మండల నాయకుడు కుంచం భిక్షం కుమార్తె వివాహం ఇటీవల జరిగగా నూతన వధూవరులను మంత్రి ఆశీర్వదించారు. బుద్దారం, రాయగూడెం గ్రామాల మధ్య బ్రిడ్జి ని ర్మాణానికి, అప్పలనర్సింహాపురంలో సిసి రోడ్డు ని ర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటీ చైర్మన్ వెన్నపూసల సీతారాములు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ శాఖమూరి రమేష్, నాయకులు కొడాలి గోవిందరావు, బచ్చలకూరి నాగరాజు, జెర్రిపోతుల అంజని, సిపిఐ మండల సహాయ కార్యదర్శి ఎం. ఉ పేందర్, నారాయణ, కొమ్మినేని విజయ్‌బాబు, జె ర్రిపోతుల సత్యనారాయణ, మామిడి వెంకన్న, ఈ. శ్రీనివాసరెడ్డి, మరికంటి రమేష్, తదితరులు పాల్గొన్నారు.

### పాలేరు నియోజకవర్గంలో విద్యారంగ అభివృద్ధికి రూ.449కోట్లు ఖర్చు

తిరుమలాయపాలెం మండలంలో సుబ్లేడు, పిండిప్రోలు గ్రామాల్లో ఆర్అండ్‌బి పంచాయతీరాజ్ రో డ్ల నిర్మాణానికి రూ.15కోట్ల పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. అనంతరం గ్రామంలో జరిగి న సభలో పొంగులేటి మాట్లాడుతూ తెలంగాణ రా ష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రతిఒక వర్గానికి సమన్యాయం చేస్తూ సంక్షేమ పథకా లు ప్రవేశపెడుతున్నామని, రాష్ట్రంలో వ్యవసాయ రంగానికి, విద్యారంగానికి, వైద్య రంగానికి పెద్దపీ ట వేస్తున్నామని అన్నారు. పాలేరు నియోజకవర్గంలో కేవలం విద్యారంగ అభివృద్ధికి రూ. 449 కోట్లు ఖర్చు చేస్తున్నామని, ప్రతిఒక్క పేద విద్యార్థి ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉన్నత చదువులు చదివేందుకు ప్రభుత్వం ధృడ సంకల్పంతో ఉందని ఆయన తెలిపారు. కేవలం సుబ్లేడు గ్రామంలో రూ.39కోట్లతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని, అంతర్గత సిసి రోడ్లు, బిటి రోడ్లు, కల్వర్టులు, సైడ్ కాలువలు, ఇంటిగ్రేట్ స్కూల్ భవనాలు ప్రారంభం కా నున్నాయని, అతిత్వరలోనే పనులు మొదలు పెడుతామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్అండ్‌బి ఎస్ఇ యాకోబ్, పిఆర్ ఎస్ఇ వెంకట్‌రెడ్డి, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, డిసిసిబి అధ్యక్షులు రామసహాయం, నరేష్‌రెడ్డి, ఆత్మ కమిటీ చైర్మన్ శివరామకృష్ణ, తహశీల్దార్ లూథర్ విల్సన్, ఎంపిడిఓ ఎస్కే సిలార్‌సాహెబ్, మాజీ ఎంపిపిలు కొప్పుల అశోక్, బోడ మంగీలాల్, ప్రజాప్రతినిధులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## గొల్లపూడి పంచాయతీ కార్యదర్శి సస్పెన్షన్

### ప్రత్యేక అధికారికి షోకాజ్ నోటీసులు


గొల్లపూడి గ్రామపంచాయతీలో మూడు లక్షల దుర్వినియోగ
-తర్వాత కొంత జమ?
-విచారణకే పరిమితమైన అధికారులు
-ఆలస్యంగా వెలుగులోకి

ప్రజాపక్షం ఎఫెక్ట్

**ప్రజాపక్షం/వైరా:** వైరా మండలం గొల్లపూడి గ్రామపంచాయతీ కార్యదర్శి సునీతా పంచాయతీ నిధులు దుర్వినియోగం చేయడం నిర్ధారించిన జిల్లా కలెక్టర్ పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. అదేవిధంగా గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి కృష్ణచైతన్యకు షోకాస్ నోటీసులు జారీ చేశారు. ప్రజాపక్షం దినపత్రికలో గొల్లపూడి గ్రామ పంచాయతీలో రూ.6.66లక్షలు పైగా సుమారు డ్రా చేసి పంచాయతీ అకౌంట్‌లో వేయకుండా సొంతానికి వాడుకున్న విషయాన్ని అధికారులు గోప్యంగా ఉంచారు. ఈ క్రమంలో ప్రజాపక్షం దినపత్రిక పంచాయతీ నిధులు దుర్వినియోగంపై వరుస కథనాలను ప్రచురించడం జరిగింది. ఈ కథనాలతో డిఎల్‌పిఓ రాంబాబుకు సమాచారం అందించారు. ఆయన తెలుసుకున్న సమాచారం మేరకు జిల్లా కలెక్టర్ నివేదిక అందించడంతో గ్రామపంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేశారు. ఎప్పుడైతే నిధులు దుర్వినియోగం జరిగాయి అని విషయం తెలుసుకున్న డిఎల్‌పిఒ అప్పటికప్పుడే రికార్డులను స్వాధీనం చేసుకొని పూర్తి నివేదికను డిపిఒ ఆఫీస్‌కు అందించడంతో నిధులు దుర్వినియోగం జరిగిన విషయాన్ని గుర్తించి చర్యలు చేపట్టారు. అదేవిధంగా ప్రత్యేక అధికారిగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆర్‌డబ్ల్యూఎస్ డిఈ కృష్ణచైతన్యకు షోకాస్ నోటీసులు జారీ చేశారు.

## ఐటిడిఎ పిఒ, సబ్ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ




**ప్రజాపక్షం/కల్లూరు:** కల్లూరులోని గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలను గురువారం ఐటిడిఎ పిఒ రాహుల్, కల్లూరు సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్‌లు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఆశ్రమ పాఠశాలలో చదివే విద్యార్థినిలు పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకొని వారు చదువుతో పాటు ఆరోగ్య పరిరక్షణ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ అన్నారు. గురువారం కల్లూరు డివిజన్లోని గిరిజన సంక్షేమ శాఖ బాలికల ఆశ్రమ పాఠశాలను కల్లూరు స బ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తో పాటు కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాలలోని వంటశాల కూరగాయలు భద్రపరిచే గది, వ స్తు సామాగ్రి భద్రపరిచే గది విద్యార్థులకు వండిన ఆహారాన్ని పరిశీలించి విద్యార్థినిలతో కలిసి భోజనం చేశారు. ప్రతిరోజు మెనూ ప్ర కారం ఆహారం అందిస్తున్నది లేనిది విద్యార్థులకు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల యొక్క చరి త్ర రాష్ట్ర స్థాయిలో తెలిసిపోయిందని విద్యార్థులకు నాసిరకం ఆహారం అందించడం వలన ఆసుపత్రిపాలయ్యారని ప్రతిరోజు ఫిర్యాదులు వస్తూనే ఉన్నాయని ఇటువంటివి పునరావృతం కాకుండా జాగ్రత్తలు వహించాలని మెనూ ప్రకారం పిల్లలకు సమయానుకూలంగా వేడిగా ఉన్నప్పుడే ఆహారం అందించాలని అన్నారు. వంట చేసే సిబ్బంది తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలని ఆహారం ముందుగా సంబంధిత సిబ్బంది తిన్న తర్వాతనే విద్యార్థినిలకు వడ్డించాలని అన్నారు. ప్రస్తుతం వర్షాకాలం కావున పాఠశాలలో పరిసరాలు పరిశుభ్రత వహించాలని విషపూరిత క్రిమి కీటకాలు రాకుండా చూడాలని ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసును సిబ్బందికి ఆదేశించారు. విద్యార్థినిలకు వ్యక్తిగత పరిశుభ్రత పై అవగాహన కల్పించారు . అదేవిధంగా మళ్ళీ ఫిర్యాదులు వస్తే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడిఎంహెచ్వో సైదులు, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస్ నాయక్, తహశీల్దార్ పులి సాంబశివుడు, వైద్యులు నవ్య కాంత్ తోపాటు తదితరులు పాల్గొన్నారు.

# ప్రతిపక్షాలపై బిజెపి కుట్ర

### సిపిఎం కేంద్ర కమిటీ సభ్యుడు తమ్మినేని వీరభద్రం




**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** 30 రోజుల కస్టడీ బిల్లు పేరుతో ప్రతిపక్షాలపై బిజెపి కుట్ర పన్నుతుందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం ఆరోపించారు.ప్రజలందరికీ దేశానికి ఉపయోగపడే చట్టాలు చే యాల్సిన పార్లమెంటు చట్టపరమైన విధానాలను తప్పించుకునే దిశగా బిల్లులు తీసుకు వస్తుందని ఆయన తెలిపారు. గురువారం ఖమ్మం నగరంలో నిగోశాల సమీపంలో ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై. విక్రం అధ్యక్షతన జరిగిన దొంగల కోటయ్య సంస్మరణ సభలో తమ్మినేని వీరభద్రం ప్రసంగించారు. అవినీతి వంటి తీవ్రమైన నేరారోపణలతో 30 రోజుల పాటు కస్టడీలో ఉంటే ఎమ్మెల్యేలు, మంత్రులు, ఎంపిలు, ముఖ్యమంత్రి, ప్రధాన మంత్రినైనా పదవిలో నుంచి తీసేసే బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో గురువారం ప్రవేశపెట్టిందన్నారు. కేంద్ర ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక ధోరణులకు ఈ బిల్లు ఓ నిదర్శనమన్నారు. ప్రతిపక్ష రాష్ట్ర ప్రభుత్వాలను కూలదోయడమే లక్ష్యంగా ఈ బిల్లును కేంద్రం తీసుకు వచ్చిందని ఆయన ఖండించారు. ప్రతిపక్షాలను అణిచివేసే చర్యల్లో భాగంగా 30 రోజుల కస్టడీ బిల్లు అని తమ్మినేని తెలిపారు. బిజెపియేతర పార్టీలో ఏ రాష్ట్రంలో అధికారంలో ఉన్న అక్కడి ప్రభుత్వాలపై కక్షపూరితంగా వ్యవహరించేందుకు ఈ బిల్లు ఓ అస్త్రం లాంటిదన్నారు. రాజ్యాంగ వ్యవస్థలన్నింటిని తన చెప్పుచేతల్లో పెట్టుకున్న బిజెపి కోర్టుల్లోనూ తమకు అనుకూలంగా తీర్పులు ఇప్పించుకుంటున్నారని తెలిపారు. బీహార్‌లో 65లక్షల ఓట్లను తీసి వేశారని దీనిలో ము స్లిం, క్రిస్టియన్, ప్రతిపక్ష పార్టీల ఓట్లే ఉన్నాయన్నారు. ఉప ముఖ్యమంత్రిగా పనిచేసిన తేజస్వి యాదవ్ ఓటే ఓటరు లిస్టులో లేకపోవడం గమనార్హమన్నారు. ఎలక్షన్ కమిషన్ సైతం బిజెపి ఏజెంట్‌గా మారిపోయిందన్నారు. సి బిఐ, ఈడిలను సైతం బిజెపి తమ చెప్పుచేతల్లో ఉంచుకుందన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి బి. వెంకట్, పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు ఎం. సాయిబాబు, సిఐటియు రాష్ట్ర ప్రధాన కార్యద ర్శి పాలడుగు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, రాష్ట్ర కమిటీ సభ్యులు బుగ్గవీటి సరళ, బండి రమేష్, కళ్యాణం వెంకటేశ్వర్లు, పలువురు నాయకులు, దొంగల కోటయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## నిర్వాసితుల నుంచి సమాచారం సేకరించిన నిఘావర్గాలు


రైస్‌మిల్ నిర్వాహకుడి బెదిరింపులు..!
ప్రజాపక్షం ఎఫెక్ట్
epaper.prajapaksham.in
Khammam Tab - Page 4 - 19 Aug 2025

**ప్రజాపక్షం/ఖమ్మం:** అక్షరమే ఆయుధంగా ఏదులాపురంమున్సిపాలిటీపరిధిలోని వరంగల్‌క్రాస్‌రోడ్‌లో గల ఓ రై స్‌మిల్‌తో నిర్వాసితులు పడుతు న్న ఇబ్బందులపై వరుస కథనాలు ప్రచురిస్తున్న సంగతి పా ఠకులకు విధితమే. అంతేకాకుం డా రైస్‌మిల్ నిర్వాహకుడు ఏర్పాటు నుంచి వాణిజ్య పన్నుకు ఎగనామం పెట్టిన తీరు వెలుగులోకి తీసుకువచ్చింది. ఈ కథనాలు సామాజిక మాధ్యమాలతో పాటు జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. వీటిపై జిల్లా కలెక్టర్ ఆరా తీసినట్లు సమాచారం.. అలాగే రైస్‌మిల్‌తో నిర్వాసితులకు ఎదురవుతున్న దయనీయపరిస్థితిని నిఘా వర్గాలు సేకరించినట్లు తెలిసింది. అక్షరసత్యాలుగా ప్రజాపక్షం ప్రచురించిన కథనాలపై స్థానిక నిర్వాసితులు కృతజ్ఞతలు తెలిపారు. రైస్ మిల్ కాలుష్య కొరల నుంచి సమస్య పూర్తిగా పరిష్కారం అయ్యేవరకు అక్షర అండను అందించాలని కోరారు.


సమస్యలతో సతమతం...

## యూరియా కష్టాలు తొలగించండి

### కేంద్ర మంత్రి నడ్డాకు బిఆర్ఎస్ వినతి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** తెలంగాణ రాష్ట్రానికి సరిపడ యూరియాను తక్షణమే సరఫరా చేసి రైతులు పడుతున్న ఇబ్బందులను తక్షణమే తొలగించాలని బిఆర్ఎస్ కేంద్ర మంత్రి జెపి నడ్డాను కోరింది. గురువారం ఢిల్లీలో కేంద్ర రసాయన ఎరువుల శాఖ మంత్రి జెపి నడ్డాకు బిఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ నేతలు కెఆర్ సురేష్‌రెడ్డి, వద్దిరాజు రవిచంద్ర లు కలిసి వినతి పత్రం సమర్పించారు. వానలు విస్తారంగా కురిసి వరి నాట్లు పడుతున్న ఈ కీలక సమయంలో ఎరువుల కొరత కారణంగా రైతులు పడుతున్న ఇబ్బందుల గురించి కేంద్ర మంత్రికి వివరించారు. వ్యవసాయ పనులు ముమ్మరంగా సాగుతున్న సమయంలో రైతులు విలువైన కాలనంతా ఎరువుల కోసం క్యూలో పడి గాపులు కాయాల్సి వస్తుందన్నారు. అవసరానికి సరిపడ యూరియాను తక్షణమే తెలంగాణకు అందే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

# గంజాయి పట్టివేత

### ముగ్గురు నిందితులను రిమాండ్‌కు తరలింపు, ఒకరు పరారీ




**ప్రజాపక్షం/పాల్వంచ :** అక్రమంగా తరలిస్తున్న రూ. 53 లక్షల విలువైన 107 కిలోల గంజాయిని పట్టుకోవటంతో పాటుగా నిందితుల నుండి రూ. 35,500/లు నగదు, ఏడు సెల్‌ఫోన్‌లు, ఒక పిస్టల్, 5 రివాల్వర్‌లు, 40 బుల్లెట్‌లు, 12 ఖాళీ మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకొన్నామని ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ ఖమ్మం జిల్లా డిప్యూటీ కమీషనర్ జనార్థన్ రెడ్డి తెలిపారు. స్థానిక అబ్కారీ సర్కిల్ కార్యాలయంలో గురువారం పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జనార్థన్‌రెడ్డి మాట్లాడుతూ మండల పరిధి జగన్నాధపురం సమీపంలో ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమీషనర్ గణేష్ తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. ఈ క్రమంలో భద్రాచలం నుండి అతి వేగంగా వస్తున్న ఓ డిసిఎం వాహనం అనుమానాస్పదంగా కనిపించినది. వెంటనే ఆపి తనిఖీ చేశారు. అందులో 90 కిలోల గంజాయి ఉన్నట్లు గుర్తించారు. వాహన డ్రైవర్‌ను విచారించగా డిసిఎంకు పైలెట్‌గా మరో ముగ్గురు వ్యక్తులు కారులో వెళుతున్నారని తెలిసింది. అప్రమత్తమైన అధికారులు కారును వెంబడించి పట్టుకొన్నారు. కారును సోదా చేయగా 15 కిలోల గంజాయితో పాటుగా ఆయుధాలు ఉన్నట్లు గమనించారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని,కారును, డిసిఎం వాహనాన్ని అబ్కారీ కార్యాలయానికి తరలించారు. తమదైన శైలిలో నిందితులను విచారించగా 1, కేరళ ఎర్నాకులం వేలుకొండల్ నావల్ ఆర్నమెంట్ డిపో ఆలువాకు చెందిన బిలాల్ వివిస్, 2, తమిళనాడు తిరుచ్చి తోరియార్‌కు చెందిన శ్యామ్‌సుందర్, 3, తమిళనాడు తిరియార్ తిరుచ్చి కుది వీధి విశ్వాంబుల్ సముద్రమ్‌కు చెందిన కాశీ నందన్ సంతోష్, 4, శ్యామ్ సుందర్ పార్టనర్ తిరుచ్చికి చెందిన జేమ్స్‌లు కలిసి ఒడిస్సాలో గంజాయి కొనుగోలు చేసి భద్రాచలం, కొత్తగూడెం, ఖమ్మం, చెన్నై మీదుగా తిరుచ్చికి తరలిస్తున్నారని, అలాగే వీరితో కలిసిన కేరళకు చెందిన గ్యాంగ్‌స్టర్ మధ్యప్రదేశ్ రాష్ట్రం ఇండోర్ నుండి మారణాయుధాలు కొనుగోలు చేసి కొచ్చిలో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు తెలిసిందన్నారు. వీరి దగ్గర నుండి రూ.35,500/లు నగదుతో పాటుగా ఒక పిస్టల్, 5 రివాల్వర్‌లు, 40 బుల్లెట్‌లు, 12 ఖాళీ మ్యాగజైన్‌లు స్వాధీనం చేసుకొని నిందితులైన నలుగురిలో జేమ్స్ పరారీలో ఉండగా మిగతా ముగ్గురిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించనున్నట్లు పేర్కొన్నారు. ఆయుధాలను స్థానిక పోలీస్ స్టేషన్‌కు అప్పగిస్తామని, తదుపరి కేసును పోలీసు శాఖ దర్యాప్తు చేస్తుందని చెప్పారు. గంజాయి రవాణాకు పాల్పడుతున్న వ్యక్తులను చాకచక్యంగా పట్టుకొన్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అసిస్టెంట్ కమీషనర్ గణేష్, ఇన్స్‌పెక్టర్ ఎస్. రమేష్, సబ్ ఇన్స్‌పెక్టర్ సిహెచ్ శ్రీహరి రావు, సిబ్బంది కరీం, బాలు, సుధీర్, వెంకటేశ్వర్లు, హనుమంతరావు, విజయ్, హరీష్, వీరబాబు, ఉపేందర్‌లను కమీషనర్ హరికిరణ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ షా నవాజ్ ఖాసీంలు ప్రత్యేకంగా అభినందించారన్నారు. అసిస్టెంట్ కమీషనర్ తిరుపతి, కొత్తగూడెం ఇంచార్జి జానయ్య, పాల్వంచ అబ్కారీ, ఎక్సైజ్ శాఖ సిఐ ప్రసాద్, కార్యలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# క్రీడ

## పాక్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు రద్దు

### కేంద్ర ప్రభుత్వ కొత్త స్పోర్ట్స్ పాలసీ స్పష్టీకరణ




**న్యూఢిల్లీ:** పాకిస్తాన్‌తో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు పూర్తిగా రద్దయ్యాయి. కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన నూతన క్రీడా విధానం (స్పోర్ట్స్ పాలసీ)ని అనుసరించి పాకిస్తాన్‌తో క్రికెట్‌సహా ఏ ఇతర క్రీడాల్లోనూ ద్వైపాక్షిక మ్యా చ్‌లు లేదా సిరీస్‌లలో భారత్ పాల్గొనదు. గతంలో మాదిరి తటస్థ వేదికలపై మ్యాచ్‌లు లేదా సిరీస్‌లను కూడా ఆడేది లేదని తాజా స్పోర్ట్స్ పాలసీలో కేంద్రం పేర్కొంది. అయితే, బహుళ జట్లు పోటీ పడే ఈవెంట్స్‌లో మాత్రం, పాకిస్తాన్‌తో ఒకవేళ మ్యాచ్‌లు ఆడాల్సి వస్తే అందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ ప్రతినిధిని ఉటంకిస్తూ పిటిఐ తెలిపిన వివరాల ప్రకారం, పహల్గావ్ ఉగ్ర దాడి తర్వాత, పాకిస్తాన్‌కు వెళ్లడం లేదా ఆ దేశంలో ద్వైపాక్షిక క్రీడా సంబంధాలు కొనసాగించడం క్షేమదాయకం కాదని భారత్ భావిస్తున్నది. ఒకవేళ బహుళ జట్లు లేదా దేశాలు పాల్గొనే క్రీడా పోటీలు పాక్‌లో జరిగితే, భారత జట్టు లేదా బృందం పాల్గొంటుందా అన్న ప్రశ్నకు నేరుగా సమాధానం రాలేదు. అప్పటి పరిస్థితులను అనుసరించి, తగిన నిర్ణయం తీసుకుంటారు. పహల్గావ్ దాడి, ఆ తర్వాత భారత్ చేపట్టిన ఆపరేషన్ సిందూర్ సమయంలో ఉన్న ఉద్రిక్త పరిస్థితులు ఇప్పుడు లేవు కాబట్టి, ద్వైపాక్షిక క్రీడా సంబంధాలను పునఃపరిశీలించే అవకాశం ఉంటుందా అన్న ప్రశ్నకు కూడా కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నుంచి స్పష్టమైన స్పందన లేదు. ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే, అలాంటి అవకాశం ఉండకపోవచ్చని పేర్కొంది. యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)లో వచ్చే నెల జరిగే ఆసియా కప్‌లో ఎనిమిది జట్లు పాల్గొననున్నాయి. వీటిలో భారత్, పాకిస్తాన్ కూడా ఉన్నాయి. అది ద్వైపాక్షిక సిరీస్ కాదు కాబట్టి, ఆ టోర్నీలో పాక్‌తో భారత జట్టు మ్యాచ్‌లు ఆడేందుకు ఎలాంటి అభ్యంతరం ఉండదు. ఇలావుంటే, పాక్‌తో క్రీడా సంబంధాలపై తీసుకున్న నిర్ణయాలే మిగతా అన్ని రంగాలు లేదా విభాగాలకు కూడా వర్తించే అవకాశాలు ఉన్నాయి. 2030లో కామన్వెల్త్ గేమ్స్, 2036లో ఒలింపిక్స్‌ను నిర్వహించేందుకు పోటీపడుతున్న భారత్, అంతర్జాతీయ క్రీడా నిబంధనలను తప్పక అనుసరించాల్సి ఉంటుంది. ఒక దేశం లేదా ఒక ప్రాంతంతో ఘర్షణ పూర్వక వైఖరిని అనుసరిస్తే, ఇలాంటి మేజర్ ఈవెంట్స్‌కు ఆతిథ్యమిచ్చే అవకాశాలు దెబ్బతింటాయి. అయినప్పటికీ, పాక్‌తో రాజీ ధోరణిని అనుసరించే అవకాశమే లేదని భారత్ స్పష్టం చేస్తున్నది.

# షో కేస్

## స్పోర్ట్స్

కేవలం పురుషులకు మాత్రమే పరిమితం అనుకునే రగ్బీ క్రీడలో ఇప్పుడు మహిళలు కూడా రాణిస్తున్నారు. మహిళల విభాగంలోనూ అంతర్జాతీయ టోర్నీలు జరుగుతున్నాయి. మహిళల ప్రపంచ కప్ చాంపియన్‌షిప్‌ను ప్రతి నాలుగేళ్లకు ఒకసారి నిర్వహిస్తారు. ఈ ఏడాది 10వ వరల్డ్ కప్ జరుగుతుంది. శుక్రవారం (ఆగస్టు 22) నుంచి బుధవారం (ఆగస్టు 27) వరకు లండన్ వేదికగా ఈ మెగా టోర్నీ జరుగుతుంది. 16 దేశాల జట్లు పాల్గొనే ఈ పోటీల కోసం ఎనిమిది మైదానాలను సిద్ధంగా ఉంచారు. కాగా, 2021లో జరిగిన మహిళల రగ్బీ ప్రపంచ కప్‌ను న్యూజిలాండ్ కైవసం చేసుకుంది. అత్యంత ఉత్కంఠ భరితంగా సాగిన ఫైనల్‌లో ఈ జట్టు 34–31 తేడాతో ఇంగ్లాండ్‌ను ఓడించింది. ఎమిలీ స్కారట్ అత్యధికంగా 44 పాయింట్లు సాధించింది. మొత్తం 26 మ్యాచ్‌ల్లో, సగటున 46.23 చొప్పున మొత్తం 1,202 గోల్స్ నమోదయ్యాయి. మ్యాచ్‌లను 1,40,000 మంది (సగటున మ్యాచ్‌కి 5,385 చొప్పున) ప్రత్యక్షంగా వీక్షించారు.

### మహిళల విభాగంలో..



## విజేత జట్లు




మహిళల రగ్బీ ప్రపంచ కప్ చాంపియన్‌షిప్ ఇంత వరకూ 9 పర్యాయాలు జరగ్గా, న్యూజిలాండ్ ఆరుసార్లు (1998, 2002, 2006, 2010, 2017, 2021) విజేతగా నిలిచి, ఆధిపత్యాన్ని కొనసాగిస్తున్నది. ఇంగ్లాండ్ రెండు ట్రోఫీలు (1994, 2014) కైవసం చేసుకోగా, అమెరికా 1991లో, ఒకసారి చాంపియన్‌గా నిలిచింది. ప్రపంచ ర్యాంకింగ్స్ విషయానికి వస్తే, ఇంగ్లాండ్ ఇప్పుడు నంబర్ వన్ స్థానంలో నిలుస్తున్నది. కెనడా రెండో స్థానంలో ఉండగా, నిరుటి విజేత న్యూజిలాండ్‌ది మూడో స్థానం. ఫ్రాన్స్, ఐర్లాండ్ వరుసగా 4, 5 స్థానాల్లో ఉన్నాయి.

## మీకు తెలుసా?

రగ్బీ ఆడిన మొట్టమొదటి మహిళా క్రీడాకారిణి ఎమిలీ వాలెంటైన్. అప్పుడు ఆమె వయసు 10 సంవత్సరాలు. ఆమె సోదరుల జట్టులో ఒక ఆటగాడు లేకపోవడంతో, సహాయం చేయడానికి ముందుకు వచ్చిన ఆమె, వింగ్‌లో ఆడింది. మ్యాచ్‌లో ఒక ట్రై స్కోర్ చేయగలిగింది.

పురుషుల విభాగంలో చాలా మంది రగ్బీ క్రీడాకారులు ప్రొఫెషనల్స్, కానీ, మహిళల విభాగంలో ఆ పరిస్థితి లేదు. చాలా మంది మహిళల రగ్బీ ప్రాక్టీస్ చేస్తూ, మ్యాచ్‌ల్లో పాల్గొంటూనే, ఫుల్ టైమ్ ఉద్యోగాలు కూడా చేస్తున్నారు. ఇంగ్లాండ్‌లోని అనేక క్లబ్‌లకు కాంట్రాక్టులు నెమ్మదిగా పరిచయం చేయబడుతున్నాయి, కానీ ఇప్పటికీ ప్రొఫెషనల్స్‌గా మారే స్థాయి జీతం అందించడం లేదు.

మొదటి మహిళల ప్రపంచ కప్ 1991లో వేల్స్‌లోని కార్డిఫ్‌లో జరిగింది. రిచ్‌మండ రగ్బీ క్లబ్ నుండి నలుగురు క్రీడాకారులు దీనిని సృష్టించి నిర్వహించారు. అయితే, అంతకు ముందు 'మినీ వరల్డ్ కప్' అనే పేరుతో అంతర్జాతీయ పోటీ 1990లో న్యూజిలాండ్‌లోని క్రైస్ట్‌చర్చ్‌లో జరిగింది.

మహిళల సిక్స్ నేషన్స్ ఫైనల్ (2024)ను బిబిసి2లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇంగ్లాండ్, ఫ్రాన్స్ జట్ల మధ్య జరిగిన ఉత్కంఠభరితమైన ఆటను 600,000 మంది వీక్షించారు.

చాలా మంది మహిళా రగ్బీ క్రీడాకారిణులు అనేక రకాలుగా విమర్శలకు, హేళనకు గురవుతున్నారు. అయినప్పటికీ, ఆటపైనే దృష్టి కేంద్రీకరిస్తూ, తమదైన దారిలో ముందుకు వెళుతున్నారు. రగ్బీ ఆడే మహిళలను కొంత మంది 'ట్రాన్స్ జెండర్స్'గా పిలుస్తుంటారు. లైంగిక వేధింపుల సంఘటనలు కూడా ఉన్నాయి. అయినప్పకీ, మహిళలు ఈ క్రీడలో నైపుణ్యం సంపాదించి, స్థానిక, జాతీయ, అంతర్జాతీయ పోటీల్లో పాల్గొనడానికి నిర్విరామంగా కృషి చేయడం ప్రశంసనీయం.

న్యూజిలాండ్ 1891లో విదేశీ మహిళల రగ్బీ జట్లతో మ్యాచ్‌ల సిరీస్‌ను నిర్వహించడానికి ప్రయత్నించింది. అయితే, అప్పట్లో మహిళల రగ్బీ ఆడడాన్ని సహించలేకపోయిన కొంత మంది తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రజల నుండి వచ్చిన వ్యతిరేకత కారణంగా సిరీస్‌లను రద్దు చేయవలసి వచ్చింది.

ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో మొదటి మహిళా రగ్బీ జట్టు, 1962లో ఏర్పాటైంది.

ప్రపంచంలో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న క్రీడలలో మహిళల రగ్బీ ఒకటి.

పూర్తిగా డాక్యుమెంట్ చేసి, రికార్డయిన మొట్టమొదటి మహిళా క్లబ్ మ్యాచ్ 1968 మే 1న ఫ్రాన్స్‌లో జరిగింది.

## అపార శక్తి సామర్థ్యాలకు ప్రతీక రగ్బీ



నితిన్ హీరోగా 2004లో వచ్చిన 'సై' సినిమా ద్వారా అప్పటి వరకూ అంతగా ప్రాచుర్యంలో లేని రగ్బీ క్రీడ తెలుగు వారికి పరిచయమైంది. అపారమైన శక్తిసామర్థ్యాలకు ప్రతీకగా రగ్బీని పేర్కొంటారు. ఫుట్‌బాల్‌లో బంతిని కాలితో కొడుతూ, చేయాల్సి ఉంటే, రగ్బీలో బంతిని చేతిలో పట్టుకొని, ప్రత్యర్థి గోల్ పోస్టువైపు పరుగులు తీసి, గోల్ సాధించాలి. ఆ బంతిని తమ ఆధీనంలోకి తెచ్చుకోవాలని ప్రత్యర్థి ఆటగాళ్లు, బంతిని ఎలాగైనా కాపాడుకోవాలని సొంత జట్టు ఆటగాళ్లు ఒక్కసారిగా మీదపడినప్పటికీ, చాకచక్యంగా ముందుకు వెళ్లి, గోల్ చేయడానికి శారీరక దృఢత్వం మాత్రమే కాదు.. అంతులేని ఆత్మస్థైర్యం కూడా ఉండాలి. నిజానికి రగ్బీ అనే పదం వినగానే గుర్తుకు వచ్చేది విపరీతమైన ఉత్సాహం, శారీరక బలం, వ్యూహాత్మక మేధస్సు, జట్టు ఆత్మబలం, గెలుపు కోసం చేసే పరాక్రమ పోరాటం. ఇది శారీరక స్థైర్యం, మానసిక ధైర్యం, వ్యూహాత్మక ఆలోచన, బలమైన జట్టు సమన్వయం కలగలిసిన ఒక సాహసక్రీడ. నేటి ప్రపంచ క్రీడా చరిత్రలో ఫుట్‌బాల్, క్రికెట్‌లతో సమానంగా స్థానం సంపాదించుకున్న రగ్బీ, ఒకప్పుడు బ్రిటన్‌లోని చిన్న పట్టణంలోని పాఠశాలలో పుట్టి, శతాబ్దాల తరువాత అంతర్జాతీయ వేదికపై మిలియన్ల మంది అభిమానులను ఆకర్షించింది.రగ్బీ క్రీడ 19వ శతాబ్దం ప్రారంభంలో ఇంగ్లాండ్‌లోని వార్విక్‌షైర్ ప్రదేశంలో ఉన్న రగ్బీ స్కూల్లో పుట్టింది. 1823లో, ఒక ఫుట్‌బాల్ మ్యాచ్ జరుగుతుండగా, విలియం వెబ్ ఎలిస్ అనే విద్యార్థి హఠాత్తుగా బంతిని చేతిలో ఎత్తుకుని, ప్రత్యర్థి గోల్ వైపు పరిగెత్తాడు. అప్పటివరకు ఫుట్‌బాల్‌లో బంతిని చేతితో పట్టుకోవడం నిబంధనలకు విరుద్ధం. కానీ ఆ సాహసం రగ్బీ పుట్టుకకు బీజం వేసింది. కొత్త ఆటకు కసరత్తులు జరిగిన తర్వాత 1845లో రగ్బీ స్కూల్ మొదటిసారి ఈ ఆటకు ప్రత్యేక నిబంధనలను రూపొందించింది. ఇంగ్లాండ్‌లో రగ్బీ ఫుట్‌బాల్ యూనియన్ (ఆర్ఎఫ్‌యు) స్థాపన 1871లో జరిగింది.ఆటకు జాతీయ స్థాయి గుర్తింపు లభించింది. 1871లో స్కాట్‌లాండ్ – ఇంగ్లాండ్ జట్ల మధ్య మొదటి అంతర్జాతీయ రగ్బీ మ్యాచ్ జరిగింది. రగ్బీ కేవలం పరుగులు, బల ప్రదర్శనలు, ట్యాక్లింగ్స్ మాత్రమే కాదు. ఇది వ్యూహం, వేగం, సమన్వయం, సైనిక స్థాయి వ్యూహరచన కలగలిసిన ఆట. రగ్బీ క్రీడలో రెండు ప్రధాన విభాగాలు, రగ్బీ యూనియన్, రగ్బీ లీగ్ ఉన్నాయి. రగ్బీ యూనియన్ మ్యాచ్‌లలో, ఒక్కో జట్టుకు 15 మంది ఆటగాళ్లు ఉంటారు. రగ్బీ లీగ్‌లో 13 మంది ఆటగాళ్లతోనే జట్టు ఏర్పడుతుంది. ప్రత్యర్థి జట్టు గోల్ లైన్ దాటి బంతిని నేలపై ఉంచి ట్రై (సామాన్య భాషలో గోల్) సాధించడం. ట్రైకి 5 పాయింట్లు, కన్వర్షన్ కిక్‌కి 2 పాయింట్లు, పెనాల్టీ గోల్‌కు 3 పాయింట్లు, డ్రాప్ గోల్‌కు 3 పాయింట్లు లభిస్తాయి. అత్యధిక గోల్స్ చేసిన జట్టు విజేతగా నిలుస్తుంది. రగ్బీ ఆటను చూస్తే కనిపించే హింసాత్మకత వెనుక అసాధారణమైన క్రమశిక్షణ, నియంత్రణ దాగి ఉంటుంది. ఆటగాళ్లు పరస్పరం ఢీకొనడం, టాకిల్ చేయడం జరుగుతుంది గానీ, వాటన్నింటినీ నిబంధనల పరిధిలోనే నిర్వహించాలి.

# రీల్

## 'ఘాటి' దస్సోరా పాట విడుదల




క్వీన్ అనుష్క శెట్టి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్ డ్రామా ఘాటి . విక్రమ్ ప్రభు మేల్ లీడ్ గా నటించిన ఈ చిత్రానికి క్రిష్ జాగర్లమూడి దర్శకత్వం వహించారు. యువీ క్రియేషన్స్ సమర్పణలో ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్టైన్మెంట్ బ్యానర్ప రాజీవ్ రెడ్డి, సాయి బాబు జాగర్లమూడి నిర్మించారు. ఇప్పుడు సినిమా సెకండ్ సింగిల్ దస్సోరాను పాటను రిలీజ్ చేశారు. సాగర్ నాగవెల్లి కంపోజ్ చేసిన ఈ సాంగ్ స్టార్ట్ అవగానే ఎనర్జీ, కల్చర్, వైబ్రెన్స్ ఫుల్గా మూడ్ బూస్ట్ చేస్తుంది. ఘాటీల జీవన శైలిని, వారి కల్చర్ని ట్యూన్ అద్భుతంగా క్యాచ్ చేసింది. ఈఎస్ మూర్తి రాసిన సాహిత్యం ఘాటీల లైఫ్, వాళ్ల స్ట్రగుల్స్, పట్టుదలని రిఫ్లెక్ట్ చేశాయి. గీతా మాధురి, సాకేత్, శృతి రంజనీ పాడిన పవర్ఫుల్ పాటకి మరింత ఫీల్ ని యాడ్ చేశాయి విజువల్స్ అనుష్క శెట్టి, విక్రం ప్రభు, ఇంకో ఘాటీల టీమ్ గంజా సీక్రెట్గా ట్రాన్స్పోర్ట్ చేస్తూ, పోలీసుల్ని తప్పించుకుంటున్న సీన్స్ చూపించారు. ఇది సినిమా నేరేటివ్ ఎంత హైస్టేక్స్ ఉంటుందో ప్రజెంట్ చేసింది. బిగ్ స్క్రీన్ మీద ఈ సాంగ్ ఇంకా బలంగా ఇంపాక్ట్ చేయబోతుంది.మనోజ్ రెడ్డి కటాసాని సినిమాటోగ్రఫీ, సీనియర్ ఆర్ట్ డైరెక్టర్ తోటత రణి అద్భుతమైన సెట్లు డిజైన్ చేశారు. సాయి మాధవ్ బుర్ర డైలాగ్స్ రాశారు. చాణక్య రెడ్డి తూర్పు, వెంకట్ ఎన్. స్వామి ఎడిటింగ్ చేశారు. యాక్షన్ సీక్వెన్స్లు రామ్ కృష్ణన్ మాస్టర్ కంపోజ్ చేశారు.సెప్టెంబర్ 5న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కోసం సిద్ధమవుతోన్న ఘాటి, తెలుగు, తమిళం, మలయాళం, కన్నడ, హిందీ భాషల్లో పాన్ ఇండియా రిలీజ్ కానుంది. అనుష్క శెట్టి, విక్రమ్ ప్రభు, చైతన్య రావు, రవీంద్రన్ విజయ్, జగపతి బాబు తదితరులు నటిస్తున్నారు.

## వచ్చే ఏడాదికి విశ్వంభర : హీరో చిరంజీవి




మెగాస్టార్ చిరంజీవి నటిస్తున్న విశ్వంభర సినిమా గురించి స్వయంగా చిరంజీవి ఒక వీడియో రిలీజ్ చేశారు. ఎన్నో రోజులుగా ఈ సినిమా విడుదలకు నోచుకోవడం లేదు అనే ప్రచారానికి చిరంజీకి ఓ సమాధానంగా ఈ వీడియో చేశారని చెప్పవచ్చు. చిరంజీవి వీడియోలో ఈ విధంగా మాట్లాడారు. ఇలా మీ ముందుకు రావడానికి కారణం విశ్వంభర సినిమా. చాలా మందికి డౌట్ ఉంది. ఈ సినిమా ఎందుకు డిలే అవుతోంది. ఈ ఆలస్యం, జాప్యం సముచితం అని నేను భావిస్తున్నాను. ఈ చిత్రం సెకండ్ ఆఫ్ మొత్తం వి ఎస్ ఎక్స్, గ్రాఫిక్స్ మీదా ఆధారపడి ఉంది. మీకు అత్యున్నతమైన ప్రమాణాలతో , బెస్ట్ క్వాలిటీతో అందించాలనే దర్శక నిర్మతల ప్రయత్నమే ఈ జాప్యానికి ప్రధానమైన కారణం. ఎలాంటి విమర్శకాలకు తావివ్వకుండా శ్రద్ధా శక్తులతో తీసుకున్న సముచిత సమయమిది. ఈ చిత్రం గురించి చెప్పాలంటే .. చందమామలా సాగిపోయే అద్భుతమైన కథ. చిన్న పిల్లలకు, పెద్ద వాళ్లను సైతం ఈ సినిమా అలరిస్తుంది... వినోదాన్నిస్తుంది. ఈ సినిమా ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న, మీకు నేను ఒక సమాధానంగా మూవీ క్రియేషన్స్ వాళ్ళు నా బర్త్ డే ను పురస్కరించుకుని 21వ తేదీ సాయంత్రం 6గంటల 6 నిమిషాలకు విశ్వంభర సినిమా నుంచి ఒక చిన్న గ్లిమ్స్ విడుదల చేయనున్నారు. అందరు ఎంజాయ్ చేసే సీజన్ సమ్మర్.





కాబట్టి విశ్వంభర సినిమాను వచ్చే సమ్మర్ అంటే 2026 లో విడుదల చేస్తామని చిరంజీవి భరోసా ఇచ్చారు. ఇందులో చిరంజీవి సరసన త్రిష హీరోయిన్ గా నటిస్తోంది. వశిష్ఠ ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నారు. మూవీ క్రియేషన్స్ పతాకంపై విక్రమ్, వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్నారు. ఎం ఎం కీరవాణి, భీమ్స్ సిసిరోలియో ఇద్దరు ఈ సినిమాకు సంగీత దర్శకులుగా పని చేస్తున్నారు.

## 'అర్జున్ చక్రవర్తి' ట్రైలర్ లాంచ్

విజయ రామరాజు టైటిల్ రోల్ పోషించిన స్పోర్టర్స్ డ్రామా 'అర్జున్ చక్రవర్తి'. విక్రాంత్ రుద్ర దర్శకత్వం వహించిన ఈ సినిమాని నిర్మాత శ్రీని గుబ్బల నిర్మించారు. ఇప్పటికే ఈ సినిమాకు 46 ఇంటర్నేషనల్ ఫిల్మ్ అవారడ్స్ వచ్చాయి. ఇటివలే రీలీజైన టీజర్, సాంగ్ కు అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఈ చిత్రం ఆగస్టు 29న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ చేశారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో డైరెక్టర్ విక్రాంత్ రుద్ర మాట్లాడుతూ అర్జున్ చక్రవర్తి కేవలం సినిమా మాత్రమే కాదు నా తొమ్మిది సంవత్సరాల కల. మా టీమ్ అంతా ఆరేళ్ల



పాటు హార్డ్ వర్క్ చేశారు. మా నిర్మాతగా ఇచ్చిన సపోర్ట్ ని మర్చిపోలేను. ఆయన నాపై పూర్తి విశ్వాసం ఉంచారు. ఒక డెబ్యు డైరెక్టర్ కి ఎంత ఫ్రీడమ్ ఇవ్వాలో అంతకంటే ఎక్కువ ఇచ్చారు. ఒక దైవంలాగా వచ్చారు. హీరో విజయ్ ఈ సినిమా కోసం ప్రాణం పెట్టి పనిచేసాడు. చాలా రిస్కులు తీసుకున్నాడు. మైనస్ డిగ్రీల్లో షర్టు లేకుండా నటించాడు. ఈ సినిమాలో పనిచేసిన అందరూ కూడా చాలా డెడికేషన్ తో చేశారు. ఇందులో హీరో గారి క్యారెక్టర్ తో పాటు దయా క్యారెక్టర్ కూడా ఫిజికల్ గా అద్భుతంగా ఉంటుంది అని చెప్పారు. హీరో విజయరామ రాజు మాట్లాడుతూ ఈ సినిమా కోసం చాలా హార్డ్ వర్క్ చేశాను. సిక్స్ ప్యాక్ లో షూట్ చేసినప్పుడు రెండు రోజులు పాటు ఏమీ తినలేదు. ఈ సినిమానే మమ్మల్ని ముందుకు తీసుకెళ్లింది. నా కెరియర్ లో బెస్ట్ మూవీ చేశానని ఫీల్ అవుతున్నాను. 29న ఆడియన్స్ అదే ఫీల్ అవుతారు. అజయ్ ఇందులో చాలా మంచి పాత్ర చేశారు. ఆయనే సినిమాని ఇండస్ట్రీ జనాల్లోకి తీసుకువెళ్లారు. దయ చాలా పాజిటివ్ పర్సన్. ఇందులో ఆయన నుంచి చాలా నేర్చుకున్నాను. హీరోయిన్ సిజకి తెలుగులో చాలా మంచి అవకాశాలు వస్తాయి.అని అన్నారు. హీరోయిన్ సిజ రోజ్ మాట్లాడుతూ మాకు ఇది చాలా ఎమోషనల్ మూమెంట్. ఈ సినిమా కోసం చాలా ఏళ్ళు కష్టపడ్డాం. ఈ సినిమాల్లో భాగం కావడం చాలా ఆనందంగా ఉంది. ఇంత అద్భుతమైన సినిమాలో భాగం కావడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా ఫస్ట్ తెలుగు మూవీ. మీరు సాంగ్స్ కి ఇచ్చిన రెస్పాన్స్ నాకు ఎంతో ఆనందం ఇచ్చింది. ఇది వెరీ బ్యూటిఫుల్ సినిమా. తప్పకుండా మీ అందరికీ నచ్చుతుంది. ఆగస్టు 29 థియేటర్స్‌లో కలుద్దాం అని చెప్పారు. ఈ ఈవెంట్ లో నిర్మాత శ్రీని గుబ్బల , యాక్టర్ దయానంద రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సక్సెస్‌ఫుల్‌గా 20 ఏళ్ళు పూర్తిచేసుకున్న రెజీనా కసాండ్రా

అందం, అభినయం కలగలిసిన తార రెజీనా కసాండ్రా. శివ మనసులో శృతి చిత్రంతో హీరోయిన్గా పరిచయమైన ఈ భామ ఆ తరువాత రొటిన్ లవ్‌స్టోరీ, కొత్తజంట, పిల్ల నువ్వులేని జీవితం, సుబ్రమణ్యం ఫర్ సేల్ చిత్రంతో తెలుగులో అగ్ర కథానాయికల జాబితాలో చేరింది. కేవల తెలుగులోనే కాకుండా తమిళ, కన్నడ, హిందీ భాషల్లో కూడా నాయికగా తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంది. ఇటీవల అజిత్లో కలిసి నటించిన తమిళ చిత్రం విదా మయూర్చితో పాటు బాలీవుడ్ చిత్రం జాట్తో మంచి గుర్తింపును తెచ్చుకున్నారు రెజీనా కసాండ్రా. ఇప్పటి వరకు అన్ని తరహా పాత్రలను పోషించిన ఈ అందాల భామ త్వరలోనే మరిన్ని ప్రాజెక్టులతో ముందుకు రానుంది. భారతీయ సినీ పరిశ్రమలో ప్రవేశించి 20 ఏళ్లు పూర్తిచేసుకున్న ఈ భామ ప్రస్తుతం తెలుగులో ఓ రెండు చిత్రాలతో పాటు తమిళంలో మూడు సినిమాలు, కన్నడ, హిందీ భాషల్లో రెండు చిత్రాలతో బిజీగా ఉంది.



## ఘనంగా కన్యా కుమారి ప్రీరిలీజ్ ఈవెంట్

ప్రముఖ నటి మధు శాలిని సమర్పకురాలిగా గ్రామీణ నేపథ్యంలో సాగే ప్రేమకథ చిత్రం 'కన్యా కుమారి'. రాడికల్ పిక్చర్స్ బ్యానర్ప సృజన్ అట్టాడ రచన, దర్శకత్వం, నిర్మాతగా రూపొందించిన ఈ చిత్రంలో గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ ప్రధాన పాత్రల్లో నటించారు. ఈ చిత్రం ఆగస్టు 27న వినాయక చవితి సందర్భంగా రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా మేకర్స్ ట్రైలర్ లాంచ్ అండ్ ప్రీ రిలీజ్ ఈవెంట్ నిర్వహించారు. ట్రైలర్ లాంచ్ ఈవెంట్ లో స్టార్ బాయ్ సిద్దు జొన్నలగడ్డ మాట్లాడుతూ టీజర్ చూసిన వెంటనే ఈవెంట్ కి రావాలని అనుకున్నాను. ఈ సినిమా టీజర్ చూడగానే రైటింగ్ ఇంట్రెస్టింగ్ గా అనిపించింది. టీజర్ లో వైబ్ వుంది.కచ్చితంగా బాగుంటుందనే ఫీలింగ్ కలిగింది. టీజర్ చాలా ఆర్గానిక్ గా అనిపించింది. శ్రీ చరణ్, గీత్ పెర్ఫార్మన్స్ చాలా ఆర్గానిక్ గా ఉంది. క్యారెక్టర్స్ లో ఒదిగిపోయారు. కచ్చితంగా ఇది చాలా మంచి సినిమా అవుతుందని నమ్మకం కలిగింది.అని అన్నారు. డైరెక్టర్ శశి కుమార్ తిక్క మాట్లాడుతూ.. శాలినితో గూఢచారి సినిమాకి వర్క్ చేసాం. తన కాలికి గాయమైనప్పటికీ కూడా యాక్షన్ సీక్వెన్స్ చేసింది. నిజంగా తన ఒక ఫైటర్. ఎన్ని వచ్చినా జీవితంలో ఫైట్ చేయాలనేది ఆమె దగ్గర నేర్చుకున్నాను. ట్రైలర్ నాకు చాలా నచ్చింది. శ్రీ చరణ్ చాలా అద్భుతంగా నటించాడు అని చెప్పారు. చిత్ర సమర్పకురాలు మధు శాలిని మాట్లాడుతూ సినిమా చాలా అద్భుతంగా వచ్చింది. శ్రీ చరణ్ గీత్ వాళ్ళిద్దరు కూడా అక్కడే పుట్టి పెరిగినట్టు యాక్ట్ చేశారు. బన్నీ వాసు సపోర్ట్ తో ఈ సినిమాని రిలీజ్ చేస్తున్నాము. ఆగస్టు 27న ఈ సినిమా రిలీజ్ కాబోతోంది. సృజన్ అద్భుతమైన సినిమాని మన ముందుకు తీసుకొచ్చారు అని ఆమె అన్నారు. హీరోయిన్ గీత్ సైని మాట్లాడుతూ ఇన్ని సవాళ్లు ఎదుర్కొని ఇంత అద్భుతమైన సినిమా తీశారు. నిజంగా ఆయన మాకు స్ఫూర్తి . తప్పకుండా ఆయన కష్టానికి ఫలితం దక్కుతుంది. తప్పకుండా అయిన ఇండియన్ సినిమాలో గ్రేటెస్ట్ డైరెక్టర్ అవుతారు. తప్పకుండా ఆగస్టు 27న ఈ సినిమా థియేటర్స్ లో చూసి ఎంజాయ్ చేస్తారని కోరుకుంటున్నాను. డైరెక్టర్ సృజన్ మాట్లాడుతూ సినిమా నిర్మించడం కూడా ఒక గుడి కట్టడం లాంటిదే. కన్యాకుమారిని అలానే నిర్మించాను. ప్రేక్షకులు సినిమా చూసి గొప్ప ఆనందాన్ని పొందాలని మంచి ఉద్దేశంతో ఈ సినిమా చేశాను. అందుకే ఈ సినిమాకి ఆర్గానిక్ ప్రేమ కథ ని పెట్టాను. ఇందులో పాత్రలన్నీ కూడా రియల్ లైఫ్ నుంచి వచ్చినవే. ఈ సినిమా పాత్రలోనే చాలా మంచి డ్రామా ఉంది. ఈ సినిమా చూసి మీకు నచ్చితే ఆ క్రెడిట్ బన్నీ వాసుకి దక్కుతుంది. బన్నీ వాసు లేకపోతే ఈ సినిమా థియేటర్స్ లోకి రాదు. ఆగస్టు 27న సినిమా విడుదల అవుతోంది అని చెప్పారు. ఈకార్యక్రమంలో శ్రీ చరణ్ తదితరులు పాల్గొన్నారు.





# స్థానికం
REGIONAL NEWS
కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి

కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**ప్రజాపక్షం/పెద్దపల్లి రూరల్:** వసతి గృహాలను శుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం పెద్ద కల్వలోని ప్రభుత్వ బీసీ బాలికల వసతి గృహం ఆకస్మికంగా తనిఖీ చేశారు.వసతీ గృహంలోని విద్యార్థులు, స్టాఫ్ వివరాలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. రిజిస్టర్ లను కలెక్టర్ పరిశీలించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ వసతి గృహం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం కామన్ డైట్ మెన్యూ పకడ్బందీగా అమలు చేయాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు అందించే ఆహర పదార్ధాల నాణ్యతను రెగ్యులర్ గా చెక్ చేసుకోవాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభావంతుల్ని ప్రోత్సహించడం ప్రభుత్వ బాధ్యత

స్విమ్మర్లను అభినందించిన మంత్రి లక్ష్మణ్‌కుమార్



**ప్రజాపక్షం/జగిత్యాల:** ప్రతిభవంతుల్ని ప్రోత్సాహించడం రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ మైనార్టీ వికలాంగుల సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా స్థాయి నుంచి అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన స్విమ్మర్లు క్వీని విక్టోరియా గంధం, స్టీపెన్ కుమార్ గంధంలను రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి లక్ష్మన్‌కుమార్ గురువారం అభినందించారు. సచివాలయంలో తనను కలిసిన స్విమ్మర్లకు మంత్రి అడ్లూరి అభినందనలు తెలిపారు. తల్లి కొడుకులైన ఈ ఇద్దరు తమ ప్రతిభతో అనేక అవార్డులను సొంతం చేసుకున్నారు ఆసియా గిన్నిస్ రికార్డులలో స్థానం దక్కించుకోవడం ఇంగ్లీష్ ఛానల్‌ను ఈదిన తొలి తెలుగు మహిళగా క్వీని విక్టోరియా చరిత్ర సృష్టించారు. రామసేతును విజయవంతంగా ఈదడం వంటి అరుదైన విజయాలను సొంతం చేసుకున్నారు. తల్లి తనయులు తమ స్విమ్మింగ్ ప్రతిభతో దేశానికి పేరు తెచ్చారు. త్వరలో వీరు అమెరికాలోని కాథలినా ఛానెల్ ను ఈదేందుకు సిద్ధమవుతున్నారు. ఈయాత్ర కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని మంత్రి లక్ష్మణ్ కుమార్ స్పష్టం చేశారు. త్వరలో ముఖ్యమంత్రికి నివేదించి తగిన ఆర్థిక సాయం, ప్రోత్సాహం అందజేస్తామని చెబుతూ అంతర్జాతీయ స్థాయిలో తెలంగాణకు గర్వకారణంగా నిలుస్తున్న వీరిని అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి హామీ ఇచ్చారు. క్వీని విక్టోరియా గంధం, స్టీఫెన్‌కుమార్ గంధంకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ప్రచారంతో ప్రపంచ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించి రాష్ట్రానికి దేశానికి గొప్ప పేరు సాధించి పెడతామని స్విమ్మర్లు ధీమా వ్యక్తం చేశారు.

## సంక్షేమ హాస్టళ్లు.. సంక్షోభ హాస్టళ్లుగా మారాయి



**ప్రజాపక్షం/ సిద్దిపేట :** సంక్షేమ హాస్టళ్లు..సంక్షోభ హాస్టళ్లుగా మారాయని.. హాస్టల్‌లో ఉండే విద్యార్థులను కన్నబిడ్డల వలే చూసుకోవాలని మాజీ మంత్రి హరీష్‌రావు అన్నారు. కాంగ్రెస్ సర్కాలో సంక్షేమ హాస్టళ్లపై ప్రజలకు నమ్మకం పోయిందన్నారు. సిఎం గ్రీన్ చానల్ ఏమైందని.. అసెంబ్లీ సాక్షిగా సిఎం రేవంత్‌రెడ్డి, డిపూటి సిఎం బట్టి విక్రమార్క మాటలు వట్టిమాటలేనా అని హరీష్‌రావు ప్రశ్నించారు. చెప్పుడోమో.. ఘనం చేసుడోమో శున్యమని విమర్శించారు. సిద్దిపేటలో వసతి గృహాల సలహాసంఘం సమావేశంలో హరీష్‌రావు పాల్గొని మాట్లాడారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుండి దుస్తులు లేక విద్యార్థులు హాస్టల్ విద్యార్థులు అవస్థలు పడుతున్నారన్నారు. విద్యార్థులకు ఆరు నెలల నుండి మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు రాక సిఎం అవస్థలు పడుతుంటే సిఎం రేవంత్‌రెడ్డికి కన్పించటం లేదా అన్నారు. స్టూడెంట్ మేనేజ్‌మెంట్ హాస్టల్ విద్యార్థులకు ఇచ్చే 500 రూపాయల ప్యాకెట్ మని రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉందన్నారు. హాస్టల్‌లో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల పెండింగ్‌పై మండిపడ్డారు. వెంటనే విద్యార్థులకు మెస్‌చార్జీలు, కాస్మోటిక్ చార్జీలు చెల్లించాలని డిమాండ్ చేశారు. అద్దే భవనాల్లో కొనసాగుతున్న హాస్టల్‌లో అద్దే కట్టడం లేదని తన వంతుగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తానన్నారు. హాస్టల్ మరమ్మతులు చేపట్టేందుకు జిలాల కలెక్టర్‌కు నివేదిక ఇవ్వాలన్నారు. అందరి సమన్వయంతో హాస్టల్స్‌ను పరిరక్షించుకుందామని, విద్యార్థులకు ఇబ్బందులు రాకుండ కృషిచేస్తామన్నారు. ఈసమావేశంలో మండల విద్యాధికారులు, ఎంపిడిఓలు, తహశీల్దార్లు, .సంక్షేమ శాఖ అధికారులు పాల్గొన్నారు.

**సిద్దిపేటలో అంగన్‌వాడీలు, గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు 2.40 కోట్లు మంజూరు**

సిద్దిపేట నియోజక వర్గంలో 10 అంగన్‌వాడి భవనాలు, 8 గ్రామపంచాయతీ భవనాల నిర్మాణాలకు 2.40 కోట్లు మంజూరైనట్లు మాజీ మంత్రి హరీష్‌రావు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తగా ఏర్పడిన గ్రామ పంచాయతీ భవనాలు లేక అద్దే భవనాల్లో కార్యకలపాలు సాగిస్తున్నారన్నారు. కొన్ని భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయన్నారు. అదే విధంగా అద్దే భవనాల్లో అంగన్‌వాడి స్కూల్స్ నడిపిస్తున్నారన్నారు. ఇటు కిరాయిలు చెల్లించని పరిస్థితి నుండి మరోవైపు భవనాలు లేక ఇబ్బందులు పడుతున్నందున ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందించగానే వాటి నిర్మాణానికి నిధులు మంజూరైనట్లు తెలిపారు. సిద్దిపేట నియోజక వర్గం కొత్తగా ఏర్పాటు అయిన గ్రామ పంచాయతీలు 20 లక్షల చొప్పున 1.60 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. నియోజక వర్గంలోని 10 అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలకు 80లక్షలు మంజూరైనట్లు తెలిపారు.సిద్దిపేట రూరల్ మండలం పుల్లూరు, ఇర్కోడ్, అర్బన్ మండలం బూరుగుపల్లి, మందపల్లి గ్రామాల్లో , చిన్నకోడూరు మండలం మేడిపల్లి, రామంచ, నంగునూర్ మండలం ముగ్దుంపూర్, బద్దిపడగ , నారాయణరావు పేట మండలం నారాయణరావుపేట, జక్కాపూర్ (శనగకుంట) గ్రామాల్లో నూతన భవన నిర్మాణాల భవనాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు

## కాంగ్రెస్‌లో చేరిన రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ కృష్ణ దేవరావు

కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించిన ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్



**ప్రజాపక్షం/వేములవాడ:** వేములవాడ అర్బన్ మండలం రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణదేవరావు గురువారం కాంగ్రెస్ పార్టీలో చేరారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కాంగ్రెస్ పార్టీ సమావేశంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, సిరిసిల్ల నియోజకవర్గ ఇన్చార్జి కేకే మహేందర్‌రెడ్డి సమక్షంలో పార్టీ లో చేరారు. ఆయనకు ఆది శ్రీనివాస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రేగులపాటి కృష్ణదేవరావు గతంలో వేములవాడ ఎమ్మెల్యేలుగా గెలిచినవారు కనీసం చూద్దామంటే కనిపించలేదని కానీ ప్రస్తుత ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ప్రతిక్షణం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సంక్షేమం కోసం పాటుపడుతున్నారని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు నచ్చి నేడు కాంగ్రెస్ పార్టీలో చేరడం జరిగిందని తెలిపారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ పార్టీ ఏ బాధ్యత ఇచ్చిన నెరవేరుస్తూ ముందుకు పోతానని పేర్కొన్నారు.

## 24న 'జనహిత' పాదయాత్ర

గంగాధర మండలం ఉప్పర మల్యాలలో ప్రారంభం
మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి
హాజరుకానున్న రాష్ట్ర వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్, పిసిసి అధ్యక్షుడు మహేశ్ కుమార్‌గౌడ్



**ప్రజాపక్షం/కరీంనగర్:** రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చేపట్టిన జనహిత పాదయాత్ర కార్యక్రమం ఈ నెల 24న కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గం గంగాధర మండలం ఉప్పర మల్యాలలో ప్రారంభం కానున్నట్లు రాష్ట్ర రవాణా, బిసి సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కరీంనగర్‌లోని డిసిసి కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో జనహిత పాదయాత్ర వివరాలను వెల్లడించారు. పాదయాత్రలో వ్యవహారాల ఇంచార్జీ మీనాక్షి నటరాజన్‌తో పాటు పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్ గౌడ్, రాష్ట్ర మంత్రులు ఉత్తమ్ కుమార్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వర రావు, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, పొన్నం ప్రభాకర్, అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో పాటు పార్టీ విప్ ఆది శ్రీనివాస్, ఎమ్మెల్యేలు, కార్పోరేషన్ చైర్మన్లు, మండల పార్టీ అధ్యక్షులు, బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు, పార్టీ నాయకులు పాల్గొంటారని మంత్రి పొన్నం తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడిన 19 నెలల కాలంలో చేపట్టిన ప్రజా సంక్షేమ కార్యక్రమాల స్పందన తెలుసుకోవడంతో పాటు, ప్రజల నుంచి సలహాలు, సూచనలు తీసుకుని ప్రజలతో మమేకయ్యేందుకు ఏర్పాటు చేసిన జనహిత రెండో విడత కార్యక్రమం ఈనెల 24న గంగాధర మండలం ఉప్పర మల్యాలలో సాయంత్రం 5గంటలకు ప్రారంభమై మధుర నగర్ చౌరస్తా వరకు పాదయాత్ర కొనసాగుతందన్నారు. ఈ విలేకర్ల సమావేశంలో చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, జనహిత కార్యక్రమ రాష్ట్ర కోఆర్డినేటర్ , రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ రాజ్ ఠాకూర్, కాంగ్రెస్ పార్టీ కరీంనగర్ పార్లమెంట్ నియోజక వర్గ ఇంచార్జి వెలిచాల రాజేందర్ రావు,డిసిసి వర్కింగ్‌ప్రెసిడెంట్ పద్మాకర్ రెడ్డి, అకారపు భాస్కర్ రెడ్డి, వైద్యుల అంజన్ కుమార్ పాల్గొన్నారు.

## యూరియా కోసం వాగ్వాదం

**ప్రజాపక్షం/ఎల్లారెడ్డిపేట:** అన్నదాతకు యూరియా కష్టాలు తప్పక అరిగోసపడుతూ ఎల్లారడ్డిపేట మండలం పదిర గ్రామంలోని రైతులు ప్రొద్దున్నే ఆదర్శ గ్రామైఖ్య సంఘం వద్ద పడిగాపులు కాసారు. పదిర గ్రామంతో పాటు హరిదాస్‌నగర్ రైతులు కూడా యూరియా కోసం వేచి చూస్తుండగా, పదిర గ్రామానికే యూరియా ఇవ్వడం పట్ల రైతులు అసంతృప్తితో వాగ్వాదానికి దిగారు. పోలీసుల రక్షణతో యూరియా బస్తాలను పంపిణీ చేశారు. హరిదాస్‌నగర్ గ్రామస్తులు మీడియాకు సమాచారం ఇవ్వడంతో అన్ని గ్రామాలకు సరఫరా చేస్తున్నామని బదులిచ్చారు. ఇదే విషయం పై మండల వ్యవసాయ అధికారి రాజశేఖర్ తో మాట్లాడగా అక్కడి చేరుకొని రైతులను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. రెండు గ్రామాలకు కలిసి యూరియా పంపిణీ చేస్తామని మాట ఇచ్చిన అధికారులు, వచ్చిన బస్తాలు మొత్తం పదిర గ్రామానికే ఇచ్చారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. తదుపరి వచ్చే లారీ లోడును మరుసటి రోజు హరిదాస్‌నగర్ రైతులకు ఇస్తామని వ్యవసాయ అధికారి చెప్పడంతో రైతులు శాంతించారు. యూరియా కోసం ఆందోళన చేసిన వారిలో పదిర, హరిదాస్‌నగర్ రైతులు ఉన్నారు.



## భూ సమస్యల పరిష్కారానికి పటిష్ఠ చర్యలు: కలెక్టర్



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** భూ సమస్యల పరిష్కారానికి అధికారులు పటిష్ట చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు.గురువారం జిల్లా కలెక్టర్ కాల్వ శ్రీరాంపూర్ మండలంలో విస్తృతంగా పర్యటించారు. శ్రీరాంపూర్ మండలంలోని కూనారం, ఇదులాపూర్ గ్రామంలో మిస్సింగ్ సర్వే నెంబర్ పట్టా కోసం వచ్చిన దరఖాస్తులను క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. రెవెన్యూ సదస్సుల్లో వచ్చిన భూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. అనంతరం జాఫర్ ఖాన్ పేట, ఇదులాపూర్ గ్రామంలోని అప్పర్ ప్రైమరీ పాఠశాలను, అంగన్వాడీ కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు ఉండేలా చూడాలని, పిల్లలకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకునేలా గ్రహణశక్తి పెంపొందించాలని అన్నారు.ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ వెంట తహసీల్దార్ జగదీశ్వర్ రావు, డి.టి. శంకర్, సర్వేయర్ రాజు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముందుకు

ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్



**ప్రజాపక్షం/రాజన్న సిరిసిల్ల :** ప్రజా ప్రభుత్వంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నమని, రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థుల విజయానికి కృషి చేస్తామని వేములవాడ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పేర్కొన్నారు. గురువారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో జిల్లా కాంగ్రెస్ పార్టీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఉమ్మడి కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అద్దంకి దయాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, సిరిసిల్ల కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ కేకే మహేందర్ రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వీరు మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో కార్యకర్తలను సర్పంచులుగా ఎంపీటీసీలుగా జడ్పిటిసిలుగా గెలిపించే బాధ్యత తీసుకుంటానని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. యూరియా పై కేటీఆర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కావాలనే బదనాం చేస్తున్నారని మండిపడ్డారు. 10 సంవత్సరాలు మంత్రిగా పనిచేసిన కేటీఆర్ కనీస సోయి లేకుండా మాట్లాడుతున్నారని అన్నారు. యూరియా సరఫరా కేంద్రం పరిధిలోకి వస్తుందని కేటీఆర్ బిజెపి పై ఎలాంటి ఆరోపణలు చేయకుండా కేవలం కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వాన్ని బధనం చేస్తున్నారని నిన్న కేటీఆర్ మాట్లాడుతూ ఉపరాష్ట్రపతి ఎన్నికల్లో బిజెపికే సపోర్ట్ చేస్తా అన్న చెందాన మాట్లాడారని తెలిపారు.అద్దంకి దయాకర్ మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లా రాజకీయ చైతన్యానికి ప్రతీక అని అన్నారు. పిసిసి పదవుల కోసం తీసుకున్న అప్లికేషన్లలో రాష్ట్రవ్యాప్తంగా సిరిసిల్ల జిల్లా పరిధిలో సుమారు 1700 అప్లికేషన్లు వచ్చాయని తెలిపారు. అనంతరం రుద్రవరం సింగిల్ విండో చైర్మన్ రేగులపాటి కృష్ణ దేవా రావును ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, అద్దంకి దయాకర్ కండువా కప్పి కాంగ్రెస్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నాగుల సత్యనారాయణ గౌడ్, ప్రకాష్, సంగీతం శ్రీనివాస్, వెలుముల స్వరూప, వనిత, గడ్డం నరసయ్య, సూర దేవరాజు, బాలరాజు, జగన్మోహన్ రెడ్డి, చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్, ప్రవీణ్ జె టోనీ, చందన, కాంగ్రెస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రాష్ట్ర మహాసభల స్ఫూర్తితో సిపిఐని మరింత బలోపేతం



సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** గ్రామ, మండల, జిల్లా మహాసభలు సంపూర్ణంగా నిర్వహించుకుని రాష్ట్ర మహాసభలు నిర్వహించుకుంటున్న నేపథ్యంలో అనేక ప్రజా సమస్యలపై సుదీర్ఘంగా చర్చించి రానున్న కాలంలో మహాసభల స్ఫూర్తితో జిల్లాలో ప్రజలకు మరింత చేరువై పార్టీని బలోపేతం చేస్తామని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ తెలిపారు. మేడ్చల్ జిల్లా గాజుల రామవరంలో జరుగుతున్న సిపిఐ రాష్ట్ర ప్రతినిధుల మహాసభల్లో రాష్ట్ర కార్యదర్శి ప్రవేశపెట్టిన రాజకీయ ముసాయిదా, కార్యక్రమాల రిపోర్టుపై జరిగిన చర్చల్లో గురువారం సిపిఐ కరీంనగర్ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ సంధర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ కరీంనగర్ జిల్లాలో 16 మండలాలకు గాను 15 మండలాల్లో పార్టీ నిర్మాణం, సభ్యత్వం కలిగి ఉండి నిత్యం ప్రజా సమస్యలపై పార్టీతో పాటు ప్రజా సంఘాల ఆద్వర్యంలో పోరాటాలను నిర్వహిస్తున్నామని, జిల్లాలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి సిపిఐ శ్రేణులు సిద్దంగా ఉన్నారని తెలిపారు. రాష్ట్ర మహాసభల్లో జిల్లా ప్రతినిధులు పాల్గొన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఐ సత్తా చాటాలి



సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సిపిఐ పార్టీ అని, పార్టీ ప్రతిష్టకు, రాబోవు స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ తరపున పోటీ చేసి సత్తా చాటాలని పెద్దపెల్లి జిల్లా సిపిఐ కార్యదర్శి తాండ్ర సదానందం అన్నారు. గురువారం రోజున మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గాజులరామారం లో జరుగుతున్న సిపిఐ పార్టీ తెలంగాణ 4 వ రాష్ట్ర మహాసభల సందర్భంగా పెద్దపల్లి జిల్లా పార్టీ ప్రజా సంఘాల నివేదికను ప్రవేశపెట్టిన అనంతరం ఆయన మాట్లాడుతూ దేశంలో బిజెపి సర్కార్ కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలను ఆలం ఇస్తుందని, కగార్ పేరుతో పచ్చటి అడవుల్లో రక్తపాతం సృష్టిస్తుందని దీనిని సిపిఐ పార్టీగా తీవ్రంగా ఖండిస్తున్నామని, కగార్ ఆపరేషన్ను వెంటనే ఆపేయాలని ఆయన డిమాండ్ చేశారు. సిపిఐ ఆధ్వర్యంలో పెద్దపెల్లి జిల్లాలో పార్టీ బలోపేతానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు.

## ప్రపంచ దేశాలకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయం


ఎఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణుకుంట్ల ప్రీతం



**ప్రజాపక్షం/పెద్దపల్లి:** ప్రపంచ దేశాలకు కమ్యూనిజమే ప్రత్యామ్నాయమని, కమ్యూనిజం అజయంగా ఉంటుందని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రేణిగుంట ప్రీతం, ఎన్ ఎఫ్ ఐ డబ్ల్యూ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శి రేణిగుంట్ల రమ అన్నారు. గురువారం రోజున మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా గాజుల రామరం హైదరాబాద్ లో జరుగుతున్న సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహా సభలకు పెద్దపల్లి జిల్లా నుండి తల్లి తనయుడు ప్రతినిధులుగా హాజరయ్యారు.పెద్దలు చెప్పిన మాట వినని ఈ రోజుల్లో తల్లి ఏలు పట్టుకొనిఎర్ర జెండా పట్టుకొని పేద ప్రజల అండ సిపిఐ జెండా అంటూ ఆనాడే నినాదిస్తూ బడుగు, బలహీన వర్గాల సమస్యల పరిష్కారమే ధ్యేయమని పోరు చేశారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాలపై ,అఘాయిత్యాల పై ఎన్ఎఫ్ఐ డబ్ల్యూ పెద్దపెల్లి జిల్లా కార్యదర్శిగా అటు తల్లి ,విద్యా రంగ సమస్యల పరిష్కారమే నా కర్తవ్యం అని ఏఐఎస్ఎఫ్ పెద్దపల్లి జిల్లా కార్యదర్శిగా ఇటు తనయుడు భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ ప్రజా సంఘాలలో చురుకుగా పని చేస్తున్నారు. భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐలో వారసత్వం కొనసాగిస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నారు. పార్టీలో చురుకుగా పని చేస్తునందున రాష్ట్ర నాయకత్వం హర్షించారు.

## ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చర్యలు

కలెక్టర్ హైమావతి




**ప్రజాపక్షం/సిద్దిపేట:** రైతుబజార్లు, మార్కెట్ యార్డుకు వచ్చే ప్రజలకు ఏలాంటి ఇబ్బందులు కలుగకుండ అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ హైమావతి తెలిపారు. గురువారం సిద్దిపేట సమీకృత కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు, పశు సంవర్ధ శాఖ అధికారులు, వ్యవసాయ మార్కెట్ కమిటి కార్యదర్శులతో కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ మార్కెట్ల ఆదాయం పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని తగు సూచనలు చేశారు. రాబోయే వానకాలం, మార్కెట్ సీజన్‌కు జిల్లాలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు కావాల్సిన ఎంఎస్‌పి పరికరాలను రైతుల సౌకర్యార్థం సిద్ధంగా ఉంచుకోవాలని తెలిపారు. పశువుల సంరక్షణకు శాఖపరమైన అన్ని జాగ్రత్తలు పాటించాలని కలెక్టర్ హైమావతి తెలిపారు. పశుశుల మేతలో కొరత లేకుండ చూడలని, ఎప్పటికప్పుడు పశు విజ్ఞాన సదస్సులు నిర్వహించాలన్నారు. పశువులకు వ్యాధులు సంక్రమించకుండ ఎప్పటికప్పుడు సమీక్షించుకుంటూ వ్యాక్సినేషన్ అందించాలన్నారు. అన్ని పశువైద్యశాఖల్లో అవసరమైన మెడిసన్ అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. పౌల్ట్రీ షెడ్లలో కోళ్లు చనిపోయినప్పుడు వాటిని సక్రమంగా డిస్పోస్ చేయాలన్నారు. ప్రతి ఫామ్‌కు తప్పనిసరిగా కంపౌండ్ వాల్ ఉండేలా చూడాలని ఆదేశించారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యావేక్షించాలని ఆదేశించారు. పౌల్ట్రీ పార్మ్ తనిఖీలో అవసరమున్న చోట స్థానిక తహశీల్దార్ సహకారం అందిస్తామన్నారు. ఈకార్యక్రమంలో జిల్లా మార్కెటింగ్ అధికారి నాగరాజు, మార్కెట్ కమిటి సిబ్బంది, పూర్ణచందర్, సహాయ సంచాలకులు. మండల పశువైద్య అధికారులు పాల్గొన్నారు.

## పకడ్బందీగా బాల భరోసా సర్వే

కలెక్టర్ పమేలా సత్పతి

**ప్రజాపక్షం/కరీంనగర్‌సిటీ:** బాల భరోసా కార్యక్రమంలో భాగంగా జిల్లాలోని ఐదు సంవత్సరాల్లోపు పిల్లల సర్వేను పకడ్బందీగా చేపట్టాలని, తద్వారా ప్రత్యేక అవసరాలున్న వారిని గుర్తించాలని జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి అన్నారు. మహిళాభివృద్ధి శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో బాల భరోసా కార్యక్రమంపై కలెక్టరేట్ కాన్ఫరెన్స హాలు లో గురువారం సమావేశం జరిగింది. ఈ సంధర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ఐదు సంవత్సరాల్లోపు గల సుమారు 42 వేల మంది పిల్లల సర్వేను అంగన్‌వాడీ టీచర్లు, ఆర్‌బిఎస్‌కె సిబ్బంది చేపట్టారని తెలిపారు. 42 అంశాలతో కూడిన ప్రశ్నావళిని పూర్తి చేశారని, అయితే ఈ సర్వేను మరొకసారి సరి చూడాలని తెలిపారు. సర్వే సరిగ్గా చేయకపోతే ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లలను గుర్తించలేక పోతామని, తద్వారా వారికి ప్రభుత్వం అందించే వివిధ సేవలకు దూరమవుతారన్నారు. ప్రభుత్వం నుంచి బాల భరోసా కార్యక్రమానికి సంబంధించి పూర్తి మార్గదర్శకాలు వచ్చాక ప్రత్యేక అవసరాలు ఉన్న పిల్లల కోసం చేపట్టాల్సిన కార్యక్రమాలను పక్కాగా అమలు చేయాలని తెలిపారు. అతిగా బరువు తక్కువగా ఉన్న పిల్లలను గుర్తించి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని ఎన్‌ఆర్‌సి సెంటర్‌కు రిఫర్ చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, జిల్లా సంక్షేమ అధికారి సరస్వతి, జిల్లా వైద్యాధికారి వెంకటరమణ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి సాజిత,సనా, సబిత, శ్రీమతి, నర్సింగారాణి, సుగుణ, ఐసిడిఎస్, ఆరోగ్యశాఖ అధికారులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఇంటర్మీడియట్ కళాశాలలను తనిఖీ చేయండి: ఈర్ల

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** గురువారం రోజున పెద్దపల్లి జిల్లాలోని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు మరియు ఓకేషనల్ జూనియర్ కళాశాలలు తనిఖీ చేయాలని ఏఐఎస్‌బి పెద్దపల్లి జిల్లా కన్వీనర్ ఈర్ల రామచందర్ జిల్లా ఇంటర్మీడియట్ బోర్డ్ విద్యాధికారి కల్పన కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కళాశాలను తనిఖీ చేసి నియమ నిబంధనలు పాటించని కళాశాలలపై చర్యలు తీసుకోవాలని, కనీస వసతులు లేని కళాశాలలు ఎన్నో ఉన్నాయని వాటిని తనిఖీ చేసి కనీస సౌకర్యాలు కల్పించేటట్లు చర్యలు తీసుకోవాలని ఇంటర్మీడియట్ విద్యాధికారిని కోరారు.



# స్థానికం

REGIONAL NEWS

కరీంనగర్, మెదక్ ఆదిలాబాద్, నిజామాబాద్

## రోడ్ల విస్తరణకు నిధులు ఇవ్వండి

### మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డికి ఎమ్మెల్యే పటేల్ వినతి

**ప్రజాపక్షం/ఖానాపూర్ :** ఖానాపూర్ నియోజకవర్గంలో రోడ్ల బలోపేతం కాదు,విస్తరణ అభివృద్ధికి అధిక నిధులు ఇవ్వండి అని మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వినతిపత్రం అందజేశారు. ఖానాపూర్ నుండి బెల్లాల్,అదే విధంగా ఖానాపూర్ నుండి తర్లపాడు,ఉట్నూర్ నుండి గుడిహత్నూర్,ఉట్నూర్ నుండి హస్నాపూర్,నార్నూర్ చౌరస్తా,కలమడుగు నుండి జన్నారం, జన్నారం నుండి కావ్వాల్ రోడ్లను విస్తరణ చేయాలని కోరారు. మంత్రి స్పందించారు. ప్రిన్సిపల్ సెక్రటరీ వికాస్ రాజ్‌తో ఈ ప్రతిపాధనలను హ్యామ్ ప్రాజెక్ట్‌లో పెట్టాలని ఆదేశించారు.



## అభివృద్ధి పనులపై పర్యవేక్షణ



**ప్రజాపక్షం/మందమర్రి :** మండలంలోని అందుగుల పేట గ్రామ పంచాయతీలో గురువారం ఎంపిడిఒ రాజేశ్వర్ గ్రామ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. ఈ సందర్భంగా గ్రామంలో పారిశుధ్య పరిస్థితులు పరిశీలించి, గ్రామ ప్రజలకు శుభ్రతపై మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే ఇందిరమ్మ ఇండ్లనిర్మాణ పనుల ప్రగతిని పరిశీలించి కూలీలతో, లబ్దిదారులతో మాట్లాడి నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆదేశించారు. గ్రామ ప్రజల సౌకర్యాల కోసం ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి కార్యక్రమాలు సమర్థవంతంగా అమలవుతున్నాయా లేదా అని ఎంపీడీఓ పరిశీలించారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



**ప్రజాపక్షం/ఆసిఫాబాద్ :** ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన చెక్కులను ఆసిఫాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే కోవలక్ష్మి లబ్దిదారులకు అందజేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో ఏర్పాటు చేసిన కార్యక్రమలంలో పాల్గొని మాట్లాడారు. వైద్య ఖర్చులు, విద్య, ఇతర అత్యవసర కోసం ఆర్థిక సహాయం కోరిన పేద, మధ్యతరగతి కుటుంబాలకు సీఎంఆర్‌ఎఫ్ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి సకాలంలో సహాయం అందేలా చూస్తున్నామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. నియోజకవర్గ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎమ్మెల్యే పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో వివిధ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు లబ్దిదారులు పాల్గొనానరు.

## మైనర్లు వాహనాలు నడపొద్దు

**ప్రజాపక్షం/పెంచికల్‌పేట్ :** మైనర్లు వాహనాలు నడొపద్దని ఎస్ఐ అనిల్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని చేడ్వాయి ప్రధాన రహదారిపై వాహనాల తనిఖీ చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ వాహనదారులు తప్పనిసరిగా వాహన పత్రాలు కలిగి ఉండాలని వాహనాలు ఇచ్చి డ్రైవింగ్ చేసినట్లయితే వాహనదారులపై తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ర్యాస్ డ్రైవింగ్ చేయరాదని తప్పనిసరిగా లైసెన్స్ కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఈ తనిఖీలో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గోల్ హనుమాన్ ఆలయానికి సేవ

### ప్రభుత్వ సలహాదారు షబ్బీర్‌అలీ



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** గోల్‌హనమాన్ ఆలయాభివృద్ధికి సేవ చేసే అవకాశం రావటం సంతోషంగా ఉందని ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ అన్నారు. గురువారం జిల్లా పర్యటనలో భాగంగా మొదట గోల్ హనుమాన్ ఆలయ కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవంలో పాల్గొని పట్టణ కేంద్రంలోని గోల్ హనుమాన్ దేవాలయ కమిటీ నూతన చైర్మన్ పాలకవర్గ సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. అనంతరం పట్టణంలోని ఆరె కటికె సంఘంలో జిల్లా నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార చేయించి మాట్లాడారు. గోల్ హనుమాన్ చాలా పురాతనమైనదన్నారు. కార్యక్రమంలో తాహెర్‌బిన్ హందాన్, కేశ వేణు, రత్నాకర్ నాయకులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళకూ జీవనోపాధి



**ప్రజాపక్షం/దిలావర్ పూర్ :** చైతన్య మండల సమైక్య సమావేశం గురువారం రోజున దిలావర్‌పూర్ నందు నిర్వహించడం జరిగింది.ఈ సమావేశంలో సెర్ప్ ఏపిడి చరణ్ దాస్,ఈజీఎస్ ఏపీడీ నాగవర్ధన్,కన్వర్ట్ జెన్సీ సమావేశంలో సభ్యులకు కావలసిన జీవనోపాదులు పండ్ల తోటల పెంపకం ,కోళ్లు,గొర్రె పిల్లలు మేక పిల్లలు గేదెలు షెడ్లు ఇవ్వడం జరుగుతుందని చెప్పడం జరిగింది.అదే మాదిరిగా ఐదు గుంటల భూమిలో ఫిష్ ఫండ్స్ చేసుకున్న వారికి కూడా ఫిష్ ఫండ్స్ ఫ్రీగా ఇవ్వడం జరుగుతుంది.అని అలాగే కిషోర బాలికల సంఘాలు,దివ్యంగుల సంఘాలు,వయోవృద్ధుల సంఘాలు కొత్త సంఘాలు ఏర్పాటు చెయ్యాలని నిరక్ష్యరాలు ఉన్న మహిళకు చదువు నేర్పించాలని చెప్పారు.7,8 తరగతి చదివి బడి మనివేసిన మహిళలు పదవ తరగతి ఎగ్జామ్స్ రాసుకోవడానికి అవకాశం ఉన్నదని అవగాహనా కల్పించడం జరిగింది.ఈ సమావేశంలో అధ్యక్షులురాలు సునీత,ఏపీఎం భోసు ఏపీవో దివ్య రెడ్డి,సీసీ లు టిఏ లు గ్రామ సంఘాల అధ్యక్షులురాళ్లు,ఎంఎస్ స్టాఫ్,ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

## లంచం తీసుకుంటూ.. 'ఎసిబి వలలో'

**ప్రజాపక్షం / ఆర్మూర్ :** మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్,యోగ మాస్టర్ ఎంవిఐల రాష్ట్ర అధ్యక్షుడు గుర్రం వివేకానంద రెడ్డి ఆయన అసిస్టెంట్ కం డ్రైవర్ తిరుపతి 25 వేల రూపాయల లంచం తీసుకుంటు రెడ్ హ్యాండెడ్‌గా గురువారం ఏసిబి అధికారులకు తన కార్యాలయంలో చిక్కారు. నిజామాబాద్ కేంద్రానికి చెందిన ఆర్‌డివో ఏజెంట్ వద్ద ఒక ఫైల్‌పై సంతకం చేయడానికి సదరు ఏజెంట్ వదద ఎంవిఐ లంచం డిమాండ్ చేసినట్టుగా బాధితుడు ఏసిబి అధికారులను ఆశ్రయించాడు. ఇరువురికి కుదిరిన ఒప్పందంలో భాగంగా సదరు ఏజెంట్ వద్ద 25 వేల రూపాయలు లంచం తీసుకుంటుండగా ఏసిబి అధికారులు పట్టుకున్నట్టు ఏసిబి డిఎస్‌పి చంద్రశేఖర్ గౌడ్ తెలిపారు. అవినీతి అధికారులను పట్టుకుంటున్నా ప్రభుత్వ అదికారుల్లో ఎలాంటి మార్పు లేకపోవడం దురదృష్టకరం.

# ఉద్యోగ, ఉపాధికి ఊతమందించేలా మెరుగైన శిక్షణ

### నిజామాబాద్ కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/నిజామాబాద్ :** మహిళలు, యువతులకు విరివిగా ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేలా నాణ్యమైనశిక్షణనందించాలనికలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి సూచించారు. రాష్ట్ర మహిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఆర్మూర్ మండలం పెర్కిట్‌లో కొనసాగుతున్న మహిళా, శిశువికాసకేంద్రంలో కలెక్టర్ అధ్యక్షతన గురువారం సలహా సంఘ సమావేశం జరిగింది. ఈ కేంద్రం ద్వారా అందిస్తున్న శిక్షణ కార్యక్రమాలు, పనితీరుపై సమావేశంలో చర్చించి పలు నిర్ణయాలు తీసుకున్నారు. మల్టీ పర్పస్ హెల్త్ వర్కర్, కమ్యూనిటీ హెల్త్ వర్కర్, బ్యూటీషియన్, కంప్యూటర్, ఐటి సెక్టార తదితర కోర్సులలో కొనసాగుతున్న శిక్షణ కార్యక్రమాలపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. అన్ని కోర్సులలో పూర్తిస్థాయిలో సీట్లు భర్తీ అయ్యేలా చర్యలు తీసుకోవాలని, అనాథలు, ఒంటరి మహిళలు, స్వధర్ హోంలలో ఉండే వారు నిరుపేద కుటుంబాలకు చెందిన మహిళలు, యువతులకు ప్రవేశాలలో ప్రాధాన్యత కల్పించాలని కలెక్టర్ సూచించారు. శిక్షణ పూర్తి చేసుకున్న వారు ఇజిటల్ ఎంప్లాయిమెంట్ ఎక్ఛ్సేంచ్ ఆఫ్ తెలంగాణలో ఆన్‌లైన్ ద్వారా పేర్లు నమోదు చేసుకునేలా చూడాలన్నారు. తద్వారా వివిధ పరిశ్రమలు, కార్పోరేట్ ఆస్పత్రులు, సంస్థలలో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించేందుకు ఎక్కువ అవకాశాలుంటాయన్నారు.శిక్షణ పూర్తి చేసుకున్న వారికి స్వయం ఉపాధి పొందేలా కుట్టుమిషన్ల కోసం పిఎం విశ్వకర్మ, పిఎం రోజ్‌గార్ యోజన వంటి పథకాల ద్వారా రుణ సదుపాయం పొందేలా తోడ్పాటు నందించాలని అధికారులకు సూచించారు. పెర్కిట్‌లోని మహిళా, శిశు వికాస కేంద్రం భవనంతో పాటు రాష్ట్ర మమిళా సహకార అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని సుభాష్‌నగర్‌లో కొనసాగుతున్న ఆమోదం తెలిపారు. పనులు నాణ్యతతో చేపట్టి సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షణ జరపాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు. 63వ నెంబర్ జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న మహిళా ప్రాంగణం స్థలాన్ని స్వయం సహాయక మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ ఏర్పాటు కోసం అద్దె ప్రాతిపదికన అందించే ప్రతిపాదనలపై సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని సూచించారు. ప్రాంగణానికి వచ్చే ప్రధాన రహదారిలో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేయించాలని, ప్రాంగణం పరిసరాలలోని పిచ్చిమొక్కలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని ఆర్మూర్ మున్సిపల్ కమీషనర్ రాజును ఆదేశించారు. సమావేశం అనంతరం కలెక్టర్ తరగతి గదులను సందర్శించి వివిధ కోర్సులలో శిక్షణ పొందుతున్న వారికి పలు సూచనలు చేశారు. శిక్షణ పొందటమే కాకుండా మెరుగైన ఉద్యోగ, ఉపాధి అవకాశాలపై అవగాహన ఏర్పర్చుకోవాలని సూచించారు. సమావేశంలో మహిళా ప్రాంగణం జిల్లా మేనేజర్ ఇందిరా, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్‌కుమార్, జిల్లా గిరిజన సంక్షేమశాఖాధికారి నాగురావు, బీసీ సంక్షేమాధికారి నర్సయ్య పాల్గొన్నారు.

### ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు విరివిగా రుణాలు

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా జిల్లాలో లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణం చేపట్టి సొంతింటి కలను సాకారం చేసుకునేలా ప్రభుత్వం తరపున అన్ని విధాలుగా తోడ్పాటు నందిస్తున్నామని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి తెలిపారు. ఇందులో భాగంగానే గృహ నిర్మాణ పనులు ప్రారంభించేందుకు ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులైన మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ, మెప్మా ద్వారా విరివిగా రుణాలు అందిస్తున్నామన్నారు. ఇప్పటివరకు 4348 మంది లబ్ధిదారులకు రూ.50.95 కోట్ల రుణాలు మంజూరు చేశామని కలెక్టర్ వెల్లడించారు. ఇందులో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ద్వారా 3916 మంది లబ్ధిదారులకు 46.59 కోట్లు, మెప్మా ద్వారా 432 మందికి రూ.4.36 కోట్లు ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల కోసం మంజూరు చేశామని తెలిపారు. అర్హులైన ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు సెర్ప్, మెప్మా ద్వారా మరింత విరివిగా రుణాలు అందించడం జరుగుతుందని, లబ్ధిదారులందరూ వెంటనే ఇంటి నిర్మాణ పనులను చేపట్టి త్వరితగతిన పూర్తి చేసుకోవాలని కలెక్టర్ వినయ్‌కృష్ణారెడ్డి హితవు పలికారు.

## నేటి నుండి ఉపాధి పనుల జాతర

### ఎంపిడిఒ అరుణా రాణి

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్:** నేటి నుంచి ఉపాధి పనుల జాతర2025 కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు ఇట్టి పనుల జాతర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని దిలావర్పూర్ యం.పిడిఓ అరుణా రాణి కోరారు. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా గ్రామీణ ప్రాంతాల నిరుపేద కూలీ కుటుంబాల జీవనోపాధి మెరుగుపర్చడానికి,గ్రామాల అభివృద్ధిలో ప్రజలను భాగస్వామ్యం చేయడం,ఆర్థిక సంవత్సరంలో 100 రోజుల పని కల్పించడం పనుల జాతర కార్యక్రమం ముఖ్య ఉద్దేశమని తెలిపారు.మండలంలోని అన్ని గ్రామపంచాయతీలలో అభివృద్ధి పనులు గౌరవ ప్రజా ప్రతినిధులను ఆహ్వానించి వారిచే పనులు ప్రారంభించడం జరుగుతుందన్నారు.

## అర్హులైన గిరిజనులకే ప్రభుత్వ సంక్షేమ ఫలాలు

### కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే

**ప్రజాపక్షం/ఆసిఫాబాద్:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గిరిజనుల సంక్షేమం కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలుజిల్లాలోనిఅర్హులైన గిరిజనులకు అందించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కలెక్టరేట్ భవన సమావేశం మందిరంలో దర్తీ అభజన జాతీయ గ్రామీణ ఉత్కృష్ట అభియాన్‌లో ఆది కర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా బ్లాక్ స్థాయి మాస్టర్ ట్రైనర్లకు ఏర్పాటు చేసిన 3 రోజుల శిక్షణా కార్యక్రమాన్ని జ్యోతి వెలిగించిప్రారంభించారు. కలెక్టర్ మాట్లడుతూ కేంద్ర ప్రభుత్వం గిరిజనుల స్థితిగతులను మార్చేందుకు దర్తీ అభజన జాతీయ గ్రామీణ ఉత్కృష్ట అభియాన్‌లో క్షేత్రస్థాయిలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై కార్యచరణ రూపొందించడంలో భాగంగా ఆది కర్మ యోగి అభియాన్ ప్రారంభించామన్నారు.జిల్లాలో 12 మండలాల నుండి 7 శాఖల అధికారులు బ్లాక్‌స్థాయిమాస్టర్‌శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని, శిక్షణలో భాగంగా ప్రతి అంశంపై అవగాహన కల్పించుకుని మండలంలోని అన్ని గ్రామాల 7 శాఖల అధికారులకు శిక్షణ ఇవ్వాలని తెలిపారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి రమాదేవి, జిల్లా మాస్టర్ శిక్షకులు, పలు శాఖల అధికారులు, బ్లాక్ స్థాయి మాస్టర్ శిక్షకులు పాల్గొన్నారు.






### విద్యార్థులకు నాణ్యమైన విద్య

ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు వారి ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని కలెక్టర్ వెంకటేశ్ ధోత్రే అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని జనకాపూర్ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాల, వసతిగృహాన్ని సందర్శించారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు హాజరు పట్టికలు, పరిసరాలను పరిశీలించారు. కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో గుణాత్మక విద్యను బోధించాలని సూచించారు. జిల్లా గిరిజన సంక్షేమ అధికారి రమాదేవి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు విద్యార్థులు పాల్గొన్నారు.

## యూరియా కోసం రోడ్డెక్కిన అన్నదాత



**ప్రజాపక్షం/రామాయంపేట:** యూరియా కోసం అన్నదాతల ఎదురుచూపులు ఆగడంలేదు... గత వారం పదిరోజులుగా విసిగివేసారిన కర్షకులు తప్పని పరిస్థితిలో రోడ్డెక్కి రాస్తారోకోకు దిగారు. వీరికి బీజేపీ నాయకులు మద్దతు తెలుపడంతో ఒక్కసారిగా ఉద్రిక్త వాతావరణం నెలకొంది. రామాయంపేట మున్సిపాలిటిలో యూరియా కోసం రైతులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు క్యూ లైన్‌లో నిలబడుతున్నారు. అయినా ఒక్క సంచి దొరకడంలేదని నిరసిస్తూ ప్రాథమిక సహకార సంఘం వద్ద రోడ్డుపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. యూరియా కొరతకు ప్రభుత్వమే కారణమని ఆరోపించారు. రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిదులు స్పందించి యూరియా కొరత తీర్చాలని రైతులు డిమాండ్ చేశారు. రాస్తారోకోతో ఇరువైపులా వాహనాలు నిలిచిపోయాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ బాల్ రాజ్ తన సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకొని రైతులకు నచ్చజెప్పి ఆందోళన విరమింపచేశారు.

## గిరిజనులకు విద్య, వైద్యం..

**ప్రజాపక్షం/నిర్మల్:** జిల్లాలో గిరిజనుల అభివృద్ధి కోసం ప్రభుత్వం చేపట్టిన ఆది కర్మయోగి అభియాన్ కింద ప్రత్యేక చర్యలు అమలు చేస్తున్నట్లు స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ వెల్లడించారు. గురువారం సాయంత్రం కలెక్టరేట్‌లో సంబంధిత శాఖల అధికారులతోఆది కర్మయోగి అభియాన్ పథకం అమలుపై ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన జనాభాకు విద్య,వైద్యం,మౌలిక ఆర్థిక సదుపాయాలు అందించడంతో పాటు,గ్రామ స్థాయిలో పాలనను బలోపేతం చేయడం అభియాన్ ముఖ్య ఉద్దేశమని ఆయన స్పష్టం చేశారు. గ్రామ స్థాయిలో అవగాహన సదస్సులు,ప్రచార కార్యక్రమాల ద్వారా చైతన్యం తీసుకురావాలన్నారు.18 లైన్ విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేయాలని,జిల్లా,మండల,గ్రామ స్థాయిల్లో ప్రత్యేక శద్ధ కనబరచాలని అదనపు కలెక్టర్ సూచించారు. జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ,డిఆర్డిఓ విజయలక్ష్మి ,జిల్లా విద్యాధికారి పి.రామారావ్,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్,జిల్లా మత్స్యశాఖ అధికారి జి.రాజ నర్సయ్య,వ్యవసాయ శాఖ అధికారి అంజి ప్రసాద్, ఉద్యావనవన శాఖ అధికారి రమణ, తదితరులున్నారు.

## 'జులై'లో 1708 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు

### పోలీసు కమిషనర్ సాయిచైతన్య వెల్లడి



**ప్రజాపక్షం/నిజామాబాద్‌అర్బన్:** ఈ ఏడాది జులై మాసంలో డ్రంక్ అండ్ డ్రైవ్ నమోదైన కేసులు 1708 అని, ఇందులో న్యాయస్థానంలో 966 మంది నేరాన్ని ఒప్పుకొనగా 77 మందికి జైలు శిక్ష విదించడం జరిగిందని నిజామాబాద్ పోలీసు కమిషనర్ పి. సాయిచైతన్య అన్నారు. గురువారం కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో గత జులై నెలలో డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల వివరాలను విలేకరుల సమావేశంలో వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు 1708 లో 966 మంది నిందితులపై అభియోగాలు మోపుతు చార్జిషీట్‌లు గౌరవ న్యాయస్తానాలలో వేయగా 966 మంది కేసులలో నిందితులు నేరాన్ని ఒప్పుకోగా, ఇందులో 77 కేసులలో జైలు శిక్షలు విధించడం జరిగిందన్నారు. మిగతా కేసులలో జరిమానాలు విధించినతర్వాత అట్టి వాహనం నడిపిన డ్రైవర్, డ్రైవర్ యొక్క డ్రైవింగ్ లైసెన్సు సస్పెండ్ చేయమని ఆర్‌టిఏ అధికారులను కోరగా గత జులై నెలలో మొత్తం 62 డ్రైవింగ్ లైసెన్సులు సస్పెండ్ చేసినట్టు తెలిపారు. కావున వాహనదారులు ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడపరాదని వాహనాలు ఎవ్వరికి ఇవ్వరాదని పేర్కొన్నారు.

## ఆన్‌లైన్ డిజిటల్ బ్యాంకు లావాదేవీలపై అవగాహన ఉండాలి

**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా విద్యార్థి దశ నుంచి డిజిటల్ ఆర్థిక లావాదేవీల పైన అవగాహన కల్పించే కార్యక్రమాన్ని దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న నేపథ్యంలో గురువారం రోజున స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో సత్యజిత్ గోష్ బృందం విద్యార్థులకు బ్యాంక్ ఆన్‌లైన్ లావాదేవీలకు సంబంధించిన ఆర్‌టిజిఎస్,యుపిఐ,ఆధార్ ఆధారిత లావాదేవీలు,డెబిట కార్డు,క్రెడిట్ కార్డు మొదలై వాటికి సంబంధించిన కనిష్ట,గరిష్ఠ లావాదేవీల గురించి వాటిని ఎలా ఉపయోగించాలి మొబైల్ బ్యాంకింగ్ ఇంటర్నెట్ బ్యాంకింగ్ వితౌట్ ఇంటర్నెట్ తో కూడ ఆర్థిక లావాదేవీలు నిర్వహించే అవకాశాన్ని ఆన్‌లైన్ బ్యాంకింగ్ మోసాలు గురించి మాట్లాడుతూ,అపరిచిత వ్యక్తులు ఏటీఎం పిన్ నెంబర్ గాని,యూపీఐ పిన్ నెంబర్ గాని ఇంటర్నెట్ బ్యాంకింగ్ పాస్ వర్డ్ కోసం మీకు ఫోన్ చేసి మేము బ్యాంకు ఉద్యోగులం అని నమ్మకం కలిగే విధంగా మాట్లాడుతూ ఎట్టి పరిస్థితుల్లో ఫోన్ ద్వారా మీ యొక్క సమాచారాన్ని అందించకూడద,మీయొక్క సంబంధిత బ్రాంచికి వెళ్లి మాత్రమే మీ కేవైసీని పూర్తి చేసపుకోవాలి అంతే గాని లింకుని పైన క్లిక్ చేయడం చేయకూడదు సత్యజిత్ గోష్ వివరించడం జరిగింది.ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ పి.సుదర్శన్, రిజర్వు బ్యాంకు అధికారి సత్యజిత్ గోష్, నిర్మల్ లిడ్ బాంకు మేనేజర్ రామ్ గోపాల్ ఇతర బాంకు సిబ్బంది ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి మాలెపు కృష్ణ,అధ్యాపకులు పాల్గొన్నారు.




## నానోతోనే పర్యావరణ పరిరక్షణ



### మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

**ప్రజాపక్షం/రామాయంపేట:** రసాయన ఎరువులకు దీటుగా నానో యూరియాతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని రైతులు నానో యూరియా వైపు మొగ్గు చూపాలని ఇందుకు అధికారులు రైతులకు అవగాహన కల్పించాలని మెదక్ జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ అన్నారు. గురువారం మండలంలోని తొనిగండ్ల గ్రామంలో రైతు ఆంజనేయులు నానో యూరియా వాడకంతో చేస్తున్న వ్యవసాయాన్ని డిఏవో, వ్యవసాయాదికారులతో కలిసి పంట పొలాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ నానో యూరియా వాడకం వల్ల దిగుబడి వస్తుందన్నారు. నానో యూరియా అనేది నానో టెక్నాలజీ సహాయంతో తయారు చేయబడిన ద్రవ రూపంలో ఉండే ఎరువు అని దీనిని వాడడం వల్ల అనేక ప్రయోజనాలు ఉన్నాయన్నారు. నానో యూరి యా మొక్కలకు సమర్దవంతంగా నత్రజనిని అందిస్తుందని, పంట దిగుబడిని పెంచడంలో సహాయపడుతుందన్నారు. సాంప్రదాయ యూరియా వాడటం వల్ల పర్యావరణ కాలుష్యం, భూగర్భజల వనరులకు ఇబ్బంది కలగడమే కాకుండా నేలకు కూడా నష్టం కలుగుతుందన్నారు. సాంప్రదాయ యూరియాతో పోలిస్తే నానో యూరియా తక్కువ మొత్తంలో వాడడం వల్ల ఇది మట్టి, నీటి కాలుష్యాన్నితగ్గిస్తుందన్నారు. అధిక దిగుబడితో పాటు మెరుగైన పోషక విలువలతో కూడిన పంటలను పండించడానికి నానో యూరియా సహాయపడుతుందన్నారు. క్షేత్ర స్థాయిలో రైతులతో సమావేశపరిచి నానో వాడకంపై అవగాహన కల్పించాలన్నారు. జిల్లాలో యూరియా కొరత ఉందని వస్తున్న పుకార్లను రైతులు నమ్మద్దన్నారు. రాబోయె వారంలో జిల్లాకు వెయ్యి నుండి 15వందల మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులోకి వస్తుందన్నారు. రైతులు అవసరం మేరకే ఎరువులను వాడాలని సూచించారు. ఈకార్యక్రమంలో జిల్లా వ్యవసాయాదికారి దేవ్‌కుమార్, సహాయ వ్యవసాయ సంచాలకులు రాజ్‌నారాయణతోపాటువ్యవసాయాదికారులు, రైతులున్నారు.

### సీజనల్ వ్యాధులతో జాగ్రత్త

సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండలాని కలెక్టర్ రాహుల్‌రాజ్ సూచించారు. గురువారం రామాయంపేట మున్సిపాలిటిలో పర్యటించిన ఆయన పలు కాలనీల్లో తిరిగి ప్రజలకు అవగాహన కల్పించారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో గత వారం రోజులుగా కురిసిన వర్షాలు తగ్గుముఖం పట్టాయని పారిశుద్య కార్యక్రమాల్లో బాగంగా పరిసరాలను పరిశుభ్రతపై దృష్టి సారించాలన్నారు. కాచి చల్లార్చిన నీటితో పాటు వేడి వేడి ఆహార పదార్థాలు తీసుకోవాలని సూచించారు.

## కంజర్‌లో వీధి దీపాలు వెలిగాయి

### 'ప్రజాపక్షం' కథనానికి స్పందన

ప్రజాపక్షం ఎఫెక్ట్



**ప్రజాపక్షం/దిలావర్‌పూర్ :** ఆదివారం ''ప్రజాపక్షం'' దినపత్రికలో ప్రచురితమైన వెలగని వీధి దీపాలు అనే కథనానికి అధికారులు స్పందించారు.కథనంలో పేర్కొన్న సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకున్నారు. కంజర్ గ్రామంలో వెలగని వీధి దీపాలను అధికారులు సరిచేయించడంతో గ్రామంలో మళ్ళీ వెలుగులు నిండాయి. అంతేకాకుండా,ఈ కథనంలో లేవనెత్తిన ఇతర సమస్యలైన చెత్త సేకరణ,పారిశుద్ధ్యంపై కూడా అధికారులు దృష్టి సారించారు.చెత్త సేకరించడానికి,పారిశుద్ధ్య పనుల కోసం ప్రత్యేకంగా కార్మికులను నియమిస్తామని తెలిపారు. పారిశుద్ధ్య కార్మికులకు మూడు నెలల వేతనం అందించడం జరిగిందని తెలిపారు. ఈ సమస్యల పరిష్కారానికి వెంటనే స్పందించిన అధికారులకు గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు. మిగతా సమస్యలను కూడా అధికారులు ఇదే చొరవతో త్వరగా పరిష్కరించి,గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచుతారనే ఆశాభావం వ్యక్తం చేశారు.




# ప్రజలతో మమేకమై సమస్యలు పరిష్కరించాలి

## ప్రతీ నాయకుడూ కార్యకర్త మాదిరిగా కృషి చేయాలి

### సిపిఐ మహాసభల్లో ప్రతినిధుల పిలుపు




ప్రజాపక్షం / కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజుల రామారం)

క్షేత్రస్థాయిలో ప్రజలతో మమేకమై వారి సమస్యలను పరిష్కరించడం ద్వారా సిపిఐ బలోపేతానికి పార్టీలోని ప్రతి నాయకుడు, కార్యకర్త కృషి చేయాలని పలువురు సిపిఐ నాయకులు అన్నారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలో కార్యదర్శి కూనంనేని సాంబశివరావు ప్రవేశపెట్టిన రాజకీయ, నిర్మాణ నివేదికపై రెండో రోజు గురువారం చర్చలో వివిధ జిల్లాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రతినిధి రాజారెడ్డి( జనగాం) మాట్లాడుతూ తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటంతో పేదలకు పంపిణీ చేసిన భూములు మళ్లీ కేంద్రీకృతం అవుతున్నాయని, ఈ కీలక భూసమస్యపై సిపిఐ మరో ఉధృతమైన భూపోరాటం నిర్వహించేందుకు సంసిద్ధం కావాలన్నారు. గోదా శ్రీరాములు (యాదాద్రి భువనగిరి) మాట్లాడుతూ గ్రామ స్థాయి నుంచి ప్రజల్లో మమేకం కావడం ద్వారా పార్టీకి పూర్వ వైభవం తీసుకురావాల్సి ఉందన్నారు. ఎల్. దశరథ (కామారెడ్డి ) మాట్లాడుతూ తమ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్నామని, గత ఏడాదితో పొల్చితే మరింతగా పార్టీ విస్తరించిందన్నారు. పేదల పక్షాన మరింత బలమైన పోరాటాలు నిర్వహించాల్సి ఉందని మంద పవన్ (సిద్దిపేట) అన్నారు. కె.భిక్షపతి (హన్మకొండ ) మాట్లాడుతూ హన్మకొండలో 15 ప్రాంతాల్లో భూపోరాటాల ద్వారా పేదలకు ఇళ్ల స్థలాలను పంపిణీ చేయడం దేశంలో రాష్ట్రంలో చర్చనీయాంశంగా మారిందన్నారు. ఫారుఖ్ (మెదక్), ప్రభాకర్‌రెడ్డి (ఆదిలాబాద్) మాట్లాడుతూ భారీ వర్షాలతో ఆదిలాబాద్ జిల్లా తీవ్రంగా నష్టపోయిందని, రైతులకు ఎకరాకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు ఇళ్లు కొల్పోయిన వారికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలన్నారు. విజయ సారథి (మహబూబ్‌నగర్) కె.నీరజ్ కుమార్ (భూపాలపల్లి), బెజవాడ వెంకటేశ్వర్లు (సూర్యాపేట), మర్రి వెంకటస్వామి (కరీంనగర్), విజయలక్ష్మి (వికారాబాద్), ఇ.ఉమా మహేశ్ (మేడ్చల్ మల్కాజ్‌గిరి), షేక్ బాష్‌మియా (వరంగల్), తాండ్ర సదానందం( పెద్దపల్లి), మాట్లాడుతూ జిల్లాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై ఎక్కడిక్కడ ఆందోళనలు నిర్వహించేందుకు కార్యాచరణ రూపొందించాలాన్నారు. వాసిరెడ్డి సీతారామయ్య, (సింగరేణి), ఎస్.బాల్‌రాజు (ఎఐటియుసి) తోట మల్లికార్జునరావు, అంజయ్య నాయక్ (గిరిజన సమాఖ్య) మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మికుల వ్యతిరేక విధానాలను నిరసిస్తూ మరింత పెద్ద ఎత్తున ఉద్యమాలకు సిద్ధం కావాలని, తద్వారానే సమస్యలు పరిష్కరం అవుతాయని అన్నారు.



## 'దళిత వాయిస్' పుస్తక మొదటి సంచికను ఆవిష్కరించిన డి.రాజా



ప్రజాపక్షం / కామ్రేడ్ పొట్లూరి నాగేశ్వర్ రావు నగర్ (గాజుల రామారం)

దేశవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న అత్యాచారాలు, కుల వివక్షతకు వ్యతిరేకంగా పోరాడాలని సిపిఐ ప్రధాన కార్యదర్శి డి.రాజా పిలుపునిచ్చారు. స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు గడిచినా ఇంకా కుల వివక్షత, దళితులు, బడుగు బలహీనవర్గాలపై అత్యాచారాలు కొనసాగుతుండడం పట్ల ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభలలో రెండో రోజు గురువారం తెలంగాణ రాష్ట్ర దళిత హక్కుల పోరాట సమితి (డిహెచ్‌పిఎస్) ఆధ్వర్యంలో ప్రచురిస్తున్న 'దళిత వాయిస్' ఆగస్టు – సెప్టెంబర్ మొదటి సంచికను డి.రాజా ఆవిష్కరించారు. కార్యక్రమంలో సిపిఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకట రెడ్డి, పశ్య పద్మ, జాతీయ సమితి సభ్యులు పల్లా వెంకట రెడ్డి, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్ కూనంనేని సాంబశివరావు, ఎంఎల్‌సి నెల్లికంటి సత్యం, 'దళిత వాయిస్' గౌరవ సలహాదారులు ఎం.బాల నరసింహా, సంపాదకులు కె.ఏసురత్నం, డిహెచ్‌పిఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.మారుపాక అనిల్ కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాజా మాట్లాడుతూ సమాజంలో దళితులు, అల్పసంఖ్యాకుల వర్గాల ప్రజల సమస్యలపై దృష్టి సారించి వాటి పరిష్కారానికి ఉద్యమాలు చేయాలన్నారు. మార్క్సిజం, అంబేద్కరిజం దేశ పరిస్థిలకు అన్వయించుకోవాలన్నారు. దళితుల సమస్యలపై దేశవ్యాప్తంగా అఖిల భారత హక్కుల ఉద్యమం (ఎఐడిఆర్‌ఎం) పోరాటాలు చేస్తుండడం, ఇటీవల హైదరాబాద్ లో ఆ సంఘం మహాసభలను నిర్వహించడం ద్వారా భవిష్యత్ పోరాట కార్యక్రమాన్ని నిర్ణయించడం హర్షణీయమన్నారు.


ప్రజాపక్షం దినపత్రికను చదువుతున్న సిపిఐ జాతీయ కార్యదర్శి డి.రాజా


తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణతో...


ప్రజానాట్యమండలి కళాకారుల బృందం ఆటా... పాటా..




నవచేతన బుక్‌హౌస్‌లో పుస్తకాలు తిలకిస్తూ....


కందిమళ్ళ ప్రతాపరెడ్డితో డి.రాజా కరచాలనం


సభా ప్రాంగణంలోని సిపిఐ నాయకుల ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న డి.రాజా

**సిపిఐ తెలంగాణ రాష్ట్ర 4వ మహాసభల రెండో రోజు చిత్రమాలిక**

ఫొటోలు.. అనిల్


కూనంనేని సాంబశివరావు, మారుపాక అనిల్ కుమార్, నెల్లికంటి సత్యం ముచ్చట్లు


మహిళా ప్రతినిధులు


సిపిఐ మహాసభల్లో వాలంటీర్లు


ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు


ఏఐవైఎఫ్ ప్రతినిధులు

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at Baddam Yella Reddy Bhavan, Ganesh Nagar, KARIMNAGAR 505001 Telangana State. RNI TELTEL /2018/76746, **Editor : Makkena Subbarao,** E-mail : editorprajapaksham@gmail.com